ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్ర మాసం, తిథి: శుద్ధ పంచమి మ. 2.10 వరకు, అనంతరం షష్ఠి; నక్షత్రం: కృత్తిక సా. 6.30 వరకు, అనంతరం రోహిణి; అమృతకాలం: సా. 4.15 నుండి 5.45 వరకు; వర్జ్యం: ఉ. 6.59 నుండి 8.30 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com   Journalism first!

సంపుటి: 62 • సంచిక: 71 • గురువారం 22 మార్చి 2018 • విజయవాడ • పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



తిరుమలలో బుధవారం శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీఎం చంద్రబాబు, మనవడు దేవాన్ష్ 3లో

ప్రజాస్త్రమే మా బ్రహ్మాస్త్రం

- కేంద్రంపై తెదేపా ఎంపీల ఆగ్రహం
- రాజకీయ ఎత్తుగడతోనే సభ వాయిదా
- సత్యహరిశ్చంద్ర పాత్రధారణతో ఆకట్టుకున్న శివప్రసాద్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నాలుగవ రోజు కూడా అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ స్వీకరించకపోవడంపై తెలుగుదేశం పార్టీ ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మంత్రి పదవులకు రాజీనామా, ఎన్డీయే కూటమి నుంచి వైదొలగడం, చివరకు అవిశ్వాస తీర్మానం వంటి ఎన్ని అస్త్రాలు ప్రయోగించినా కేంద్రం ప్రభుత్వంలో చలనం లేకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఇక తమ దగ్గరున్న అస్త్రాలన్నీ అయిపోయాయని, ఇక బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తామని వ్యాఖ్యానించారు. ప్రజలే తమ బ్రహ్మాస్త్రమని, ఓటు ద్వారా వారిచ్చే తీర్పే ఆ అస్త్రాన్ని ప్రయోగించడమని వివరించారు. ప్రతి రోజు 9వ పేజీలో...

పోరాటాలకు సై

- రోడ్ల దిగ్బంధనానికి మద్దతిస్తున్నాం • శాంతి భద్రతలకు భంగం కల్గించవద్దు
- ఢిల్లీ చుట్టూ తిరిగినా న్యాయం దొరకలా • అందుకే కేంద్రం, ఎన్డీయే నుంచి తప్పుకున్నాం • వైకాపాది లోపల అవిశ్వాసం, బయట విశ్వాసం • కేంద్రాన్ని వదిలి పవన్ తెదేపాపై ఆరోపణలు • సాధికార మిత్ర సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

...విభజనతో తీరని అన్యాయం జరిగింది... హామీల అమలు కోరుతూ ఢిల్లీ చుట్టూ 29 సార్లు తిరిగా... న్యాయం చేయకపోగా, దేశ రక్షణ కోసం ఇచ్చే నిధులు అడుగుతున్నానని అపవాదు వేశారు. కేంద్ర కేబినెట్, ఎన్డీయే నుంచి బయటకు వచ్చాం... అవిశ్వాస తీర్మానం పెట్టాం... అయినా కేంద్రంలో కదలిక లేదు. వైకాపా లోపల అవిశ్వాసం, బయట విశ్వాసం అంటోంది... కేంద్రాన్ని వదిలిన పవన్ కల్యాణ్ తెదేపాపైనే నిందారోపణలు చేస్తున్నారు... ప్రత్యేక హోదా ఇవ్వనందుకు నిరసనగా గురువారం రహదారుల దిగ్బంధానికి వామపక్షాలు పిలుపునిచ్చాయి... మేం కూడా మద్దతిస్తున్నాం... ఏ పోరాటానికైనా సిద్ధమే... శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దు... కేంద్రం న్యాయం చేసేవరకూ పోరాటం ఆగదు...



అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్రంలో ఉన్న ప్రభుత్వాల వల్ల అనాదిగా తెలుగుజాతి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తూనే ఉందని, ప్రస్తుతం కూడా అవే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశంతో తెలుగువారికి ఆత్మగౌరవం లభించిందని చెప్పారు. తాజాగా జరిగిన అశాస్త్రీయ విభజనతో అప్పులు ఒకవైపు, ఆస్తులు మరోవైపు వెళ్ళిపోయాయన్నారు. ఆ తరువాత పరిణామాలతో రాష్ట్రానికి న్యాయం చేస్తుందన్న ఉద్దేశ్యంతో బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని, నాలుగేళ్లు గడిచినా రాష్ట్రానికి ఏమాత్రం న్యాయం చేయకపోగా సహకారం కూడా అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే బీజేపీతో మైత్రి బంధాన్ని వదులుకొని ఎన్డీయే నుంచి బయటకు వచ్చామన్నారు. బుధవారం ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాల్‌లో సాధికార మిత్రలతో సీఎం చంద్రబాబు నాయుడు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 29 సార్లు ఢిల్లీ వెళ్ళి విజ్ఞప్తి చేసినా ఏ ఒక్కటి నేరవేర్చలేదన్నారు. చివరి బడ్జెట్ సమావేశాలకు ముందు కూడా ప్రధాని మోడీని కలిసి రాష్ట్రానికి చేయూతనివ్వాలని కోరారని, అయినా కూడా ఫలితం లేదన్నారు. దీంతో కేంద్రంపై పోరాటానికి దిగామని చెప్పారు. అయితే వైకాపా, జనసేన పార్టీలు లాలూచీ రాజకీయాలు చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను అడ్డుకుంటున్నాయని ఆగ్రహించారు. బీజేపీ ఈ రెండు పార్టీలతో ఎదురుదాడి చేయిస్తుందని ఆరోపించారు. కొంతమంది లోపల అవిశ్వాసం పెట్టి బయటకు వచ్చి ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, ప్రధానమంత్రి ఏ1, ఏ2 ముద్దాయిలను ఎలా పక్కన కూర్చోబెట్టుకుంటారని చంద్రబాబు ప్రశ్నించారు. మరోవైపు 3వ పేజీలో...



గోడమీద రాత... అవిశ్వాసం రేపు!

- వెల్‌లోకి తెరాస, అన్నాడీఎంకే
- సభ సజావుగా లేదు: స్పీకర్
- రాజ్యసభలోనూ అదే తంతు
- పార్లమెంట్‌లో వాయిదాల పర్వం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మళ్లీ అదే సీన్. పాత కథే పునరావృతమైంది. అవిశ్వాస తీర్మానం నోటీసుపై లోక్‌సభలో చర్చ జరగలేదు. కేంద్ర ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను బుధవారం కూడా చర్చ చేపట్టలేకపోయారు. పార్లమెంటు సమావేశాలు ఉదయం 11గంటలకు ప్రారంభంకాగానే విపక్షాల ఆందోళనతో క్షణాల వ్యవధిలోనే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్, టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఎంపీల ఆందోళనల మధ్యనే అవిశ్వాస తీర్మానాలకు 9వ పేజీలో...



అవినీతి పట్టుసీమ

- రూ. 350 కోట్ల అవినీతి
- కాగ్ నివేదికలో వెల్లడి
- అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్
- బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు దుమారం
- అసెంబ్లీలో టీడీపీ వర్సెస్ బీజేపీ
- మూడేళ్లు నిద్రపోయి ఇప్పుడు నిందలా?
- ప్రాజెక్టుపై బురద జల్లితే పుట్టగతులుండవు
- రైతు ద్రోహి బీజేపీ
- మండిపడిన మంత్రి దేవినేని

అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా-గోదావరి నదుల అనుసంధానంలో కీలకపాత్ర పోషించిన పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణంపై బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వాడీవేడి చర్చ జరిగింది. అధికార తెలుగుదేశం, బీజేపీ పార్టీ నేతల మధ్య మాటలయుద్ధం కొనసాగింది. అవినీతి జరిగిందని ప్రభుత్వ సంస్థ అయిన కాగ్ చెబుతుందని బీజేపీ సభ్యుడు విష్ణు కుమార్ రాజు ప్రస్తావించగానే తెలుగుదేశం నుండి మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కింజరపు అచ్చం నాయుడు, కాల్వ శ్రీనివాసులు బీజేపీ నేత విష్ణు కుమార్ రాజుపై మాటల దాడి చేశారు. దీంతో 2వ పేజీలో...



యూనివర్శిటీ పోస్టులకు త్వరలో స్క్రీనింగ్ టెస్ట్

- ఏప్రిల్ 9 నుంచి 13 వరకు ఆన్‌లైన్ పరీక్ష
- మంత్రి గంటా వెల్లడి

ఏయూకు అరుదైన హోదా!

- గ్రేడెడ్ అటానమీగా గుర్తింపు
- నైపుణ్య కోర్సులకు శ్రీకారం

7లో

రాజకీయ ఫేస్‌బుక్!

- ప్రచారంలో కీలకంగా సోషల్ మీడియా
- ట్రంప్ ఎన్నికల్లో ఖాతాదార్ల వివరాలు లీక్
- మనదేశంలో 20 కోట్ల మంది ఫేస్‌బుక్ సభ్యులు
- అకౌంట్లు వెల్లడిస్తే శిక్ష తప్పదని భారత్ హెచ్చరిక
- ప్రచారానికి ఆధారపడిన పార్టీలకు ఆశాభంగమే



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి) ప్రపంచ వ్యాప్తంగా ఎన్నికల ప్రచార విధానాల్లో కూడా మార్పులొచ్చేశాయి. సామాజిక మాధ్యమాలే ఇప్పుడు ఈ ప్రచారంలో కీలకంగా మారాయి. గతంలో అభ్యర్థులు, పార్టీల నాయకులు ఇంటింటికి తిరిగి తమ లక్ష్యాలు వివరించేవారు. తమ భవిష్యత్ కార్యాచరణను విశదీకరించేవారు. వ్యక్తులే ప్రాతిపదికగా హామీలు గుప్పించి ఓట్లు అభ్యర్థించేవారు. రాన్రాను సాంకేతికత అభివృద్ధి చెందింది. అమెరికా, యూరోప్ దేశాల్లో టీవీల ద్వారా ప్రచారం జోరందుకుంది. అభ్యర్థుల మధ్య వాదోపవాదాలు, పరస్పర ఆరోపణలు, హామీల ఘట్టాలన్నింటికి టీవీ స్టూడియోలే వేదికలుగా మారాయి. దాదాపు 80శాతం ప్రచారం టీవీలు, రేడియోలు, ఇతర సమాచార మాధ్యమాల ద్వారానే జరిగేది. ఇప్పుడు సామాజిక మాధ్యమాలు ప్రవేశించాయి. ఇవి టీవీలు, ఇతర ప్రచార, ప్రసార మాధ్యమాల్ని కూడా వెనక్కి నెట్టేశాయి. గత ఏడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో సామాజిక మాధ్యమాలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాయి. వ్యక్తుల వద్దకు చేరేందుకు ఇవి సులువైన మార్గాలుగా అవతరించాయి. ఇతర మాధ్యమాలతో పోలిస్తే వ్యయం తక్కువ.. వేగం ఎక్కువ. చెప్పాలనుకున్న అంశాన్ని క్లుప్తంగానే కాకుండా విపులంగా కూడా విశదీకరించే అవకాశం 3వ పేజీలో...

ఏప్రిల్ 2 నుంచి హెచ్-1బి వీసాలు

- ప్రీమియం వీసాల ప్రక్రియ నిలుపుదల
- అమెరికాలో ఎమ్మెస్ చేసిన వారికి ప్రాధాన్యం



వాషింగ్టన్: అమెరికా హెచ్-1బి వీసా దరఖాస్తులను ఏప్రిల్ రెండవ తేదీ నుంచి ఆమోదించడం ప్రారంభిస్తుందని యుఎస్ పౌరసత్వం మరియు వలస సేవలు(యుఎస్‌సిఐసి) ఫెడరల్ ఏజెన్సీ బుధవారం ప్రకటించింది. అయితే ఫిస్కల్ క్యాప్‌కు లోబడి అలాంటి వర్క్ వీసాల ప్రీమియమ్ ప్రాసెసింగ్‌కు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు యుఎస్‌సిఐసి వెల్లడించింది. 2018, అక్టోబర్‌తో ప్రారంభమయ్యే 2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్-1బి పిటిషన్ ఫైలింగ్ ఉంటుంది. ప్రీమియమ్ ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో హెచ్-1బి యావత్ ప్రాసెసింగ్ సమయం తగ్గుతుందని యుఎస్‌సిఐసి పేర్కొంది. అదే సమయంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పిటిషన్లను తాను ప్రాసెసింగ్ 5వ పేజీలో...

ఔరా..!



జమ్మూలో ఎన్‌కౌంటర్

- ఐదుగురు ఉగ్రవాదుల హతం • ముగ్గురు జవాన్లు, ఇద్దరు పోలీసుల మృతి

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి తెగబడ్డారు. కుప్వారా జిల్లాలో మిలిటెంట్లు జరిపిన కాల్పుల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది, మరో ఇద్దరు పోలీసులు అమరులు కాగా.. ఒక పోలీసు గాయపడ్డారు. కుప్వారా జిల్లాలోని ఆరాంపొరా ప్రాంతంలో మంగళవారం మిలిటెంట్లు కాల్పులకు తెగబడగా.. భద్రతా బలగాలు, జమ్ము కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా మిలిటెంట్ల ఏరివేతకు ఆపరేషన్ చేపట్టారు. కూంబింగ్‌లో ఐదుగురు మిలిటెంట్లు హతమయ్యారు. అయితే ఆరాంపొరా పరిసర ప్రాంతాల్లోనే దాగిన మిలిటెంట్లు 5వ పేజీలో...



వెంటనే వర్శిటీలు!

- త్వరగా ఏర్పాటు చేయండి • మంత్రులతో వెంకయ్య సమీక్ష • ఈ ఏడాదే ప్రారంభించాలని సూచన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన విశ్వవిద్యాలయం, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయడంపై ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేసిన సూచనలకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్, ఆ శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యం, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్‌తో విద్యాసంస్థల ఏర్పాటుపై ఉపరాష్ట్రపతి బుధవారం ఉదయం పార్లమెంటులోని తన కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో కేంద్ర 7వ పేజీలో...





కరవును జయించాం ఉత్పత్తి పెంచాం

- ప్రకృతి వ్యవసాయంలో మనదే అగ్రస్థానం
- టెక్నాలజీ వినియోగంతో లాభసాటిగా సేద్యం
- ఈసారి నెలముందే పట్టిసీమ జలం
- శాసనసభలో వ్యవసాయ బడ్జెట్‌పై చర్చలో సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గతి తప్పిన వ్యవసాయ రంగాన్ని కొత్తపుంతలు తొక్కించడానికి, ఈ రంగాన్ని లాభసాటిగా చేయడానికి తమ ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా వ్యూహాత్మకంగా వ్యవహరించిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. 10 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో 1978 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, గత నాలుగేళ్లలో 242 మంది రైతులు వివిధ కారణాల రీత్యా ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధరలు, అదే సమయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని బుధవారం రాష్ట్ర శాసనసభలో 'వ్యవసాయ అనుబంధ అంశాలపై జరిగిన లఘు చర్చలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ పార్టీ హయాంలో నాసిరక విత్తనాలు విలయతాండవం చేసేవని, అంతే కాక అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు రైతులకు చేరువలో ఉండేవి కావని, తమ ప్రభుత్వం పలు ప్రణాళికలను రచించి ఆ దుస్థితిని తొలగించిందన్నారు. నవ్యాంధ్ర ఏర్పడిన అనంతరం తమ ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ రంగాలకు మిక్కిలి ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేస్తూ, ఈ రంగాలను రైతులకు ప్రయోజనం కలిగేలా తీర్చి దిద్దడానికి ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సంవత్సరం 13.6 శాతం వర్షపాతం తక్కువ నమోదైనప్పటికీ వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచగలిగామన్నారు. ఈ సానుకూల వాతావరణం ఏర్పడటానికి ఆయన కొన్ని కారణాలను సభ ముందు ఉంచారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని సారవంతమైన భూమికి అనుసంధానం చేసి, భూసార పరీక్షలను నిర్వహించడం ద్వారా గత ఏడాది వ్యవసాయ, అనుబంధ, ఉద్యానవన ఉత్పత్తులను పెంచి రైతుకు ఊరట కలిగించామని, ఇలాంటి వ్యూహంతోనే సాగుతూ ముమ్మందు రైతులు, రైతు కూలీలకు దన్నుగా నిలిచి తద్వారా సమీప భవిషత్‌లో వ్యవసాయ ఉత్పత్తి రంగంలో మన రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుపుతామని సభ్యుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రాష్ట్రం 34 శాతం వృద్ధి రేటును సాధించిందని, కోటి ఎకరాలలో ఉద్యానవన పంటలను పండించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో కరువు బారిన పడిన 20 లక్షల ఎకరాలలో రెయిన్ గన్స్‌ను వినియోగించడం, గత రెండు సంవత్సరాలుగా 6.50లక్షల నీటి కుంటలను ఏర్పాటు చేసిన కారణంగా అధిక వ్యవసాయ ఉత్పత్తులను నమోదు చేయ గలిగామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి సేద్యంపై రైతాంగానికి శిక్షణనిప్పించడం, సువ వారం రెండు లక్షల ఎకరాలలో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టడం కూడా అధికదిగుబడులు నమోదు అవ్వడానికి దోహదపడ్డాయన్నారు. నాణ్యమైన విత్తనాలను ఆంధ్రప్రదేశ్‌కే కాక ఇతర రాష్ట్రాలలోని రైతాంగానికి అందుబాటులో ఉంచడానికి తమ ప్రభుత్వం రూ.700 కోట్ల మొత్తాన్ని కేటాయించి కర్నూలులో 'మెగా సీడ్ పార్క్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

అత్యధిక స్థాయిలో దిగుబడులను రాబట్టడానికి 4,500 మంది వ్యవసాయ విస్తరణాధికారులను నియమించామని, మిలిండా- గేట్స్ సంస్థ అందించే సాంకేతిక సహకారంతో ఏ భూమిలో ఏ పంటను ఏ సమయంలో పండించాలి అనే అంశంపై రైతులకు స్పష్టమైన, సమగ్రమైన అవగాహన కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. వ్యవసాయానికి ప్రధాన వనరైన సాగునీటిని రైతులకు అందుబాటులో ఉంచడానికి త్వరలోనే పట్టిసీమ, చింతలపూడి నీటి ప్రాజెక్టుల ద్వారా గోదావరి, కృష్ణ డెల్టాకు మరో 200 టీఎంసీల నీటిని తెస్తామని ఆయన వివరించారు. తుఫాన్లు ఏ సమయంలో సంభవిస్తాయన్న దానిపై ముందస్తు సమాచారాన్ని తెలుసుకునే రీతిలో పలు దేశాల్లో అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీని మన రాష్ట్రంలో కూడా వినియోగించనున్నామన్నారు.

ప్రభుత్వ వ్యవసాయ విధానం అద్భుతం

శాసనసభలో ప్రభుత్వానికి సభ్యుల వినతి



వ్యవసాయ రంగాన్ని ప్రాధాన్యతగా చేసుకుని చంద్రబాబు ప్రభుత్వం పలు వినూత్న చర్యలను చేపట్టిన కారణంగా గత ఖరీఫ్ సీజన్‌లో ముయు ఎన్నడూ లేని రీతిలో రైతులు అధిక దిగుబడులు సాధించారని పలువురు టిడిపి శాసన సభ్యులు ప్రభుత్వాని ప్రస్తుతించారు. బుధవారం శాసనసభలో వివిధ శాఖల పని తీరుపై సభ్యులు తమ అభిప్రాయాన్ని వెల్లడించడానికి స్పీకర్ అనుమతిచ్చారు. చర్చలో పాల్గొన్న సభ్యులందరూ ప్రభుత్వ వ్యవసాయ విధానంపై ప్రసంగించారు. 65 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడిన మన రాష్ట్రంలో పట్టిసీమ ప్రాజెక్టు పరుగులు తీస్తున్న నేపథ్యంలో 11 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని, దీనితో డెల్టా రైతాంగానికి ఎంతో ప్రయోజనం కలిగిందని తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు. గుడ్లు ఉత్పత్తిలో రాష్ట్రం నెంబర్ వన్ గా నిలించిదని ఆయన అన్నారు. మరో సభ్యురాలు గీత మాట్లాడుతూ ఉద్యాన పంటలు పండించే రైతుల రుణాలను మాఫీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయం రంగంలో విదేశీ టెక్నాలజీని ప్రవేశపెట్టి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. మండల కేంద్రాల్లో రైతుబజార్లను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరో సభ్యుడు రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్వామినాథన్ సిపార్సులను అమలు చేసేనిమిత్తం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. గౌతు శివాజీ, శేషారావు, సత్యప్రభ, ఆనందరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, గిడ్డి ఈశ్వరి తదితర సభ్యులు కూడా ప్రభుత్వానికి వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కొన్ని సూచనలు చేశారు.

12 ప్రాజెక్టులు పూర్తి


రాష్ట్రంలో నీటి భద్రత కోసం ఇప్పటికే 12 ప్రాజెక్టులను పూర్తి చేశామని, నదుల అనుసంధానం ద్వారా, పంటకుంటలు, రెయిన్ గన్స్ వినియోగం ద్వారా భవిషత్‌లో రైతులకు సాగునీటి కొరత లేకుండా చేయడానికి తమ ప్రభుత్వం అందివస్తున్న ప్రతి సదుపాయాన్ని వినియోగించుకుంటుందన్నారు. రైతులకు మరిన్ని ప్రయోజనాలను కల్పించే దానిలో భాగంగా గతంలో ఇచ్చిన హామీమేరకు ఇప్పటికే రూ.24 వేల కోట్ల రుణవిముక్తి కల్పించామని, అంతేకాక 12,500 ట్రాక్టర్లను రైతులకు అందించామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టిసారించి వారిలో ఉత్పాదక శక్తిని పెంపొందించడానికి ఎప్పటికప్పుడు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ రంగంలో టెక్నాలజీ వినియోగంలో మన రాష్ట్రం సమున్నత స్థానాన్ని కైవసం చేసుకున్న నేపథ్యంలో రైతులు అధిక ఉత్పత్తిని సాధించడంతో పాటు ఖచ్చితంగా గిట్టుబాటు ధర లభించేలా మరిన్ని ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. అంతే కాక పెరిగిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే విషయంలో కూడా టెక్నాలజీని ప్రవేశపెట్టి వ్యవసాయ, అనుబంధ రంగాలను అంటిపెట్టుకుని సాగుతున్న రైతుల్లో ఆనందాన్ని చూడటమే తన ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు వివరించారు.

అవినీతి పట్టుసీమ



పట్టిసీమ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా నిర్మించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో రూ. 350 కోట్ల మేర అవినీతి జరిగింది. దీనిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలి. కంట్రోలర్ అండ్ ఆడిటర్‌జనరల్ నివేదికలో చెప్పిన గణాంకాలనే నేను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. పట్టిసీమలో అవినీతి చోటుచేసుకుందని కాగ్ నివేదిక చెబుతోంది.

- బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు



బీజేపీ సభ్యులు రైతు ద్రోహులు, ప్రజా ద్రోహులుగా వ్యవహరిస్తున్నారు. బిజెపి సభ్యులకు ఏ అంశం పైనాకూడా కనీస అవగాహన లేదు. ప్రతిపక్షనేత జగన్‌మోహనరెడ్డి, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రరెడ్డి రాసి అందించిన కాగితాలను సభలో విష్ణుకుమారరాజు చదువుతున్నారు. కాగ్ నివేదిక వాస్తవ పత్రం కాదన్న విషయం తెలుసుకోవాలి.

- మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

(మొదటిపేజీ తరువాయి)

కాసేపు సభలో తెలుగుదేశం, బీజేపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కల్పించాల్సిన మౌలిక వసతులు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పలువురు శాసన సభ్యులకు అమ అభిప్రాయాలను వెల్లడించడానికి స్పీకర్ అనుమతిచ్చారు. ఈ సందర్భంగా శాసన సభలో పలువురు టిడిపి సభ్యులు చంద్రబాబు సారధ్యంలో వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిన వైనంతో పాటు ఆయా రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. అనంతరం బిజెపి శాసన సభా పక్షనేత పి.విష్ణుకుమారరాజుకు మాట్లాడుతూ, పట్టిసీమ ప్రాజెక్టుకు సంబంధించి భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రూపొందించిన వార్షిక నివేదికలో పొందుపరచిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు. నిర్ణీత గడువులోగా పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేశారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును ప్రశంసిస్తూనే ఈ ప్రాజెక్టులో రూ.350 కోట్లకు పైగా అవినీతి చోటుచేసుకుందంటూ ఆరోపణలు చేశారు. దీంతో సభలో కొంతసేపు దుమారం చెలరేగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బీజేపి శాసన సభాపక్ష నేత పి.విష్ణుకుమార్‌రాజుల మధ్య తీవ్రవాగ్యుద్ధం చోటుచేసుకుంది. తాను పట్టిసీమ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, అయితే ఆ ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై సీబిఐ లేదా సిటింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని విష్ణుకుమారరాజు డిమాండ్ చేశారు. దీంతో మంత్రి దేవినేని ఉమతో పాటు మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కాలువ శ్రీనివాసులు విష్ణుకుమార్‌రాజుపై ఎదురుదాడి చేశారు. పట్టిసీమను నిర్ణీత గడువులోగానే పూర్తిచేసి గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజికి రప్పించిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కిందని మంత్రి దేవినేని అన్నారు. కృష్ణా డెల్టా రైతులు కూడా ఈ విషయంలో చంద్రబాబును పొగడుతున్నారని చెప్పారు. కానీ బిజెపి సభ్యులు మాత్రం రైతు ద్రోహులు, ప్రజా ద్రోహులుగా వ్యవహరిస్తున్నారని మంత్రి దేవినేని విష్ణుకుమార్ రాజుపై ధ్వజమెత్తారు. అసెంబ్లీలోని బిజెపి సభ్యులకు ఏ అంశం పైనాకూడా కనీస అవగాహన లేదని ప్రతిపక్షనేత జగన్‌మోహనరెడ్డి, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రరెడ్డి రాసి అందించిన కాగితాలను సభలో విష్ణుకుమారరాజు చదువుతున్నాడని విమర్శించారు. పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణాన్ని పత్రికలకెక్కిమరీ ప్రశంసించిన విష్ణుకుమారరాజు ఇటీవల తమపార్టీతో బిజెపి తెగతెంపులు చేసుకున్న తరువాత ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ స్వరం మార్చారని దుయ్యబట్టారు. కాగ్ నివేదిక వాస్తవ పత్రం కాదన్న విషయం తెలుసుకోకుండా అందులో పొందుపరచిందే నిజమంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే రీతిలో విష్ణుకుమారరాజు మాట్లాడుతున్నారని, అయితే గత మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రాజెక్టుకు సంబంధించి నోరు మెదపకుండా ఇప్పుడు విమర్శించడంలోని ఆంతర్యం ఏమిటని మంత్రి ఉమా నిలదీశారు. పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ప్రభుత్వంపై బురద జల్లుతున్న బిజెపి నేతలకు రాష్ట్రంలో పుట్టగతులుడవని మంత్రి ఉమ శాపనార్థాలు పెట్టారు. అయితే తాను పట్టిసీమకు వ్యతిరేకం కాదని, కాగ్ చేసిన వ్యాఖ్యలపైనే ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని కోరుతున్నట్లు విష్ణుకుమారరాజు తెలుపుగా, బిజెపి సభ్యుడు ద్వంద నీతిని పాటిస్తున్నారంటూ రవాణాశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మోడీ, జగన్, పవన్ కళ్యాణ్‌లు ఓ పద్ధతి ప్రకారం టిడిపి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ చంద్రబాబుపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. బిజెపిని ఆయన మరో కోణంలో విశ్లేషించారు. 'బి' బిజెపి అని, 'జె' జగన్ అని, 'పి' అంటే పవన్ కళ్యాణ్ అని లెక్క కట్టారు. ఈ ముగ్గురు కలిసినా రాష్ట్రప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజాహిత పాలన అందిస్తున్న చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి ప్రభుత్వాన్ని ప్రజలకు దూరం చేయలేరని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మరో మంత్రి కాలువ శ్రీనివాసులు కూడా బిజెపి నాయకుడు కనీస అవగాహన లేకుండా సభా నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాగ్ నివేదిక వాస్తవ పత్రం కానేకాదని, అది నిఘా సంస్థ కాదని, ఆ నివేదికలో ప్రభుత్వం పై ఏ వైన ఆరోపణలు ఉంటే తమ ప్రభుత్వం, అధికారులు పూర్తి వివరాలతో కూడిన సమాధానం ఇస్తారని మంత్రులు చెబుతుండగా స్పీకర్ కోడెల శివప్రసాద్ సభను గురువారం ఉదయానికి వాయిదా వేశారు.

నాసిరకం పాఠశాల భవనాల నిర్మాణాలు

నిపుణుల కమిటీ వేయాలి: ఎమ్మెల్సీ కత్తి

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల భవనాల నిర్మాణ పనులు నాసిరకంగా సాగుతున్నాయని, ఇప్పటికే అనేక పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట నియామాలకు అనుగుణంగా కాకుండా శ్లాబ్‌లు వేస్తున్నారని ఆరోపించారు. దీనిపై నిపుణుల కమిటీని వేసి విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో సభ్యురాలు శమంతకమణి మాట్లాడుతూ అనంతపురం జిల్లా గుత్తిలో 130 సంవత్సరాల క్రితం నిర్మించిన హైస్కూల్ శిథిలావస్థకు చేరుకుందని, దీనిని పునర్‌నిర్మించాలని కోరారు. దీనిపై మంత్రి గంటా స్పందిస్తూ పాఠశాల భవనాలను నిర్మాణాల అంశంలో ప్రతి జిల్లాలో ఇఇ ఆధ్వర్యంలో క్వాలిటి కంట్రోల్ వింగ్ పని చేస్తుందని, వీరు పరిశీలించిన అనంతరం, మరో థర్డ్‌పార్టీతో నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసిన అనంతరమే బిల్లులు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. తాగే మంచినీటి నుంచి ప్రతి ఒకటి కల్తీ అవుతున్నాయని సభ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపైమంత్రి యనమల రాష్ట్రవ్యాప్తంగా 54 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు గాను 23 మంది పనిచేస్తున్నారని, 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

కేంద్ర గణన కంటే స్మార్ట్ పల్స్ సర్వే మిన్న!

- వలస కూలీలకు ఇబ్బంది లేదు శాసనసభలో ఆర్థిక మంత్రి యనమల



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నిర్వహించిన స్మార్ట్ పల్స్ సర్వే (ప్రజాసాధికార సర్వే)కు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అనుసంధానం చేశామని, కేంద్ర ప్రభుత్వ జనాభా గణన కంటే ఈ సర్వేలో అధిక సమాచారం సేకరించామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. రాష్ట్రంలో నిర్వహించిన ప్రజాధికార సర్వే వలన వలస కూలీలకు ఇబ్బంది లేదని చెపుతూ సంచార జాతులు కొంత ఇబ్బందులు పడే అవకాశం ఉన్నప్పటికీ నిలువరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో స్మార్ట్‌పల్స్ సర్వేపై వైసీపీ ఎమ్మెల్యేలు కాకాని గోవర్ధన్ రెడ్డి, రాజన్నదొర పీడిక, నారాయణస్వామి అడిగిన ప్రశ్నలకు పంచాయితీరాజ్ శాఖా మంత్రి తరుపున ఆయన సమాధానమిచ్చారు. ఎప్పటికప్పుడు సర్వేను అప్‌డేట్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేసిన జనాభా గణనకు, దీనికి ఏమాత్రం సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సర్వేలో కొన్ని పారా మీటర్లు తీసుకుంటే అదనంగా మరికొన్ని పారా మీటర్లు తీసుకొని స్మార్ట్ పల్స్ సర్వే నిర్వహించామన్నారు. వివాహమైన మేజర్లు కుటుంబం నుంచి వేరుపడి తిరిగి దరఖాస్తు చేసుకుంటే వారిని కూడా గుర్తిస్తామన్నారు. తద్వారా కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడం వలన వీరికి జరిగే నష్టం లేదని, ఇతరుల మాదిరిగానే అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్‌పల్స్ సర్వేలో అవలంభించిన కొలమానాలేంటని ప్రశ్నించారు. దీనికి సంబంధించి ప్రభుత్వ పథకాలు ఏమైనా లింక్ చేశారా? అంటూ ప్రశ్నించిన రాజేంద్రప్రసాద్, ఆధార్ కార్డు సహా మొబైల్‌ను అనుసంధానం చేయడం వలన ప్రజలకు వచ్చిన ప్రయోజనాలేంటన్నారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ స్మార్ట్‌పల్స్ సర్వే తర్వాత వలస కూలీలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. ఇదే సమయంలో కుటుంబాన్ని ఒకే యూనిట్‌గా తీసుకోవడం వలన వివాహాలైన మేజర్లు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలు చేయబోం!



రాష్ట్రంలో 500 పైబడి జనాభా కలిగిన గిరిజన తండాలు, కాలనీలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని మంత్రి ఆనందబాబు చెప్పారు. వీటిని ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా చేసిన పక్షంలో ఆదాయం తక్కువ వచ్చి అభివృద్ధికి ఆటంకం కలుగుతుందనేది ప్రభుత్వ అభిప్రాయమన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో నిధుల సమస్య లేనప్పటికీ మైదాన ప్రాంతాల్లో ఉంటున్న గిరిజనుల అభివృద్ధికి నిధుల కేటాయింపు ఇబ్బందిగా మారిందన్నారు. నకిలీ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు పొందే వారిని ఉపేక్షించబోమంటూ మంత్రి చెప్పారు.

నిమ్మ, బత్తాయిలకు మద్దతు ధర ప్రకటించాలి: ఎమ్మెల్యే బాబురావు

నిమ్మ, బత్తాయి పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కనిగిరి ఎమ్మెల్యే బాబురావు అన్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతమైన కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ప్రాంతాల్లో నిమ్మ, బత్తాయి పంట పండిస్తున్నారని, నీళ్లు లేక పంట చెట్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం కందులకు మద్దతు ధర ప్రకటించినట్లే నిమ్మ, బత్తాయిలకు కూడా ప్రకటించాలన్నారు.

వెలుగొండ నిర్వాసితులకు రూ.12 లక్షలు ఇవ్వాలి: ఎమ్మెల్యే డేవిడ్ రాజు

వెలుగొండ నిర్వాసితుల రూ.12లక్షల ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నట్లు యర్రగొండపాలెం ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు అన్నారు. ఇందులో ఇళ్లనిర్మాణానికి రూ.5లక్షలు, ప్యాకేజీ కింద రూ.5లక్షలు, ఆర్‌ఆర్‌కింద రూ.2 లక్షలు చెల్లించాలన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక అసమానతలు దూరం

- సంక్షేమంపై చర్చల్లో మండలి సభ్యులు

అమరావతి, ఆంధ్రప్రభ: ధనికులు, పేదల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించేలా టీడీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉన్నాయని, కానీ వాటిని చిత్తశుద్ధితో పారదర్శంగా అమలు చేయగలిగినపుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పలువురు ఎమ్మెల్సీలు అభిప్రాయ పడ్డారు. బుధవారం మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమ రంగాలపై కౌన్సిల్‌లో చర్చ నిర్వహించారు. టీడీపీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్‌లోని నిరుపేదలకు భరోసానిచ్చేలా టీడీపీ ప్రభుత్వం 103 సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ స్వర్గీయ ఎన్‌టీఆర్ ఆశయ స్ఫూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు వంటింటికి పరిమితమైన మహిళను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. టీడీపీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కాపులకు సైతం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి గత నాలుగేళ్లుగా ఏటా రూ.1000 కోట్లు కేటాయించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి ముడిపడి ఉన్న నేపథ్యంలో భర్త చనిపోయిన వారి పిల్లలకు ఉచిత విద్యను, మైనారిటీలకు నిర్బంధంగా విద్యను అందించేలా చట్టాలను తీసుకురావాలన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ అగ్రవర్ణాల్లోని పేదలకు సైతం 50 శాతం రాయితీతో రుణాలను పంపిణీ చేస్తూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారంజకమైన పాలన అందిస్తున్నారని వెల్లడించారు. పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ బాలల హక్కులు, సంరక్షణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు బాలల సదన్స్‌లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రభుత్వానికి సూచించారు.

పేదవాడికి కూడు, గూడు కల్పించిన ఎన్‌టీఆర్

నిరుపేదలకు కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడును స్వర్గీయ నందమూరి రామారావు కల్పించారని, ఆయన ఆశయాలను సీఎం చంద్రబాబు నేటికీ కొనసాగిస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలియజేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ.రత్నాబాయి మాట్లాడుతూ ఇంటర్నెట్ సేవలను మారు మూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా గ్రామీణ యువతకు డిజిటల్ విద్యను చేరువ చేయాలని సూచించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ గతంలో ఏ పాలకులు పట్టించుకోని సంచార జాతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం అదే తరహాలోనే కులాల మార్పు గాకుండా వెనుకబడిన కులాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలని సూచన చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ కేటాయింపులతో సంక్షేమం జరిగిపోతుందనుకుంటే భ్రమేనని, నిరుపేదలకు సంక్షేమ ఫలాలను అందించేందుకు పూర్తిస్థాయిలో నిధులను ప్రభుత్వం ఖర్చు చేయాలన్నారు.

ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాల: మంత్రి అచ్చెన్నాయుడు



ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 65 గురుకుల పాఠశాలలు ఉన్నాయని, ప్రతి నియోజకవర్గంలో ఒక గురుకుల పాఠశాల నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వానికి బీసీలే పునాదులని, ఆ పునాదులపైనే ప్రభుత్వం నిల్చిందన్నారు. ఏపీ జనాభాలో యాభై శాతం మంది బీసీలు ఉన్నారని, బీసీ సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని అన్నారు. బిసిల సంక్షేమం కోసం 17 వేల 587 కోట్లు విడుదల చేశామని, ఏటా 3216 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. బీసీ యువతకు ఉపాధి కోసం కోటి 20 లక్షల యూనిట్లకు రుణాలు మంజూరు చేశామని, బీసీలకు మాదిరిగానే కాపులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

బాల్య వివాహాలను అరికడ్తున్నాం: మంత్రి సునీత




సమగ్ర బాలల సంరక్షణ పథకాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామని, పిల్లలకు రక్షణ కల్పించేందుకు అనువైన వాతావరణాన్ని నెలకొల్పడం లక్ష్యంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పనిచేస్తుందని ఆ శాఖ మంత్రి పరిటాల సునీత అన్నారు. మంత్రి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ చట్టం ప్రకారం ఇప్పటి వరకు 4232 బాల్య వివాహాలను నిలుపుదల చేయించామని తెలిపారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో 9884 బాలల రక్షణ కమిటీలను ఏర్పాటు చేశామని, బాలబాలికలపై లైంగిక వేధింపుల ఘటనలకు సంబంధించి ఫోక్సో చట్టం కింద ఇప్పటి వరకు 3092 కేసులు నమోదు చేశారని తెలిపారు. భేటీ బచావో భేటీ పడావ్ ద్వారా ఆడపిల్లల ప్రాముఖ్యతను పెంచే విధంగా పలు కార్యక్రమాలు చేపడ్తున్నామని, ఇందులో 8854 కార్యక్రమాలు నిర్వహించగా ఆరు లక్షల 49 వేల 835 మంది పాల్గొన్నారని ఆమె తెలిపారు.

అంబేద్కర్ ఆశయాలకే సీఎం పెద్దపీట: మంత్రి ఆనందబాబు

బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తున్నారని మంత్రి ఆనందబాబు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమం ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన వివరించారు. నవ్యాంధ్రలోని అన్ని కులాల సమాన అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. జ్ఞాన భూమి పోర్టల్ ద్వారా స్కాలర్‌షిప్స్, ఫీజు రీఎంబర్స్‌మెంటును క్రమం తప్పకుండా అందించడం, గురుకుల ద్వారా కార్పొరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్యను, మంచి నైపుణ్యాలను ఎస్సీవిద్యార్థుల్లో పెంపొందించడం, అలాగే ఎన్‌టీఆర్ విద్యోన్నతితో ఉన్నత చదువులు, అంబేద్కర్ ఓవర్సీస్‌తో విదేశీ చదువులు, నైపుణ్య శిక్షణలతో ఉపాధి కల్పన, స్వయం ఉపాధికై ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడితో కూడిన రుణ సౌకర్యాలను కల్పించడం జరుగుతోందన్నారు.

బాధిస్తే క్షమించండి!: ఎమ్మెల్సీ సోము వీర్రాజు



శాసనమండలి సమావేశాల్లో తాను గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదం చెప్పే సమయంలో కొందరు సినీ నటులు, రాజకీయ ప్రముఖులు ప్రధానిని అవమానించడంపై గాండ్ల కులం, నీచకులం అనే పదాలు వాడటంపై ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. గుజరాత్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ ప్రధాని మోదీని నీచకులానికి చెందిన వ్యక్తిగా అభివర్ణించడం తన మనసులో ఉండటంతో తానీ విధంగా నీచకులం అనే పదం వినియోగించానని, దాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. గాండ్ల కులస్తుల హృదయాలు గాయపరిచినందుకు ఎవరినైనా బాధిస్తే క్షమించాలని అభ్యర్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాజకీయ ఫేస్‌బుక్!



(మొదటిపేజీ తరువాయి)

ఈ సామాజిక మాధ్యమాల ద్వారా అందుబాటులోకొచ్చింది. రష్యా ఎన్నికల్లో కూడా సామాజిక మాధ్యమాలు కీలకపాత్ర పోషించాయి. ఇటీవల జరిగిన జర్మనీ ఎన్నికల్లోనూ ప్రచారం అధికంగా సామాజిక మాధ్యమాల ద్వారానే సాగింది.

ఇప్పుడు పార్టీలు, రాజకీయ నాయకులు, అభ్యర్థులు కూడా తమ మేనిఫెస్టోలు, హామీల్ని ప్రజల మెదళ్ళలోకి చొప్పించేందుకు చవకైన, వేగవంతమైన ఈ మాధ్యమాన్నే ఎంచుకుంటున్నారు. భారత్‌లో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఈ సామాజిక మాధ్యమాలు కీలకపాత్ర పోషించే పరిస్థితి స్పష్టమౌతోంది. గత ఎన్నికల్లోనూ మోడీ వీటిని ఉపయోగించుకున్నా అప్పటికి ఇవి ఇంకా ఇంతటిస్థాయిలో విజృంభించలేదు. 4జీ నెట్‌వర్క్ ఇంత విస్తృతంగా అందుబాటులోకి రాలేదు. స్మార్ట్‌ఫోన్లు కూడా ఇంతపెద్ద సంఖ్యలో లేవు. రానున్న ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పటికే ప్రధాన పార్టీల నుంచి ప్రాంతీయ పార్టీల వరకు ప్రత్యేకంగా సామాజిక ప్రచార మాధ్యమ విభాగాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. నిపుణుల బృందాల్ని ప్రత్యేకంగా నియమించుకున్నాయి. వీరి ద్వారా వైరి పక్షాలపై ఆరోపణలు, తమ విజయాల ప్రచార బాధ్యతల్ని ఇప్పటికే చేపట్టాయి. ఈ దశలో సామాజిక మాధ్యమాల ఖాతాదార్ల వ్యక్తిగత వివరాలు అనుమతి లేకుండా బహిర్గతమవుతున్నాయన్న వార్త పిడుగులా ధ్వనించింది. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలు చోరీకి గురౌతున్నాయి. లేదా కావాలనే కొందరికి వెల్లడిస్తున్నారనే విషయం వెలుగులోకొచ్చింది. ఇది వ్యక్తిగత రహస్యాల రక్షణ చట్టానికి విరుద్ధం. అమెరికా ఎన్నికల్లో ఫేస్‌బుక్‌కు చెందిన ఐదు కోట్ల మంది ఖాతాదార్ల వ్యక్తిగత రహస్య వివరాలు లీకైనట్లు తేలింది. పోటీలో ఉన్న ట్రంప్‌కు అనుకూలంగా ప్రచారం చేసేందుకే ఓ సంస్థకు ఈ వివరాల జాబితా ఫేస్‌బుక్ నుంచి అందింది. దీంతో ఒక్కసారిగా ఫేస్‌బుక్ ప్రతిష్ట దిగజారిపోయింది. ఆ సంస్థ షేర్ విలువ ఏడుశాతం పతనమైంది. దీనివెనుక కుట్రలేదంటూ ఫేస్‌బుక్ అధినేత జుకర్‌బర్గ్ చేస్తున్న వాదనను అంతర్జాతీయ సమాజం అంగీకరించడం లేదు. భారత్ కూడా ఈ విషయాన్ని సీరియస్‌గానే పరిగణిస్తోంది. వ్యక్తిగత సమాచారాన్ని మరొకరికి చేరవేస్తే భారత ఐటీ చట్టం ప్రకారం విచారణ ఎదుర్కోక తప్పదంటూ కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ జుకర్‌బర్గ్‌ను హెచ్చరించారు. భావప్రకటనా స్వేచ్ఛ పేరిట చట్టాల్ని అతిక్రమిస్తే ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ వారెంట్ జారీ తప్పదన్నారు. భారత్‌లో ఫేస్‌బుక్ 20కోట్ల మందికిపైగా వినియోగదార్లు ఉన్నారు. అమెరికా తర్వాత భారత్‌లోనే ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది.

వచ్చే ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్న వారందరికీ ప్రస్తుత పరిస్థితితో గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. ఒక్క ఫేస్‌బుక్కే కాదు.. వాట్సప్ వంటి ఇతర సామాజిక మాధ్యమాలకు చెందిన ఖాతాదార్ల వివరాలు కూడా ఇక బహిర్గతమయ్యే అవకాశం కనిపించడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సామాజిక ప్రచార మాధ్యమాల్లో ఫేస్‌బుక్‌కే అత్యధిక సంఖ్యలో వినియోగదార్లు ఉన్నారు. దీన్ని 130 కోట్ల మంది వినియోగిస్తున్నారు. ఇందులో ఒక్క అమెరికాలోనే సుమారు 23కోట్ల మంది ఖాతాదార్లు ఉన్నారు. వీరిలో 5కోట్ల మందికి పైగా ఖాతాదార్ల వ్యక్తిగత రహస్య వివరాల్ని ఫేస్‌బుక్ కేంబ్రిడ్జి అనలిటికా అనే సంస్థకు అందించిందన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఖాతాదార్లకు ట్రంప్ బృందం రోజూ వందల సంఖ్యలో తమ అనుకూల మెసేజ్‌లను పంపించింది. డెమొక్రటిక్ ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌పై అనేక ఆరోపణలు గుప్పించింది. ట్రంప్ భవిష్యత్ వ్యూహాలు, భవిష్యత్ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు తెలియజేసింది. ట్రంప్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకతను పదే పదే నూరిపోసింది. ట్రంప్ విజయం వెనుక ఫేస్‌బుక్ ఖాతాదార్ల వివరాల లీకేజీ కూడా ప్రధాన పాత్ర పోషించిందన్నది ఇప్పుడు ఆరోపణగా మారింది. ఈ వ్యవహారం వెనుక రష్యా గూఢచారి విభాగం కేజీబీ హస్తముందన్నది ఈ ఆరోపణల్ని మరింత పటిష్టం చేసింది. కేంబ్రిడ్జి వర్శిటీలోని సైకాలజీ విభాగంలో అలెగ్జాండర్ ఫోగెన్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. క్రిస్టోఫర్ వైలీ అనే డేటానలిస్ట్ నిపుణుడితో కలిపి ఫేస్‌బుక్ లీకేజీ పథకం సిద్ధం చేసినట్లు తాజా దర్యాప్తులో వెల్లడౌతోంది. తన పరిశోధన కోసమని చెప్పి మార్క్ జుకర్‌బర్గ్ నుంచి అనుమతి తీసుకుని ఈ వ్యక్తిగత ఖాతాల వివరాల్ని ఈ బృందం సేకరించినట్లు సమాచారం. మనుష్యుల మానసిక స్థితి విశ్లేషణ కోసమే ఈ వివరాల్ని తాము వినియోగిస్తామంటూ జుకర్‌బర్గ్‌కు ఈ బృందం హామీనిచ్చింది. ఇక్కడే జుకర్‌బర్గ్‌తో పాటు ఫేస్‌బుక్ నిర్వాహణా బృందం తప్పటడుగు వేసింది. పూర్తిస్థాయిలో ఆరాతీయకుండానే ఖాతాల వివరాల విడుదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇంతకీ ఈ అలెగ్జాండర్ ఫోగెన్ ట్రంప్ ఎన్నికల ప్రచార బాధ్యతలు నిర్వహించిన స్టీవ్‌బానన్‌కు అతి సన్నిహితుడు. వీరంతా కలిపి ఖాతాదార్ల వ్యక్తిగత వివరాల్ని తమకు అనుకూలంగా వినియోగించుకున్నారు. దీనిపై ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మండిపడుతున్నారు. ఈ వ్యవహారంలో ట్రంప్‌తో పాటు ఫేస్‌బుక్ కూడా బుక్కయింది. ఈ ప్రభావం ఒక్క ఫేస్‌బుక్‌పైనే కాకుండా మిగిలిన సామాజిక మాధ్యమాలపై కూడా తీవ్రంగానే ఉంది. ఇప్పటికే ఫేస్‌బుక్‌ను చైనాలో నిషేధించారు.

మరికొన్ని దేశాలు ఈ దిశగా యోచిస్తున్నాయి. ట్రంప్ వైరం పెట్టుకున్న దేశాలన్నీ ఇప్పుడు ఫేస్‌బుక్‌ను బహిష్కరించేందుకు సిద్ధమౌతున్నాయి. 130కోట్ల ఖాతాదార్లున్న ఫేస్‌బుక్ నాలుగురోజుల్లోనే నాలుగు నుంచి ఐదు శాతం మంది ఖాతాదార్లు దూరమయ్యారు. వీరిలో అత్యధికులు తమ ఖాతాల్ని స్తంభింపచేశారు. ఫేస్‌బుక్ షేర్ విలువ గత నాలుగు రోజుల్లో ఏడుశాతం పడిపోయింది. జుకర్‌బర్గ్ నికర సంపద దాదాపు 500కోట్ల డాలర్లు తగ్గిపోయింది. ఈ పరిస్థితిని పోటీదార్లు తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, బ్రెజిల్, జపాన్, మెక్సికోలలో అత్యధిక సంఖ్యలో ఖాతాలు కలిగిన ట్విట్టర్ ఈ సమయంలో మిగిలిన దేశాల్లో తన ఖాతాదార్లను పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. దక్షిణకొరియాకు చెందిన సామాజిక మాధ్యమం ''కకావోటాక్'' కూడా ఇప్పుడు పోటీలోకి దిగింది. జపాన్‌కు చెందిన నేవల్ కార్పొరేషన్ అభివృద్ధి చేసిన మరో సామాజిక మాధ్యమం ''లయన్'' కూడా పోటీలో ఉంది. చైనాకు చెందిన ''వ్యూచాట్ మెసెంజర్ యాప్'' ఫేస్‌బుక్ ఖాతాల్ని ఆకర్షించే ప్రయత్నం మొదలెట్టింది. వాట్సప్ వ్యవస్థాపకులు బ్రియాన్ యాక్టన్ ఆ సంస్థనుంచి బయటకొచ్చి సొంతంగా ప్రారంభించిన సిగ్నల్ మెసెంజర్ యాప్ కూడా భారత్‌తో పాటు అనేక దేశాల్లో ప్రవేశించేందుకు ఇదే సమయంగా భావిస్తోంది. భారత్‌లో అత్యధికులు వినియోగిస్తున్న ''వుయ్‌చాట్ మెసెంజర్ యాప్'' భారత్, పాక్, బంగ్లాలపై దృష్టిపెట్టింది. వియత్నాంకు చెందిన ''జాలో'' కూడా పోటీలో దిగింది. తాజా పరిణామాలు ఇప్పుడు ప్రచార మాధ్యమాల మధ్య ప్రత్యక్ష యుద్ధానికి తెరదీశాయి. ఇందులో ఎక్కువ సంస్థలు భారత్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. ఫేస్‌బుక్, వాట్సప్, టెలిగ్రామ్ యాప్‌లను అమెరికన్ల తర్వాత భారతీయులే అత్యధికంగా వినియోగిస్తున్నారు. ఈ సమయంలో రానున్న ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ఖాతాదార్ల వ్యక్తిగత సమాచార లీకేజీపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో ఎన్నికల్లో ప్రచారానికి వీటిపైనే ఆధారపడేందుకు సమాయత్తమౌతున్న వర్గాలకిది ఆశనిపాతమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతా
- శక్తిని ప్రసాదించమని శ్రీవారిని ప్రార్థించా : ముఖ్యమంత్రి చంద్రబాబు
- తిరుమలలో కుటుంబ సభ్యులతో ఘనంగా మనవడు దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు



తిరుమల, ప్రభ న్యూస్: ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఆనందం, సుఖసంతోషాలు, మెరుగైన జీవన ప్రమాణాలు ప్రసాదించాలని కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. ముఖ్యమంత్రి తమ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగా లలో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తనకు శక్తి ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలి పారు. భక్తులకు, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రజలకు శ్రీరామనవమి శుభా కాంక్షలు తెలిపారు.

తిరునామం ధరించి సామాన్య భక్తుని వలె...

ముందుగా వైకుంఠం క్యూ కాంప్లెక్సులోనికి ప్రవేశించి న ముఖ్యమంత్రి, కుటుంబ సభ్యులను శ్రీవారి సేవకులు భక్తిభావంతో గోవింద -- గోవింద అని సంభోదిస్తూ తిరు నామం చేశారు. ఈ సందర్భంగా తిరుమల జేఈవో శ్రీనివా సరాజు భక్తులకు తిరుమలలోని ప్రధాన ప్రాంతాలలో శ్రీవారి సేవకులతో తిరునామధారణ నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. శ్రీవారి సేవకులతో తిరు నామధారణ నిర్వహించడం చాలా బాగుందని ముఖ్యమం త్రి ప్రశంసించారు. అనంతరం ముఖ్యమంత్రి ఆలయం లోకి ప్రవేశించారు. మహాద్వారం వద్దకు చేరుకోగానే టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సాదరంగా ఆహ్వానించగా, ఆలయ అర్చకులు కలసి సంప్రదాయబద్ధంగా ఇస్తికపాల్ స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద నమ స్కరించిన అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వకుళామాతను, ఆలయ ప్రదక్షిణగా వచ్చి విమాన వేంకటేశ్వర స్వామి, సబేరా, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహ స్వామివారిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు.

ముడుచుకునే పై కప్పును పరిశీలించిన ముఖ్యమంత్రి

శ్రీవారి ఆలయంలో పడికావలి నుంచి ధ్వజస్తంభం మధ్య ఏర్పాటు చేసిన ముడుచుకునే పై కప్పు పనితీరును ముఖ్యమంత్రి పరిశీలించారు. ఎండకు, వర్షానికి భక్తులు ఇబ్బంది పడకుండా ఈ మేరకు ఏర్పాటు చేసినట్లు టీటీడీ ఈవో వివరించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీ ర్వచనం చేశా రు. ఈ సందర్భంగా ఈవో, జేఈవో ముఖ్యమంత్రికి వారి కుటుంబ సభ్యులకు శ్రీవా రి శేషవస్త్రం, తీర్థ ప్రసా దాలు, శ్రీవారి చిత్రపటం, శ్రీ విళంబినామ సంవత్సర పం చాంగం అందించారు. ఈకార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, రాష్ట్ర మం త్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, డీఐజీ ప్రభాకర్‌రావు, కలెక్టర్ ప్రద్యు మ్న, సివిఎస్ఓ రవికృష్ణ, అర్బ న్ ఎస్పి అభిషేక్ మొ హం తి, ఆలయ డిప్యూటీ ఈ వో హరీంద్రనాథ్, విజిఓ రవీంద్రారెడ్డి, ఇతర అధి కారులు పాల్గొ న్నారు.



శ్రీవారి సేవకులుగా మారిన ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు

శ్రీవారి దర్శనానంత రంతరిగొండవెంగ మాంబ అన్నప్రసాద భవనంలో ముఖ్యమంత్రి తమ కుటుంబ సభ్యులతో కలసి స్కార్ఫ్‌లు ధరించి స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించి శ్రీవారి సేవ చేశా రు. అనంతరం భక్తులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. తమ మనవడు దేవాన్ష్ 4 వ పుట్టిన రోజు సందర్భంగా తిరు మలలో ఒక్క రోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చు 26 లక్షల రూపాయలను ఆన్‌లైన్‌లో విరా ళంగా అందించారు.

ఘనంగా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్య మంత్రి చంద్రబాబు మనువడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతుల ముద్దుల తనయుడు నారా దేవాన్ష్ పుట్టిన రోజు వేడుకలను గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ కార్యదర్శి ఏ.వీ. రమణ నేతృత్వంలోని టీడీపీ నేతలు తొలుత ప్రసిద్ధ పెదకాకాని శివాలయం, బృందావన గార్డెన్స్‌లోని వెంకటే శ్వర దేవాలయంలో ప్రత్యే క పూజలు, అభిషేకాలను జరిపించారు. దేవాన్ష్ నిండు నూరే ళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, తాత, తండ్రుల వలే కీర్తిప్రతిష్టలను ఆర్జించాలని ఆకాంక్షిస్తూ పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పలువురు నిరుపేదలకు, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపి ణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు నరేంద్ర, హర్షవర్ధన్ నాయుడు, కుమార్ చౌదరి, శ్రీరాం ప్రసాద్, ప్రభాకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పోరాటాలకు సై



(మొదటిపేజీ తరువాయి)

పవన్‌కళ్యాణ్ నాలుగు సంవత్సరాల పాటు తమ ప్రభుత్వంతోస్నేహంగా ఉండి ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్రాన్ని ఒక మాట కూడా అనకుండా తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేంద్రంపై తొలుత పోరాటానికి తెలుగుదేశం పార్టీ నేనని తాము అవిశ్వాసం నోటీసు ఇచ్చాక మిగిలిన పార్టీలు కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసు కున్నారన్నారు. పార్లమెంటు సాక్షిగా ఇప్పటి వరకు కేంద్రం రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలన్నారు. చివరికి అవిశ్వాసాన్ని కూడా అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని కేంద్రంపై ధ్వజమెత్తారు. అవిశ్వాసం చర్చ జరిగితే రాష్ట్రానికి ఎంత అన్యాయం జరిగిందో దేశం మొత్తం తెలుస్తుందని అన్నారు. విభజన హామీలు అమలు చేయాలని కోరడం దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఎదిగే వరకు చేయూతనివ్వాలని అడ గడం మేం చేసిన తప్పా..? అంటూ కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయో జనాలు నెరవేరే వరకు కేంద్రంతో పోరాడుతూనే ఉంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంత అన్యాయం చేస్తుందో ప్రతి కుటుంబానికి వివరించి చెప్పాల్సిన బాధ్యత సాధికారమిత్రలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. జపాన్ తరహా పోరాటం చేస్తూ ప్రతి రోజు అరగంట నిరసన తెలిపి మరో గంట ఎక్కువ పనిచేద్దామన్నారు. వామపక్ష పార్టీలు జాతీయ రహదారుల దిగ్బంధనానికి పిలుపునిచ్చాయని, దీనికి తాము కూడా సహకరిస్తామన్నారు. రెండు గంటల పాటు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పాల్గొంటుందని తెలిపారు. అదే సమయంలో రాష్ట్రంలో శాంతి, భద్రతలు అదుపులో లేవని అపోహలతో పెట్టుబడులు ఆగిపోయే ప్రమాదం ఉంటుందని, చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి తీసుకువెళదామని చెప్పారు.

ప్రపంచంలో అతిపెద్ద వ్యవస్థ సాధికార మిత్ర

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల 70 వేల మంది సాధికార మిత్రలు ఉన్నారని, ఇంత పెద్ద వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. డ్వాక్రా, మెప్మాలను 1996లో ప్రారంభించి దేశంలోనే ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టానని చెప్పారు. 9 లక్షల సంఘాల్లో 90 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని, ఇదంతా ఆనాడు తన ఆలోచనకు ప్రతిరూపంగా చెప్పారు. సమాజం కోసం ఉపయోగపడాలన్న లక్ష్యంతో సాధికార మిత్రలను ఏర్పా టు చేశామని ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని వీరికే ఇస్తున్నామన్నారు. ప్రతి కుటుం బం, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని అప్పుడే రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా మహిళలకు రూ.10 వేల కోట్లు పసుపు, కుంకుమ కింద ఇచ్చామని తెలిపారు. ఎన్టీఆర్ తెలుగు వారికి ఆత్మగౌరవాన్ని ఇస్తే తాను ఆత్మ విశ్వాసాన్ని ఇచ్చానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి సాధి కార మిత్ర అక్షరాస్యతపై దృష్టి సారించాలని 2019 నాటికి వంద శాతం అక్షరాస్యత సాధించాలని ఆ దిశగా కృషి చేయాలని కోరారు. తాను నిత్య విద్యార్థిని అని తనకు ఆసక్తి అనిపించిన ప్రతి అంశాన్ని కులంకుశంగా తెలుసుకుంటానని చెప్పారు. డబ్బు కన్నా చదువు, సంస్కారం ముఖ్యమని దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. సమాజంలో ఒక మెరుగైన వ్యవస్థను తీసుకువచ్చేందుకు సాధికారమిత్రలు కృషి చేయాలని చంద్రబాబునాయుడు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏయే గ్రామాలు, ఏయే రేటింగ్‌లో ఉన్నాయో, ఎక్కడెక్కడ ఎలాంటి వ్యాధులు, రుగ్మతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారో వివరించారు. పోషకాహార లోపం, ఎనిమియా సమస్య రాష్ట్రంలో ఎక్కడా కనబడకుండా చూడాల్సిన బాధ్యత సాధికారమిత్రలు తీసుకోవాలన్నారు.

మనిషి ఆనందంగా ఉండాలంటే ఆరోగ్యం అవసరమని చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేసిందని ఈ సంక్షేమ ఫలాలను అర్హులైన పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత కూడా సాధికార మిత్రలపైనే ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనంతరం వీడియో లింకు ద్వారా వివిధ జిల్లాలోని సాధికార మిత్రలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పరిటాల సునీత, నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, ఇతర శాఖల ఉన్నతాధి కారులు కరికాల వలవన్, సునీత, ఉదయలక్ష్మి, కృష్ణమోహన్, అరుణకుమారి, రామాంజనేయులు, బాబు.ఎ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రాజకీయాల్లో మరోసారి

చంద్రబాబు కీలకపాత్ర

- తెదేపా అవిశ్వాసానికి భారీగా మద్దతు
- భాజపా వ్యతిరేక శక్తులను కూడగట్టే యత్నం


హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం ఇప్పుడు జాతీయ రాజకీయ సమీకరణలను మారుస్తోంది. విభ జన చట్టం హామీలు అమలు చేసేందుకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటా యించకపోవడంతో దేశ రాజకీయాలకు అమరావతి పెనుమార్పు లకు కేంద్ర బిందువుగా మారుతోంది. ప్రత్యేక హోదా అంశం ఎన్ డిఎలోని మిత్రపక్షాలైన తెదేపా, భాజపాల మధ్య గత కొంతకాలంగా విభేదాలు తలెత్తడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణ యం ఇప్పుడు ప్రతిపక్షాలను ఏకంచేసే నూతన ప్రక్రియకు తెర తీసింది. గతంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌లను ఏర్పాటు చేయడంలో దివంగత ఎన్‌టి రామారావు, చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతోందంటూ ఎడిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగు బాటు చేయడంతో మరోసారి దేశ రాజకీయాల్లో చంద్రబాబు కీలక పాత్ర పోషించే పరిస్థితులకు దారితీసింది. ఎన్‌డిఎ నుంచి వైదొలగి కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెడుతున్నట్లు ప్రకటించడంతో కాంగ్రెస్‌తో సహా అన్ని ప్రాంతీయ పార్టీలు తెదేపాకు మద్దతు ఇవ్వడం గమనార్హం. కేంద్రంతో పాటు అనేక రాష్ట్రాల్లో భాజపా ప్రభుత్వాలు అధికారం చేపట్టడంతో దాన్ని ఎదుర్కొనేందుకు మళ్ళీ ప్రత్యామ్నా య కూటమి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఎన్‌డిఎతో చంద్రబాబు తెగతెంపులు చేసుకోగానే అనేక మంది ప్రాంతీయ పార్టీల నేతలు ఆయనను అభినందిస్తూ ఆయనకు మద్దతు ప్రక టించాయి. ఇదే అదనుగా అవిశ్వాస తీర్మానం పెట్టి భాజపా వైఫ్య లాలను పార్లమెంట్‌లో కడిగేయాలని కాంగ్రెస్‌తో సహా ప్రాంతీయ పార్టీలు భావిస్తున్నాయి. తెలుగుదేశంకన్నా ముందుగానే వైకాపా అవిశ్వాస తీర్మానం ఇస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ప్రతిపక్షాల నుంచి ఆశించిన మద్దతు రాకపోవడం విశేషం. తెలుగుదేశం ఇచ్చిన అవి శ్వాస తీర్మానం నోటీ సుకు కాంగ్రెస్‌తో సహా అన్ని ప్రతిపక్షాలు మద్ద తు ఇస్తూ చంద్రబాబు కు సంఘీభావం ప్రకటించాయి. ఇదే అదు నుగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసేందుకు చంద్రబాబుకు మరో సారి బాధ్యత ఇవ్వాలన్న రీతిలో ఇప్పటికే అనేక మంది నాయకులు సానుకూలత వ్యక్తం చేశారు. యూపీ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లాంటి వారంతా మద్దతు ప్రకటించడంతో దేశ రాజకీయాల్లో మరోసారి చంద్రబాబు కీలకపాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని తెలుగుదేశం వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. అవిశ్వాసానికి అవ సరమైన బలాన్ని కూడగట్టడంతో పాటు అవిశ్వాసానికి అనుకూలం గా ఓటు వేసేందుకు కూడా ఇతర పార్టీల నేతలను కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఏపీ ఎంపీల అవిశ్వాస తీర్మానంతో ప్రభుత్వం కూలిపోయే అవకాశం లేనప్పటికీ ప్రాంతీయ పార్టీల ఐక్యతపై మరో సారి స్పష్టత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రాంతీయ పార్టీల మధ్య సయోధ్య కుదిర్చి 2019 ఎన్నికలకు తృతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటుచేస్తే కాంగ్రెస్‌తో బలం కలిసి భాజపాను దెబ్బతీసే అవకాశా లు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

కేంద్రంలోని భాజపాను అధికారంలోకి రాకుండా అడ్డుకోవా లంటే అవసరమైన చోట కాంగ్రెస్ పార్టీని కూడా కలుపుకొనిపోవాలని ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. దీనిపై ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలు చర్చించుకుంటుండగా, కాంగ్రెస్‌తో కలిసేందుకు కొన్ని ప్రాంతీయ పార్టీలు విముఖత చూపుతున్నాయి. అయితే భాజపాను అడ్డు కోవాలంటే యుపిఎ స్థానంలో మరో ఫ్రంట్ ఏర్పాటు చేయాల్సిన అవసరంపై ప్రాంతీయ పార్టీలు కసరత్తు ముమ్మరం చేస్తున్నాయి. 2019 ఎన్నికల నాటికి భాజపా వ్యతిరేక శక్తులన్నింటినీ ఒకే వేదికపైకి తేవడంలో చంద్రబాబు కీలకపాత్ర పోషిస్తారని తెదేపా వర్గాలు భావి స్తున్నాయి. రాష్ట్రానికి అన్యాయం చేసిన కాంగ్రెస్ దాన్ని సరిచేస్తానం టూ హామీ ఇచ్చిన నేపథ్యంలో నూతన ఫ్రంట్‌లో దాన్ని కూడా చేర్చు కునే అవకాశాలు లేకపోలేదని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. విభ జన హామీని అమలు చేయని భాజపాను వచ్చే ఎన్నికల్లో అధికారం లోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రతిపక్షాలన్నింటినీ ఏకం చేయడంలో చంద్రబాబు కీలకపాత్ర పోషించడంలో విజయం సాధిస్తారని తెదేపా వర్గాలు భావిస్తున్నాయి.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక

రాష్ట్రంలో పంట విస్తీర్ణం తగ్గింది

- హోదాపై మాటమార్చిన సీఎం
- చిలకలూరిపేట సభలో వైఎస్ జగన్



చిలకలూరిపేట, ప్రభ న్యూస్: చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో పంట విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయిందని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రజాసంకల్పయాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం చిలకలూరిపేట పట్టణంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర రాకపోవటంవల్లనే రైతులు పంట వేయటం స్వచ్ఛంధంగా తగ్గించుకొన్నారన్నారు. వేసి నష్టపోయేకంటే పంటవేయకుండా ఉండటం మంచిదనుకొని పంటను తగ్గించుకున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తాగటానికి మంచినీరు దొరకటం లేదుకాని, బెల్టుషాపుల ద్వారా మద్యం పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉందదన్నారు. ముఖ్యమం త్రి చంద్రబాబు ప్రత్యేకహోదా పై రోజుకు మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. నాలుగు సంవ త్సరాల పాటు ప్రత్యేకహోదాపై కేంద్రాన్ని నిలదీసే అవకాశం ఉన్నా చంద్రబాబు ఆ పనిచేయలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపించేసరికి తాను చేసిన తప్పు లను వేరొకరిపై మీద వేసి తప్పుకొనే ప్రయత్నం చేస్తు న్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రత్యేకహోదా కావాలని, అది సంజీవని లాంటిది అని అన్న చంద్ర బాబు తర్వాత 2014లో జూన్ నెలలో కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారి ప్రత్యేక ప్యాకేజీ అయినా సరిపో తుందని శాసనసభలో ప్రకటించారన్నారు. ఈ విషయంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీని ప్రత్యేక ప్యాకేజీ ఇస్తాననటంతో శాలువ వేసి చంద్రబాబు సత్కరించారన్నారు. కాగా నేడు తిరిగి ప్రత్యేకహోదా కావాలని చంద్రబాబు అడగటాన్ని తప్పుపట్టారు. తొలినుంచి అడిగినట్లైయితే ఇప్పటికి ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చేదన్నారు. జగన్‌తో పాటు పార్టీ అధికార ప్రతినిధి అంబటిరాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రిరాజశేఖర్, మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణరెడ్డి, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ నాయకులు బాలశౌరి, కాసుమహేష్‌రెడ్డి పాల్గొన్నారు.



జగన్‌కు రెండు సున్నాలు... పవన్‌కు మూడు సున్నాలు

- టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న

అమరావతి, ఆంధ్రప్రభ: మార్కులు వేయాల్సి వస్తే ముఖ్యమంత్రికి నూటికి నూరు మార్కులు వేయాలని టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో చిట్‌చాట్ చేశారు. ఇక వైకాపా అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డికి రెండు సున్నాలు, జనసేన అధినేత పవన్ కల్యాన్‌కు మూడు సున్నాలు వేయాలన్నారు. జగన్, పవన్‌లకు రాష్ట్రప్రయోజనాలు అవసరం లేదని, కేవలం రాజకీయం మాత్రమే కావాల్సినట్లుందన్నారు.

లోకేష్‌పై అవినీతి ఆరోపణలు చేయడం అధర్మం : పల్లె రఘునాథరెడ్డి

రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌పై అవినీతి ఆరోపణలు చేయడం అధర్మమని రాష్ట్రప్రభుత్వ ఛీఫ్ విప్, పుట్టపర్తి శాసనసభ్యుడు పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, దేశంలో ఆస్తులు ప్రకటించిన సీఎం చంద్రబాబు ఒక్కరేనని ఆయన గర్వంగా చెప్పారు. అటువంటప్పుడు ఆయనపై అవినీతి ఆరోపణలు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు.

మేమడిగేది ప్రధాని పదవి కాదు : అయితాబత్తుల ఆనందరావు

తాము అడిగేది ప్రధాని పదవి కానేకాదని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా మాత్రమేనని అమలాపురం శాసన సభ్యుడు అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌వద్ద విలేకరులతో మాట్లాడుతూ, అదేదో ఇవ్వకూడనిదన్నట్లుగా కేంద్రప్రభుత్వం వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే ప్రధాని మోడీకి భయం పట్టుకుందన్నారు. మోడీ అంటే కేరాఫ్ మోసంఅని, అమిత్ షా కేరాఫ్ అవివేకమని చెప్పారు.

ఏఐఏడీఎంకేను శిఖండిలా అడ్డుపెట్టుకుంటున్నారు : జీవీ అంజనేయులు

ఏఐఏడీఎంకే పార్టీని శిఖండిలా అడ్డుపెట్టుకుని అవిశ్వాస తీర్మానం అడ్డుకుంటున్నారని వినుకొండ శాసనసభ్యుడు జీవీ అంజనేయులు మండి పడ్డారు.

భాజాపాపై దాడిని తిప్పికొట్టమని అధిష్టానం ఆదేశించింది : ఎమ్మెల్సీ మాధవ్

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారతీయ జనతాపార్టీ మీద జరిగే దాడిని తప్పకుండా తిప్పికొట్టాలని తమ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా దిశానిర్దేశం చేశారని ఆపార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తెలిపారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఇటీవల ఢిల్లీలో జరిగిన పరిణామాలపై ఆయన మాట్లాడుతూ, 4 ఏళ్లలో లేనిది ఈ 10 రోజులలో ఎలా మారిపోయిందో సమాధానం చెప్పాలని తెలుగుదేశాన్ని డిమాండ్ చేశారు.

టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేస్తే నేను కూడా చేస్తా : ఎమ్మెల్సీ సోము వీర్రాజు

గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ-టీడీపీ కలిసి పోటీచేసి అధికారంలోకి వచ్చాయని టీడీపీ ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తే, తాను కూడా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని సోము వీర్రాజు చేసిన కామెంట్లు బుధవారం అసెంబ్లీ లాబీల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎన్డీఏ నుంచి టీడీపీ వైదొలగిన అనంతరం బీజేపీకి చెందిన మంత్రులు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్ రాజీనామా చేయడం జరిగింది. తాజాగా బీజేపీకి చెందిన ఆర్.లక్ష్మీపతి ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో సోము వీర్రాజు కూడా రాజీనామా చేస్తారని పుకార్లు షికార్లు చేశాయి. వదంతులపై స్పందిన వీర్రాజు అదంతా తప్పుడు ప్రచారమేనని కొట్టి పారేశారు. గడచిన ఎన్నికల్లో బీజేపీ, టీడీపీలు కలిసి పోటీచేసి అధికారంలో వచ్చాయన్నారు. ఎమ్మెల్యేల కోటాలో తాను ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాననీ, సీఎం చంద్రబాబుతోపాటు మిగిలిన ఎమ్మెల్యేలు కూడా రాజీనామాలు చేస్తే తాను కూడా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని కౌంటర్ వేశారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 22 మార్చి 2018

లింగాయత్.. సిద్ధూ అస్త్రం

లింగాయత్ అనేది ఒక సామాజిక వర్గం. ఆ వర్గానికి చెందిన వారు కర్నాటకలో అధిక సంఖ్యలో ఉన్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకించిన బసవణ్ణ లింగాయత్‌లకు మూల పురుషుడు. లింగాయత్‌లలో ఉప వర్గం వీర శైవులు. ఇరు సామాజిక వర్గాలకు బసవణ్ణే ఆరాధ్యుడు. తెలుగు కవి పాల్కురికి సోమనాథుడు రాసిన బసవ పురాణం వీరికి మహాగ్రంథం. ఎన్నికల సమయంలో వీరిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్. బీజేపీలది ఒకే తీరు. ప్రస్తుత ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్ధ రామయ్య మరో అడుగు ముందుకు వేసి లింగాయత్‌లకు మతం హోదా కల్పిస్తూ కేంద్రానికి సిఫార్సు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి అమలు జేయలేకపోయిన కమలనాథులకు ఇప్పుడు ఇది మరో పెను సమస్యగా పరిణమించింది. అసలు వారిని అలా ఇరుకున పెట్టేందుకే సిద్ధ రామయ్య ఈ సిఫార్సు చేశారేమోనన్న ఆరోపణ నిరాధారం కాకపోవచ్చు. కర్నాటకలో ఐదేళ్ళ నుంచి అధికారంలో కొనసాగుతున్న సిద్ధరామయ్య ప్రభుత్వం పట్ల వ్యతిరేకత సాధారణ స్థాయిలోనే ఉంది. అవినీతి ఆరోపణలు వచ్చినా, అవి వెనుకటి బీజేపీ పాలనతో పోలిస్తే తక్కువే. యెడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అవినీతి, అక్రమాలపై లోకాయుక్త్ ఇచ్చిన తీర్పుల ఫలితంగా, యెడ్యూరప్ప, గాలి జనార్దనరెడ్డి, బి.శ్రీరాములు వంటి మంత్రివర్గ సహచరులు జైలుకి వెళ్ళారు. ఇతర వెనకబడిన వర్గాల (ఒబీసీల)కు చెందిన సిద్ధరామయ్య తిరిగి అధికారాన్ని చేపట్టాలని ఆ రాష్ట్రంలోని వారే కాక, తెలుగు రాష్ట్రాల వారు కూడా పలువురు కోరుకుంటున్నారు. ఆయన తరఫున ప్రచారానికి వెళ్తామని ప్రకటనలు కూడా చేశారు. ఎన్నికల ముందు సంక్షేమ పథకాలను లెక్కకు మిక్కిలిగా సిద్ధరామయ్య ప్రవేశపెట్టారు. వాటిల్లో పేదలకు సబ్సిడీ భోజనం ముఖ్యమైంది. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ప్రభుత్వ వ్యతిరేకత పని చేస్తుందేమోనన్న బెదురు ఆయనలో ఉంది. దానికి తోడు కమలనాథులు మతం కార్డును ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్నారన్న వార్తలు వచ్చాయి. వారికన్నా తాను ఒక అడుగు ముందుకు వేయాలన్న ఉద్దేశంతోనే ఆయన లింగాయత్ వర్గాన్ని మతంగా ప్రకటించాలని కేంద్రానికి సిఫార్సు చేశారు. రిజర్వేషన్లు, ప్రత్యేక హోదాలు, ప్రత్యేక సాయం వంటివి ఎన్నికల ముందు ప్రచారానికి రాజకీయ పార్టీల అస్త్రాలు. తమ ప్రయోజనం సిద్ధించగానే ఆ అస్త్రాలను అమ్ముల పొదిలోకి నెట్టేస్తుంటాయి. ఈ విషయంలో అన్ని పార్టీలదీ ఒకే తీరు. సిద్ధ రామయ్య వేసిన ఎత్తుకు ప్రధానమంత్రి మోడీ పై ఎత్తు ఎలా ఉంటుందో కొద్ది రోజుల్లో తెలియవచ్చు. ఈశాన్యంలో కాషాయి జెండాను ఎగుర వేశామన్న సంబరంలో ఉన్న కమలనాథులు కర్నాటకలో తిరిగి అధికారాన్ని సాధించేందుకు అన్ని వ్యూహాలకూ పదును పెడుతున్నారు. సిద్ధ రామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కారణంగా వేగుల నుంచి అందిన సమాచారం మేరకే ఆయన కమలనాథుల ముందరకాళ్ళకు బంధం వేసి ఉంటారు. అయితే, ఈ ఎత్తుగడ ఎంతవరకూ పారుతుందనేది ఊహకందని విషయం. లింగాయత్ వర్గాన్ని మైనారిటీ కమిషన్ చట్టంలోని సెక్షన్ 2(డి) కింద గుర్తించాలని ఆయన సిఫార్సు చేశారు. దీంతో తమకు లభించే ప్రయోజనాలు దెబ్బతింటాయని మైనారిటీ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. దశాబ్దాలుగా కర్నాటకలో మైనారిటీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా వాడుకుంటోంది. కర్నాటకలో లింగాయత్‌లకు మైనారిటీ ప్రతిపత్తిని కల్పిస్తామని కాంగ్రెస్ చాలా కాలంగా వాగ్దానం చేస్తోంది. అదే స్థాయిలో ఆ పార్టీకి ప్రతిఘటనా ఎదురవుతోంది. ఎన్నికల ముందగు జాప్యం చేయడం వల్ల నష్టం వాటిల్లుతుందని సిద్ధరామయ్య కేంద్రానికి సిఫార్సు చేశారు. ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేకపోవడం వల్ల పార్లమెంటులోనూ, వెలుపలా తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న బీజేపీ ఈ విషయంలో ఆచితూచి అడుగు వేస్తోంది. సిద్ధ రామయ్య ఈ సిఫార్సు చేయడం ద్వారా కొరివితో తలగోక్కున్నట్టు అయింది. వీర శైవులు తమ సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు. మంత్రివర్గంలోనే దీనిపై విభేదాలు ఏర్పడ్డాయి. వీటిని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి కమలనాథులు పావులు కదుపుతున్నారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పుట్టిన లింగాయత్ సామాజికవర్గంలోనూ, దాని ఉపకులమైన వీరశైవుల్లోనూ 92 ఉపకులాలు ఎందుకు పుట్టాయన్నది జగద్విదితం. శైవుల్లో శాకాహారులు, మాంసాహారులు, ఆచారాలు పాటించేవారు, అందరితో కలిసిపోయేవారు ఇలా పెక్కు చీలికలు ఉన్నాయి. పెళ్ళిళ్ళు, ఇతర సామాజిక కార్యక్రమాల్లో వీరందరూ కలవరు. ముఖ్యంగా గౌడ లింగాయత్‌ల పెత్తనం ఎక్కువైందన్న ఫిర్యాదులు చాలాకాలంగా వస్తున్నాయి. యెడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దీనిపై విభేదాలు భగ్గుమన్నాయి. తెలుగునాట అలనాడు ఎప్పుడో చాపకూటి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అమలు జేసిన బ్రహ్మనాయుడు మాదిరిగా కర్నాటకలో పురంధరదాసు, కనకదాసు వంటి భాగవతోత్తములు శతాబ్దాల క్రితమే విస్తృతంగా ప్రచారం చేశారు. లింగాయత్‌లకు ప్రస్తుత గురువు సిద్ధ గంగ పీఠాధిపతి. ఆయన నేతృత్వంలోని సిద్ధ గంగ మఠానికి వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అవి తమవేనంటూ దళితులు ఆ మధ్య పెద్ద ఎత్తున ఆందోళన సాగించారు. సిద్ధ గంగ పీఠాధిపతికి మహిమలు ఉన్నాయన్న ప్రచారాన్ని ఆయన శిష్యులు విస్తృతంగా చేయడం వల్ల గత ఎన్నికల ముందు ఆయన దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ రాగా, ఆమెకు యెడ్యూరప్ప ఎర్రతివాచీ స్వాగతం పలికారు. దాంతో ఆయన కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తున్నారన్న ఊహాగానాలు వ్యాపించాయి. కర్నాటకలో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పీఠాధిపతుల ప్రాభవం పెరుగుతూ ఉంటుంది. సంఖ్యాపరంగా లింగాయత్‌ల బలం ఎక్కువ కావడం వల్ల వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించడం రాజకీయ పార్టీల సహజ లక్షణమని సరిపెట్టుకోవడానికి వీలులేదు. మైనారిటీ వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్లలో కోతపెట్టి లింగాయత్‌లకు ఇస్తే వారు అగ్గిమీద గుగ్గిలం అవుతారు. కాంగ్రెస్‌కి ముస్లింలను ఓటు బ్యాంకుగా చేసేందుకు మాజీ రైల్వే మంత్రి సికె జాఫర్ షరీఫ్ వంటి మైనారిటీ నాయకుల శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. సిద్ధ రామయ్య అధిష్టానాన్ని సంప్రదించే ఈ నిర్ణయం తీసుకున్నారా లేదా అన్నది ఇదమిత్థంగా తెలియదు. ఏమైనా ఈ నిర్ణయం వల్ల కాంగ్రెస్‌కు మేలు కన్నా చేటే ఎక్కువ.

మంచి మాట

అస్తిత్వాన్ని చైతన్యం నిర్ణయించదు.
అస్తిత్వమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది.
-కార్ల్ మార్క్స్

అప్రమత్తతతోనే ప్రమాదం

నేడు వరల్డ్ వాటర్ డే

పళ్ళు తోముకునే సమయంలో కొందరు నీటిని ఎక్కువగా వినియోగిస్తారు. షేవ్ చేసుకునే సమయంలోనూ కుళాయిని తిప్పి ఉంచుతారు. పాత్రలు శుభ్రం చేసుకునేటప్పుడైనా, భోజనం తరవాత చేతులు కడుక్కునే సమయంలోనైనా అందరూ ఇదే తీరు. ఎంతో నీరు వృథా అయిపోతుంటుంది. ఈ సందర్భంలో మన పెద్దలు చెప్పిన మాట ఒకటి గుర్తుకు రాక మానదు. నీళ్ళు ఎక్కువగా వాడితే డబ్బు కూడా ఎక్కువగా ఖర్చయిపోతుంది.. ఆ ఇంటిలో లక్ష్మి నిలబడదని పెద్దలు అన్న విషయం మదిలో మెదిలిందా.. నీటి వినియోగం ఏ రంగంలోనైనా తక్కువగా చేయాలి. దానితో పాటు పరిరక్షించుకోవాలి. లేకుంటే భవిష్యతరాలు నీటికి కటకటలాడతాయి. కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్ళి తెచ్చుకోవడానికి సైతం నీరు దొరకదు.. ఇది నిజం..

జలం జీవనాధారం.. తాగడానికి గుక్కెడు నీరు లేక గొంతెండిపోయి విలవిలలాడుతున్న వారు కోట్ల సంఖ్యలో ఉంటారు. విధిలేని పరిస్థితుల్లో అపరిశుభ్రమైన నీటిని తాగి, వ్యాధుల బారిన పడి, ఆపై మృత్యు ఒడికి చేరుతున్నారు. ప్రకృతిలో సహజంగా లభించే జీవన వనరులలో జలం ఒకటి. కొండకోనల్లోంచి దూసుకొస్తూ.. నదులుగా మారి పరిసరాలను సస్యశ్యామలం చేస్తూ పారుతున్న జలాలను ఇంతవరకూ చూశాం. ప్రస్తుతం ఆ స్థానంలో కశ్మలంతో నిండిన నీళ్ళు దర్శనమిస్తున్నాయి. పారిశ్రామికవ్యర్థాలు.. రసాయనిక అవశేషాలు.. ఇలా అంతులేని కాలుష్యకారకాలు నీటిలో కలుస్తూ విషతుల్యం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి. గోదావరి పక్కనే ఉన్నా ఇదే దృశ్యం. నైలు నది సమీపంలో ఉన్నా ఇదే సన్నివేశం. నదులుండి ఒకడు బాధపడితే.. నదులు లేక బాధపడేవాడొకడు. భూగర్భ జలాలు ఇంకిపోయి... మట్టం పాతాళానికి చేరిపోతోంది. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి సంక్షోభాన్ని నివారించేందుకు మనవంతు కృషిని చేద్దాం.

జనాభాకు అవసరమైన నీరు భారత్‌లో అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని అధిగమించడం ఎలా? భారత్‌లో 6కోట్ల 30లక్షల మందికి పరిశుభ్రమైన జలం అందుబాటులో ఉండడం లేదు. దీన్ని అధిగమించడానికి అత్యవసర చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఈ సంక్షోభం సూచిస్తోంది. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలో ఇంకేలా చేయకపోతే.. పరిస్థితులు మరింత దిగజారిపోతాయి. నీటి పరిరక్షణకు పెద్ద మొత్తంలో ఆర్థిక పెట్టుబడులు పెట్టాలి.

ప్రపంచంలో ప్రతి వనరూ అదృశ్యమైపోతున్నాయి. అందులో నీరు ప్రధానమైనది. కుండలో నీళ్ళు నిండుకోకుండా చూసుకోవాలి. పరిశుభ్రత మొదలు వివిధ పనులలో వాడకం నీటిని వృథా చేయకుండా చూసుకోవాలి. ఇకపై నీటిని విచ్చలవిడిగా వాడటానికి వీలు లేదు. నీటి సంక్షోభం రక్కసిలా మారి ప్రపంచాన్ని కమ్మేయకముందే ప్రతి ఒక్కరూ మేల్కొనాలి. ఐక్య రాజ్య సమితి సర్వే ప్రకారం భూమిపై 2.1 బిలియన్ల మందికి సురక్షితమైన నీరు అందుబాటులో లేదు. ఇది ప్రపంచ జనాభాలో 28శాతానికి సమానం. వాతావరణ మార్పులు, ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న జగడాలు, ఎండిపోతున్న నీటి వనరులు దీనికి కారణం. భారత్‌లో మంచినీటికి నోచుకోని వారి సంఖ్య కోట్లలోనే ఉంది. గృహ, పారిశ్రామిక అవసరాలకోసం విచక్షణారహితంగా నీటిని విచ్చలవిడిగా వాడేస్తున్న కారణంగా అది ఇక నిత్యం లభించే జాబితా నుంచి తొలగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి కేప్‌టౌన్‌లో చుక్క నీరు లభ్యంకాని పరిస్థితి ఏర్పడింది. కరవు, తదితర కారణాలున్నప్పటికీ.. నీటి వినియోగం ఏమాత్రం తగ్గకపోవడం దీనికి ప్రధాన హేతువు. ఆ ప్రాంతంలో నీటి వనరులు క్రమేపీ అంతరించిపోతూ వచ్చాయి. నీటి పరిరక్షణకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం ఆత్మహత్యాసదృశంగా మారింది. సహజ నీటి వనరులు కనుమరుగయ్యాయి. ఇవి ఆ నగరాన్ని కోలుకోలేని స్థితికి చేర్చేశాయి. సావో పౌలో, బీజింగ్, కైరో, మెక్సికో నగరాలు సైతం మంచినీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

నీరు అస్సలు లభించని పరిస్థితులున్న నగరాల్లో భారత్‌లోని బెంగళూరు ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. ఈ సంక్షోభం త్వరలో ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాలనూ తాకబోతోంది. ఈ నగరాల్లో భూగర్భ జలాలు ఇంచుమించుగా కనుమరుగయ్యాయి. వీటిమీద ఎక్కువగా ఆధారపడడమే దీనికి ప్రధాన కారణం. ఇదే జల వనరులు అదృశ్యానికి దారితీస్తున్నాయి. పరిస్థితి మరింత అధ్వానం కాకముందే కళ్ళు తెరిస్తే మేలు. అది భూగర్భ జలాలు కానీ, నీటి వనరులు కానీ.. ఏద్దైనప్పటికీ వృథాగా ఖర్చుచేయడం మానాలి. లేకపోతే.. నీరు అదృశ్యమైపోతుంది. భారత్‌లో ప్రస్తుతం 395 బిలియన్ క్యూబిక్ మీటర్ల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. మరోపక్క, 2015నుంచి నీటి వినియోగం 66శాతం పెరిగింది. 2004లో ఇది 58శాతమే. జల నిపుణులు ఈ అంశంపై తీవ్రంగా కలతచెందుతున్నారు. 2025నాటికి భారత్‌లో భూగర్భ జలాల వినియోగం 75శాతానికి చేరుతుందని అంచనా. గణాంకాల దృష్ట్యా చూస్తే ఇది ఆందోళన కలిగించే అంశం. కేప్‌టౌన్ తరహా సంక్షోభాన్ని తప్పించుకునేందుకు దేశంలోని పట్టణ ప్రాంతాలు తమ నీటి వాడకాన్ని గణనీయంగా తగ్గించుకోవాలి. వర్షపు నీటి



సంరక్షణ, నీటి పునర్వినియోగ పద్ధతులపై ఆధారపడాలి.

గొట్టపు బావులు, బోర్ వెల్స్, నీటిని తోడే యంత్రాలు భూగర్భ జలాల పాలిట శాపంగా పరిణమించాయి. వీటి వినియోగం పూర్తిగా తగ్గాలి. దీనివల్ల భూగర్భంలో మిగిలున్న కొద్దిపాటి జలాన్ని భావితరాల కోసం సంరక్షించే అవకాశముంటుంది. పారిశ్రామిక అవసరాలకు రీ సైకిల్డ్ వాటర్‌ను వినియోగించుకోవచ్చు. వాణిజ్యావసరాలకూ వీటిని వాడవచ్చు.

కొద్ది సంవత్సరాలుగా భారత్‌లో నీటి అవసరాలు విపరీతంగా పెరిగిపోయాయి. 2000 సంవత్సరంలో సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదిక మేరకు భారత్‌కు 634 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరమని తేలింది. 2025నాటికి ఇది 1093బిలియన్ క్యూబిక్ మీటర్లకూ, 2050నాటికి 1447 బిలియన్ క్యూబిక్ మీటర్లకూ పెరుగుతుందని అంచనా వేసింది. తలొక్కింటికీ అవసరమైన నీటి లభ్యత కూడా తగ్గుతూ వస్తోంది. 1951లో ఇది 5177క్యూబిక్ మీటర్లుగా ఉంది. 1991లో అది 2237క్యూబిక్ మీటర్లకు తగ్గింది. 2001లో 1816క్యూబిక్ మీటర్లకూ, 2011లో 1545 క్యూబిక్ మీటర్లకూ తగ్గిపోయింది. 2050నాటికి ఇది 1140క్యూబిక్ మీటర్లకు పడిపోతుంది. ఈ గణాంకాలు దేశం ఎదుర్కొనబోయే నీటి సంక్షోభాన్ని సూచిస్తున్నాయి.

పశ్చిమ ఆఫ్రికాలోని సియెరా లియోన్ అనే ఓ దేశం 2010నాటికి ప్రపంచంలోనే అత్యంత దుర్భరమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మనిషికి పది లీటర్ల కంటే నీరు లభించడం లేదు. ఆ పరిమాణానికి కూడా విపరీతంగా డబ్బును వెచ్చించాల్సి వచ్చింది. 2011నుంచి ఆ దేశంలో వర్షపు నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టారు. ఆ దేశంలో 40శాతం విస్తీర్ణం ఈ పద్ధతిని పాటిస్తున్నారు. వాన నీటి సంరక్షణ పద్ధతిలో నిల్వ చేసిన జలాలను వివిధ అవసరాలకు వినియోగించుకోవచ్చు. వ్యవసాయానికి సైతం ఈ నీరు ఉపయోగపడుతుంది. భారత్‌లో వ్యవసాయానికి భూగర్భ జలాలనూ, నదులు, చెరువుల నీటిని ఎక్కువగా వాడతారు. సింగపూర్, థాయ్‌ల్యాండ్, జపాన్, ఇండోనేసియా, బంగ్లాదేశ్ వంటి దేశాలు వ్యవసాయానికి వాన నీటిని విజయవంతంగా వినియోగిస్తున్నారు. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌ను చూసైనా భారత్ పాఠం నేర్చుకోవాలి.

పట్టణీకరణ, నీటి సంక్షోభం మధ్య సంబంధంపై 2013లో వరల్డ్ వాటర్ కౌన్సిల్ ఒక సర్వే నిర్వహించింది. హేతుబద్ధంగా లేని పట్టణీకరణ, పెరుగుతున్న ఆర్థిక వనరులు నీటి మట్టాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆ అధ్యయనం తేల్చింది. భారత్‌లో బెంగళూరు, ఢిల్లీ, ముంబై, తదితర నగరాల అనూహ్య విస్తరణ భూగర్భ జల మట్టాలను తగ్గించేస్తోంది. నదీ తీరాలలో నివసించే జనాభా పెరుగుదల సైతం పట్టణీకరణ నీటిని ఏ విధంగా ప్రభావితం చేస్తోందో చెప్పడానికి మంచి ఉదాహరణగా నిలుస్తోంది. ఒక జల వనరుకు సమీపంలోని వాణిజ్య లేదా నివాస సముదాయాలను తమ పరిధిని నియంత్రించేలా చేయడం నీటి సంరక్షణ దిశగా చేపట్టే ఒక చర్యగా చెప్పచ్చు. భారత్‌లో నీటిసంక్షోభాన్ని నివారించాలన్న దృఢనిశ్చయం ఉంటే ఇది ఒక చక్కటి చర్య కాగలదు. భారత్‌లో నీటి సంరక్షణ ప్రాజెక్టులపై ఎక్కువ మొత్తాన్ని వెచ్చించాలి. 2013లో నీటి వినియోగం వెయ్యి బిలియన్ క్యూబిక్ మీటర్లు. చిన్న దేశాలతో పోలిస్తే మన దేశంలో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉన్నట్లే. అవసరానికి తగ్గట్లుగా భారత్‌లో ఎక్కువ మొత్తాలను బడ్జెట్లో కేటాయించాలి. నమామి గంగా కార్యక్రమానికి 20వేల కోట్ల రూపాయలను కేటాయించడం ఇందుకో ఉదాహరణ. ఈ కార్యక్రమం గంగా నదిని పరిశుభ్రం చేసేందుకు ఉద్దేశించారు. దీనివల్ల గంగా ప్రవాహం పెరిగి, నీరు మరిన్ని ప్రాంతాలకు చేరుతుంది. ఇలాంటి తరహా ప్రాజెక్టులను భారత్ మరిన్ని చేపట్టాలి. 2017లో చైనా 64వేల కోట్ల రూపాయలను నీటి సంరక్షణ ప్రాజెక్టులకు కేటాయించింది. భూగర్భ జలాల వాడకాన్ని తగ్గించడం కోసం ఆ దేశం నీటిని సంరక్షించడానికి పెద్దపెద్ద నిర్మాణాలను చేపడుతోంది. బ్రెజిల్ ప్రభుత్వం నీటికి రేషన్ కేటాయించి పౌరులను జాగృతం చేశారు. ఈ చర్య రిజర్వాయర్ల నుంచి నీటి వాడకాన్ని 22శాతం మేర తగ్గించింది. వినియోగం.. రిజర్వార్లను నింపడం మధ్య వ్యత్యాసాన్ని కూడా ఇది పెంచింది. భారత్‌లో నమామి గంగా ప్రాజెక్టు ఒక్కటే పరిస్థితులను చక్కదిద్దలేదు. భూగర్భ జలాలను పెంచడాన్ని ప్రాధాన్యంగా తీసుకుని, తగిన మొత్తాన్ని ఇందుకోసం వెచ్చిస్తే ఫలితముంటుంది. తూర్పు ఆఫ్రికాలో అతి పేద దేశం టాంజానియా. 1990 దశాబ్దం మధ్యలో ఆ దేశంలో మంచినీటి సంక్షోభం తీవ్రస్థాయికి చేరింది. దీన్ని అధిగమించడానికి నీటిని సంరక్షించే పద్ధతులపై ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. ఇది సత్ఫలితాలను ఇచ్చింది. 2010నాటికి దేశంలోని 50శాతం వ్యవసాయం వర్షపు నీటితోనే నిర్వహించుకునే స్థాయికి ఎదిగింది. ఆర్థికంగా ఎదగడం ఒక్కటే నీటి పరిరక్షణకు కీలకం కాదని చెప్పడానికి ఇది చక్కటి ఉదాహరణ. ప్రజలలో అవగాహనను పెంచి, అప్రమత్తం చేయడం, నీరు నిరంతరం లభించే వనరు కాదని వారికి తెలియజెప్పడం నీటి పరిరక్షణ ఉద్యమంలో భాగం చేయాలి. అప్పుడే భవిష్య తరాలకు మంచినీటిని అందించగలుగుతాం.

-సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి

కేంద్రీకరణ.. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం!

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల ఒక ఆర్థిక సదస్సులో మాట్లాడుతూ తమ ప్రభుత్వం 400 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందనీ,వాటి ఫలితాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని ప్రకటించారు. వరుస ఎన్నికల విజయాలతో ఆయనలో ఆత్మవిశ్వాసం తొణికసలాడుతున్న మాట నిజమే.అలాగే,సమీప భవిష్యత్ లో ఆయనకు ఎదురు నిల్చే నాయకుడు లేని మాటా నిజమే, కానీ, అంతటి స్థాయిలో ఉన్న నాయకుడు ఏం చెబితే అది జనం నమ్మితీరాలని అనుకుంటే వాస్తవాన్ని విస్మరించినట్టే. ఆయనే పేర్కొన్నట్టు సంక్షేమ పథకాల ఫలాలన్నీ లబ్ధిదారులకు చేరుతున్నట్లయితే, పేదల సంఖ్య తరగడం లేదే. దేశంలో సంపద పెరుగుతోంది, కానీ అది కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృతం అవుతోందని ఆక్స్ ఫామ్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.ఆర్థిక సదస్సులో మోడీ ప్రకటించిన సమయంలోనే ఈ సర్వే నివేదిక వెల్లడైంది. అంటే ప్రభుత్వానికి అందే సమాచారం సరైనది కాదని అనుకోవాల్సి ఉంటుంది. పూర్వపు ప్రభుత్వం అమలులో పెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి మంచి పథకాలకు కూడా నిధుల్లో కోత విధించడం వల్ల అది సక్రమంగా అమలు జరగడం లేదు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి,తెరాస అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు ఇటీవల డిమాండ్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు,బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఇదే మాదిరిగా డిమాండ్ చేశారు . గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని క్షేత్ర స్థాయిలో అమలు జరపాల్సింది రాష్ట్రాలే అయినప్పుడు,రాష్ట్రాల మాటకు కేంద్రం విలువ ఇవ్వాలి కదా. గ్రామాలకు అనుసంధాన రోడ్లు వేయించుకోవాలన్నా కేంద్రం నుంచి అనుమతులు తెచ్చుకోవల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఇటీవల ముఖ్యమంత్రులు చేస్తున్న వ్యాఖ్యల్లో అసత్యంలేదు. రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించిన నిధులకు లెక్క చెబితేనే మరుసటి సంవత్సరం నిధులు విడుదల చేస్తామని కేంద్రం ఖరాకండీగా చెబుతోంది.అంటే ఆర్థిక కేంద్రీకరణ జరుగుతోంది. అధికారాలు కేంద్రీకృతమైతే ఫెడరల్ వ్యవస్థ స్వరూపమే మారిపోతుంది.అందుకే, ఇప్పుడు బీజేపీ యేతర ముఖ్యమంత్రులంతా ఇప్పుడు ఫెడరల్ స్ఫూర్తిని పాటించాలంటూ గళమెత్తుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద నవ్యాంధ్రకు రావల్సిన నిధుల విషయంలో కేంద్రం ఇదే మెలిక పెట్టింది.నిధుల కేటాయింపులపై కేంద్రం పర్యవేక్షణ ఉండటంలో తప్పు లేదు కానీ, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కూడా ప్రజల చేత ఎన్నుకోబడినవే కనుక, నిధులు ఖర్చు చేయడంలో వాటికి ఆమాత్రం స్వేచ్ఛ లేకపోతే ఎలా అనే ప్రశ్న సహేతుకమైనదే. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ అంశం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశం కావడం వల్ల ఈ అంశాలన్నీ బయటకు వస్తున్నాయి. కేంద్రంలోనూ, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సమస్యలేవీ ఉత్పన్నం అయ్యేవి కావు. కేంద్రంలో,రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడే ఈ వివాదాలు తలెత్తుతున్నాయి. అయితే, సంక్షేమ పథకాల నిధుల బట్వాడాకు ఆధార్ అనుసంధానం ప్రవేశపెట్టడం వల్ల కొంత మేర మేలు జరిగిన మాట వాస్తవమే.కానీ,ఆధార్‌ని సంక్షేమానికి ముడిపెట్టవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం వల్ల అది కూడా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఒక్క రాష్ట్రాల విషయంలోనే కాదు,వివిధ ప్రభుత్వ శాఖల పద్దులకు కేటాయింపులో కూడా మోడీ ప్రభుత్వం వ్యయకర్తనానికి ప్రాధాన్యం ఇస్తున్న మాటనిజమే.ప్రభుత్వ వ్యయంలో దుబారా తగ్గించడం కోసం పూర్వపు ప్రభుత్వాలు కూడా ప్రయత్నాలు చేశాయి.అయితే,రాజకీయ పరమైన ఒత్తిడుల మేరకు తామే విధించుకున్న



నియమాలనే ఉల్లంఘించాయి. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి తప్పవని వాదించేవారున్నారు. ఏనాడూ బ్యాంకు ముఖం చూడని నిరుపేదల కోసం జన్‌ధన్ యోజన పేరిట జీరో బ్యాలెన్స్ ఖాతాలను తెరిపించామంటూ ప్రధానమంత్రి పదే పదే ప్రకటిస్తున్నారు. ఈ ఖాతాల్లో 75 వేల కోట్ల రూపాయిలు జమ అయ్యాయని చెబుతున్నారు. కూటికి లేని నిరుపేదలు ఇంత పెద్ద మొత్తాలను బ్యాంకులలో ఎలా జమ చేయగలిగారన్నది అంతు చిక్కని విషయమే. పెద్దనోట్లు రద్దు సమయంలో పాత నోట్లను మార్చుకోవడానికి మార్గాల అన్వేషణలో నల్ల కుబేరులు ఈ జన్‌ధన్ ఖాతాల్లో వేల కోట్ల రూపాయిలను జమ చేసినట్టు కథనాలు వెలువడ్డాయి.జన్‌ధన్ పథకం విఫల ప్రయోగమని బ్యాంకింగ్ రంగానికి చెందిన నిపుణులే పేర్కొంటున్నారు. నల్ల ధనాన్ని దాచుకోవడానికి మాత్రమే ఈ ఖాతాలు ఉపయోగపడుతున్నాయన్న ఆరోపణల్లో అసత్యంలేదు. డబ్బు జమ చేసే చలానాలను పూరించలేని నిరక్షరాస్యుల ఖాతాల్లో ఇంత పెద్ద మొత్తం జమ అయిందంటే నమ్మశక్యం కాని విషయం.అందువల్ల జనధన్ వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు సరికదా, మధ్య తరగతి వారి సేవింగ్స్ ఖాతాల్లో కనీస నిల్వ ఐదువేలు ఉండి తీరాలన్న నిబంధన ప్రవేశపెట్టడం వల్ల ఈ వర్గాలు చాలా నష్టపోయాయి.దీనిపై ఆందోళన జరిపితే చివరికి ఆ పరిమితిని వెయ్యి రూపాయిలకు తగ్గించారు.బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలను ప్రవేశ పెడుతున్నట్టు, మూలధనాన్ని సమకూరుస్తున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తరచూ ప్రకటనలు చేస్తున్నారు అయితే, రుణాల ఎగవేత దారుల వల్ల బ్యాంకుల్లో మూల ధనం నిల్వలు తరిగి పోవడంతో వాటికి ప్రత్యేకంగా మూల ధనాన్ని విడుదల చేస్తున్నారు.అంటే, ప్రస్తుతం ఈ మూలధనాన్ని విడుదల చేయకపోతే అవి మూత బడటం ఖాయం.ఇప్పటికే, స్టేట్ బ్యాంకు అనుబంధ బ్యాంకులను నడపలేక విలీనం చేశారు.ఇలాంటివి ఇంకా ఎన్నో చర్యలను తీసుకుంటే తప్ప బ్యాంకింగ్ రంగాన్ని గట్టెక్కించడం సాధ్యం కాదని ఆ రంగానికి చెందిన నిపుణులే పేర్కొంటున్నారు.

ప్రధానమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం వల్ల కోటి ఉద్యోగాలు కొత్తగా రావల్సి ఉండగా,అది కేవలం కాగితాలకే పరిమితమైనదిగా కనిపిస్తోంది.మేక్ ఇన్ ఇండియా విఫలం అయిందనివేరే చెపనవసరలేదు. రాఫెల్ యుద్ధ విమానాల దిగుమతి ఇందుకు నిదర్శనం. మోడీఆలోచన ప్రకారంఅటువంటి విమానాలనూ, వాటి విడిభాగాలనూ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద మన దేశంలో తయారు చేయాల్సి ఉంది.విదేశీ కంపెనీలనుంచి తగిన చొరవ లేకపోవడం వల్ల విదేశీ పరిజ్ఞానంతో అటువంటి విమానాలను మన దేశంలో తయారు చేయడం ఇప్పట్లో సాధ్యంకాదని తేలడం వల్లనే వాటిని ప్రభుత్వం దిగుమతి చేసుకుంటోంది. మోడీ సంకల్పం మంచిదే, ఆయన వేస్తున్న అడుగులూ సరైనవే.కానీ, ఆయనకు లభిస్తున్న ప్రోత్సాహం అంతంత మాత్రంగా ఉంది. ఈ కార్యక్రమాలే కాదు, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలకు కూడా సరైన ప్రోత్సాహం లభించడంలేదు. మోడీ అధికారంలోకి వచ్చి రేపు జూలైకి నాల్గేళ్ళు పూర్తి అవుతుంది.ఒక్క ఏడాది మాత్రమే గడువు ఉంది.ఈ ఏడాది వ్యవధిలో ఆయన తలపెట్టిన, లేదా ప్రవేశపెట్టిన కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకుని వెళ్తారనేది శేష ప్రశ్న.

-పద్మనాభస్వామి

అభిప్రాయం

ఆరోగ్య హక్కు కావాలి

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాట అక్షరాలా సద్దిమూటే. నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితులు, సామాజిక సమస్యలతోపాటు మూఢనమ్మకాలు ప్రబలంగా పాతుకుపోయిన మన సమాజంలో అధికులకు ఆరోగ్యంపై అవగాహన తక్కువ. అందువల్లనే నేడు దేశంలో అత్యధికులు వ్యాధి ముదిరేవరకూ నిర్లక్ష్యం, సొంత వైద్యం, అనర్హులైన వైద్యుల పర్యవేక్షణలో కాలం గడుపుతూ ఇళ్లూ ఒళ్లూ గుల్లచేసుకుంటూ అనంతరం పెద్ద వైద్యశాలలకు పరుగెడుతున్నారు. ప్రభుత్వాలు కూడా ప్రాథమిక వైద్యశాలలను నిర్లక్ష్యం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వాటి నిర్వహణ అస్తవ్యస్తమవటంతో పేద ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనికి విరుగుడుగా అందరికీ ఆరోగ్య పరీక్షలు వారి వద్దకే వెళ్లి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేయడం అభినందనీయం మరియు అత్యంతావశ్యకం కూడా. ముఖ్యంగా మన సమాజంలో మారిన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, దురలవాట్ల మూలంగా జీవనశైలి వ్యాధులు (మధుమేహం, రక్తపోటు, ఊబకాయం ఇత్యాది) పెరుగుతుండగా మరొకవైపు శుభ్రత లేమి, అవగాహన లేమి మరియు వివిధ కాలుష్యాలతో అంటువ్యాధులు సైతం ప్రజల్ని ప్రభావితం చేస్తున్న ప్రస్తుత తరుణంలో ఉచితంగా, చేరువలో ప్రభుత్వమే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయబూనుకోవటం వల్ల ప్రజలకు అవగాహన పెరగటమే కాక చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా వర్తించేలా ఆయుష్మాన్ భారత్ పథకం ప్రవేశపెట్టడం అభినందనీయమే అయినాకిందిస్థాయి వరకు నాణ్యమైన వైద్యసేవలు చేరువ చేయటం వల్ల పేద ప్రజలకు చాలా మేలు కలుగుతోంది అనటంలో అతిశయోక్తి లేదు.

-వినోద్ కుమార్ సుద్దాల
రీసెర్చి స్కాలర్

ఐసిస్ చర్య తీవ్ర విషాదం

ఇరాక్ లో మోసుల్ పట్టణంలో ఐసిస్ తీవ్రవాదుల బందీలుగా ఉన్న 39 మంది అమాయక భారతీయులు ఊచకోతకు గురికావడం జాతీయ విషాదం.గుండెల్ని కలచివేసే వార్త.భారత్ నుండి పొట్ట చేత బట్టుకొని ఆ పట్టణం చేరిన అభాగ్యులు 2014లో ఉగ్రవాదుల పాల బడ్డారని తెలిసినా,క్షేమంగానే ఉంటారన్న ఆశ ఇంతవరకూ ఉంది. అయితే కరడు గట్టిన ముష్కరులకు ప్రాణం తియ్యడం తప్ప మరోటి చేతగాదని ఈ ఊచకోత ద్వారా మరోసారి నిరూపితమైంది.అభాగ్యుల కుటుంబాలకు ప్రభుత్వం,పౌరసమాజం అండగా నిలబడాల్సిన సమయమిది.'తమ వారి మరణ వార్తని తెలియబర్చడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని' వారి బంధువులు ఆక్షేపించడంలో తప్పు లేదు. దుర్వార్త తెలిసిన షాక్ లో ఆవేదన చెందడం అర్థం చేసుకోదగ్గది. అయితే ఆ రకమైన విమర్శలు ప్రతిపక్షాలు చెయ్యకూడదు.పూర్తి నిర్ధారణ జరగకుండా, ఐడెంటిటీ ధ్రువీకరించుకోకుండా మరణం లాంటి సీరియస్ విషయాన్ని ప్రభుత్వం ఎలా ప్రకటిస్తుంది?లోక్ సభ లో కూడా ప్రతిపక్షాలు మరింత హుందాగా ప్రవర్తించాల్సింది. ఇంతటి పెను విషాదాన్ని మానవత్వపు కోణంలో తప్ప మరే కోణంలోనూ చూడరాదు. మోసుల్ పట్టణం ఐసిస్ ముష్కరుల కబంధ హస్తాలనుండి విముక్తి అయ్యుండొచ్చు. ప్రపంచంలో అన్ని ప్రాంతాలూ ఉగ్రవాదం నుండి విముక్తి కావాలి.అంతవరకూ ప్రమాదం పొంచి ఉన్నట్టే.ఏ మూల విషబీజాలున్నా,అన్ని దేశాలకూ అవి ప్రమాదకరమే. ప్రపంచదేశాలు తమతమ స్వార్థాన్ని పక్కన పెట్టి ఉగ్రవాదంపై ఏకోన్ముఖ పోరు సల్పకుంటే అందరికీ ప్రమాదమే.



డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.



ఎస్పీ, బీఎస్పీకి 'షా'క్!

ఎత్తుకు పైఎత్తు వేసిన అమిత్‌షా

- అఖిలేష్‌తో భేటికి ఏడుగురు ఎమ్మెల్యేలు డుమ్మా
- 24గంటల్లో పరిస్థితి తారుమారు
- యూపీలో రాజ్యసభ పోరు రసవత్తరం
- మాయావతి వర్గంలో ఆందోళన

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇటీవల లోక్‌సభ ఉప ఎన్నికల్లో తమను ఖంగుతినిపించిన ఎస్పీ-బీఎస్పీ కూటమిని దెబ్బకుదెబ్బ తీసేందుకు బీజేపీ పావులు కదిపింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నేరుగా రంగంలోకి దిగడంతో సమీకరణలు వేగంగా మారుతున్నాయి. గతేడాది గుజరాత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్‌ను ఓడించడంలో విఫలమైన అమిత్‌షా ఈసారి పక్కా వ్యూహంతో అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. తమ అభ్యర్థి గెలుపునకు అవసరమైన సంఖ్యా బలాన్ని కూడగట్టేందుకు విపక్షకూటమి ఎమ్మెల్యేలకు గాలం వేసినట్లు తెలుస్తోంది. బుధవారం పార్టీ ఎమ్మెల్యేలతో అఖిలేశ్ నిర్వహించిన సమావేశానికి ఏడుగురు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయింది. దీనివెనుకవెనుక అమిత్‌షా హస్తం ఉందన్న ప్రచారం జరుగుతోంది. తాజా పరిణామాలు మాయావతి పార్టీకి చెమటలు పట్టిస్తున్నాయి. బీఎస్పీ అభ్యర్థి తేలిగ్గా నెగ్గాల్సిన చోట బీజేపీ ఎత్తులతో కష్టకాలం వచ్చిపడింది.

➥ రాజ్యసభలో యూపీకి 31 స్థానాలు ఉన్నాయి. ఇందులో 10 స్థానాలకు ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి. 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి తొమ్మిది మంది, బీఎస్పీ,ఎస్పీ పార్టీల నుంచి ఒక్కొక్కరు బరిలో నిలిచారు.

➥ రాజ్యసభ అభ్యర్థిగా విజయం సాధించాలంటే 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాగా, బీజేపీకి 312 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో పూల్‌పూర్ ఎమ్మెల్యే ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో ఆ పార్టీ సంఖ్యా బలం 311కి పరిమితం అయింది. అంటే ఆ పార్టీ నుంచి 8 మంది అభ్యర్థుల విజయం ఖాయం. తొమ్మిదో అభ్యర్థిని రంగంలోకి దించడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

➥ సమాజ్‌వాదిపార్టీ సంఖ్యా బలం 47. వారి అభ్యర్థికి సరిపోను అదనంగా 10 ఓట్లున్నాయి. తమ పార్టీ తరఫున జయాబచ్చన్‌కు మరోసారి అవకాశం కల్పించారు.

➥ బీఎస్పీకి 19 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరికి ఎస్పీ నుంచి 10 మంది, కాంగ్రెస్‌కి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు మద్దతిస్తున్నారు. అజిత్‌సింగ్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే కూడా మాయావతికి మద్దతు ప్రకటించారు. దీంతో బీఎస్పీ అభ్యర్థి విజయానికి లైన్‌క్లియర్ అయినట్లే.

➥ సరిగ్గా ఇక్కడే బీజేపీ దూకుడు ప్రదర్శించింది. సంఖ్యాబలం లేకున్నప్పటికీ తొమ్మిదో అభ్యర్థిని పోటీలో నిలబెట్టింది. ప్రత్యర్థుల మద్దతుదారుల్లో చీలిక తెచ్చేవ్యూహం పన్నింది. తొమ్మిదో అభ్యర్థికి మిత్రపక్షం అప్నాదళ్, ఎస్‌బీఎస్‌పీ సభ్యులతో కలిపి ప్రస్తుతం 28 మంది ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉంది. విజయానికి మరో 9మంది అవసరం. నిషాద్ పార్టీ ఎమ్మెల్యే మద్దతు లభిస్తుందన్న నమ్మకంతో ఉంది. అంతిమంగా విజయానికి ఏడుగురు ఎమ్మెల్యేలు అవసరం.

యూపీ అసెంబ్లీలో బలాబలాలు

బీజేపీ	311
బీఎస్పీ	19
ఎస్పీ	47
కాంగ్రెస్	7
అప్నాదళ్	9
ఎస్‌బీఎస్‌పీ	4
స్వతంత్రులు	3
ఆర్‌ఎల్‌డీ	1
నిషాద్ పార్టీ	1
మొత్తం	**402**

అంబేద్కర్ వర్సెస్ అగర్వాల్

కొద్దిమాసాల కిందట రాజ్యసభస్థానానికి అర్ధాంతరంగా రాజీనామా చేసిన మాయావతి ఈ ఎన్నికల్లో తిరిగి పోటీచేస్తుందని బీఎస్పీ వర్గాలు భావించాయి. కానీ, అనూహ్యంగా ఆమె దళిత నేతను పోటీకి నిలబెట్టింది. మాజీ ఎమ్మెల్యే భీమ్‌రావ్ అంబేద్కర్‌తో నామినేషన్ వేయించింది. అటు బీజేపీ వ్యూహాత్మకంగా అగ్రవర్ణం నాయకుడు, పారిశ్రామికవేత్త, సమాజ్‌వాది ఎమ్మెల్యే అనిల్ అగర్వాల్‌ని తమ పార్టీ తరఫున రంగంలోకి దించింది. తద్వారా మాయావతి సంఖ్యాబలాన్ని తగ్గించాలని వ్యూహం పన్నింది. ఈ పరిణామంతో అటు ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లో ఆందోళన మొదలైంది. ఎన్నికల నాటికి ఇంకెందరికి బీజేపీ వలవేస్తుందోనన్న బెంగ మొదలైంది. సమాజ్‌వాది అంతర్గత కలహాలను కమలనాథులు అనుకూలంగా మలచుకునే ప్రమాదం ఉందన్న చర్చ వినిపిస్తోంది.

ఓడినా బీఎస్పీదే పైచేయి..

ఒకవేళ బీజేపీ కుయుక్తులు ఫలించి, తొమ్మిదో అభ్యర్థి గెలిస్తే కమలనాథులపై ఎదురుదాడి చేసేందుకు మాయవతికి అవకాశం లభిస్తుంది. దళితుల అణచివేత నినాదంతో ఆమె అధికార పార్టీపై ధ్వజమెత్తుతుంది. ఒకవేళ బీఎస్పీ విజయం సాధిస్తే 2019లో దూకుడు పెంచేందుకు వీలవుతుంది. ఎస్పీ-బీఎస్పీ కూటమి వ్యూహం మున్ముందు బీజేపీ ముందరి కాళ్లకు బంధాలు వేసినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 83 స్థానాలకు గాను 73 ఎంపీ స్థానాలను కలిగివున్న బీజేపీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 50 సీట్లు తగ్గుతాయన్న సర్వే అంచనాలు మాయావతికి సానుకూల అంశం.

అమిత్ షా తంత్రమేనా?

లక్నోలో పార్టీ ఎమ్మెల్యేలతో అఖిలేశ్ యాదవ్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఏడుగురు సభ్యులు గైర్హాజరు అయ్యారు. ఇందులో శివ్‌పాల్ యాదవ్‌తోపాటు, కొద్దిరోజుల కిందట బీజెపీ గూటికి చేరి రాజ్యసభ అభ్యర్థిత్వం పొందిన నరేశ్ అగర్వాల్ కుమారుడు కూడా ఉన్నారు. 47మంది ఎస్పీ ఎమ్మెల్యేల్లో శివ్‌పాల్ వర్గానికి చెందిన వారు ఏడుగురున్నారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో వీళ్లు పార్టీకి వ్యతిరేకంగా కోవింద్‌కు ఓటేశారన్న సందేహం ఉంది. ఇప్పుడు అదేమాదిరి క్రాస్‌ఓటింగ్ జరుగుతుందేమోనన్న భయం ఎస్పీ-బీఎస్పీ కూటమిని వెంటాడుతోంది. బీజేపీ తొమ్మిదో అభ్యర్థి విజయానికి కూడా సరిగ్గా ఏడుగురి మద్దతు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిణామం ఆసక్తిగా మారింది. వీళ్లంతా బీజేపీకి మద్దతిస్తారా? అన్న సందేహం వ్యక్తం అవుతోంది. అయితే సమాజ్‌వాదీ వర్గాలు మాత్రం చీలిక ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నాయి. 'ఒకసభ్యుడు జైలులో ఉన్నాడు. అజంఖాన్, అజంఖాన్ అతని కుమారుడు సమావేశానికి రాలేదు. వారిద్దరు పార్టీ వెంటే ఉంటారు. అదేమాదిరి శివపాల్ యాదవ్, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు అఖిలేష్‌తో టచ్‌లోనే ఉన్నారు' అని ఎస్పీ సీనియర్ నాయకుడొకరు వెల్లడించారు.

రెండు గంటల్లో బీజింగ్ టు న్యూయార్క్

బీజింగ్: మౌలికరంగానికి సాంకేతిక పరిజ్ఞాన్ని జోడించి ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్న చైనా మరో అద్భుతాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన హైపర్ సోనిక్ వాయు సొరంగ నిర్మాణాన్ని చేపట్టింది. తద్వారా కొత్తతరం సూపర్ ఫాస్ట్ విమానాల అభివృద్ధికి బాటలు వేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, బీజింగ్ నుంచి రెండు గంటల వ్యవధిలోనే న్యూయార్క్ చేరుకోవచ్చని చైనా అధికారిక మీడియా వెల్లడించింది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 13 గంటల సమయం పడుతున్నది. ఐ ప్లేన్ మోడల్ ద్వారా, 265 మీటర్ల పొడవైన ఈ సొరంగ మార్గం గుండా, ధ్వనివేగాని కంటే 25 రెట్లు వేగంగా ప్రయాణించొచ్చని చైనీస్ అకాడమీ సైన్స్ ముఖ్య పరిశోధకుడు హన్‌గుయ్‌లయ్ చెప్పారు. ప్రస్తుతం ఉన్న వాయు సొరంగం ధ్వనివేగానికి 5-9 రెట్లు అధికవేగానికి మాత్రమే సరిపోతుందని, కొత్త ఆవిష్కరణ దీనికి నాలుగు రెట్లు అధికమని చెప్పారు. నెల రోజుల కిందటే చైనా సైన్స్ జర్నల్‌లో ఈ అంశంపై ప్రత్యేక వ్యాసం ప్రచురించింది. ఈ నూతన ప్రయోగంతో, వాయు సొరంగాల నిర్మాణంలో ప్రపంచంపై ఆధిపత్యం చైనాకు లభించినట్లు అవుతుంది. పర్యావరణ హైపర్‌సోనిక్ ఫైట్ల తరహా ఇంజినీరింగ్ అప్లికేషన్లను పరిశీలిస్తున్నారు. ఒకసారి ఈ అంశంపై స్పష్టత లభించినట్లయితే, ప్రయోగాత్మక ఫైట్లకు లైన్ క్లియర్ లభిస్తుంది.

ఐసిస్ ఆత్మాహుతి దాడిలో 29మంది మృతి

న్యూఢిల్లీ: కాబూల్‌లో బుధ వారం జరిగిన ఐసిస్ ఆత్మాహుతి దాడిలో 29 మంది అక్కడికక్కడే మృతి చెందగా మరో 18 మంది గాయపడినట్టు అధికార వర్గాలు తెలిపాయి. పర్షియన్ కొత్తసంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని కాబూల్‌లోని షియా ప్రార్థనా మందిరం వద్ద నవ్‌రజ్ సెలవు దినాన్ని జరుపుకుంటుండగా ఐసిస్ ఆత్మాహుతి బృందానికి చెందిన సభ్యుడు తనను తాను పేల్చుకుని ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ఐసిస్ దాడిలో 100 మంది మృత్యువాత పడిన అనంతరం అఫ్ఘన్ ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసినప్పటికీ మరల బుధవారం ఈ సంఘటన చోటుచేసుకోవడం భద్రతలోపాలను తెలియచేస్తున్నది. రాజధాని నగరం కాబూల్ ఇంకా ఉగ్రమూకల కనుసన్నలలోనే వున్నట్టు అర్థమవుతున్నది. కాబూల్ నగరం పశ్చిమాన వున్న కర్త్-ఈ-సఖి ప్రార్థనా మందిరం నుంచి ప్రజలు వెలుపలకి వస్తున్న సమయంలో ఆగంతకుడు తన శరీరానికి అమర్చుకున్న బాంబులను పేల్చుకోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నది.

జమ్మూలో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం పోలీసులపై అకస్మాత్తుగా కాల్పులు జరిపారు. వెంటనే తేరుకున్నా అప్పటికే ప్రాణనష్టం జరిగిపోయింది. దీంతో జమ్మూ పోలీసులు, భద్రతా బలగాలతో సంయుక్తంగా మిలిటెంట్ల ఏరివేతకు కూంబింగ్ చేపట్టారు. ఆరాంపొరలోని దట్టమైన అరణ్యప్రాంతంలో మిలిటెంట్లు దాడి చేసినట్లు తెలుస్తోంది. కుప్వారా జిల్లా కేంద్రానికి 12 కి.మీ దూరంలో ఎన్ కౌంటర్ జరిగినట్లు అధికారులు తెలిపారు. అయితే మిలిటెంట్ల దాడిలో ఇంకా ఎంతమంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారనేది అధికారులు ధృవీకరించాల్సి ఉంది. దాడిలో అమరులైన ఇద్దరు పోలీసులు దీపక్, అష్రఫ్‌లుగా గుర్తించారు.

దాడికి ముందే ప్లాన్

భారత్, పాకిస్తాన్ మధ్య ఉన్న నియంత్రణ రేఖ వద్ద విధులు నిర్వహిస్తున్న జవాన్లే లక్ష్యంగా మిలిటెంట్లు దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. శంభీపూర్ అటవీ ప్రాంతంలోని రెండు గట్లు దాటి వచ్చిన మిలిటెంట్లు దాదాపు 8 కి.మీ రహస్య ప్రదేశాల నుంచి వచ్చినట్లు సమాచారం. అయితే దాడులకు ముందు కాశ్మీర్ లోయ ప్రాంతంలోని తమ అనుచరులతో కలిసి ముందు ప్రణాళికలు వేసినట్లు తెలుస్తోంది. నియంత్రణ రేఖదాటి వచ్చిన ఉగ్రవాదులు కుప్వారా నగరానికి సమీపంలో పోలీసులకు తారసపడినట్లు అధికారులు తెలిపారు. పోలీసులను చూసిన వెంటనే సమీప ప్రార్థన మందిరంలోకి.. ఆ తర్వాత అటవీలోకి పారిపోయినట్లు పేర్కొన్నారు. అయితే అప్పటికే నలుగురు మిలిటెంట్లు ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు తెలిపారు. మరో ఇద్దరు మిలిటెంట్లు మాత్రమే ప్రాణభయంతో అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు వెల్లడించారు. వారికోసం ఇంకా ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

జవాన్లకు ముఫ్తీ నివాళి

మిలిటెంట్ల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు, భద్రతా సిబ్బందికి జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ నివాళులర్పించారు. దాడికి తెగబడిన ఉగ్రవాదులను ఎట్టిపరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఏప్రిల్ 2 నుంచి హెచ్-1బి వీసాలు

(మొదటిపేజీ తరువాయి)

చేయగలుగుతానని తెలిపింది. కాంగ్రెస్ విధించిన నియమ, నిబంధనల ప్రకారం ప్రతి ఆర్థికసంవత్సరం 65,000 వీసాలను మాత్రమే మంజూరు చేయాల్సి ఉంటుంది. యుఎస్‌సిఐసి ప్రకారం 2007 నుంచి 2017 మధ్య కాలంలో అది భారతీయుల నుంచి 22 లక్షల హెచ్-1బి వీసా దరఖాస్తులను స్వీకరించింది. అదే కాలవ్యవధిలో చైనా నుంచి 3,01,000 దరఖాస్తులను స్వీకరించింది. కాగా అమెరికాలో ఎమ్మెస్ చేసిన వారికే ప్రాధాన్యం లభించనుంది.

14 బ్యాంకులకు రూ.824 కోట్ల కుచ్చుటోపీ

- సిబిఐకి ఎస్‌బిఐ ఫిర్యాదు
- కనిష్క్ గోల్డ్‌పై కేసు నమోదు
- కంపెనీల కార్యాలయాల్లో సోదాలు

న్యూఢిల్లీ: రూ.824.15 కోట్ల రుణ కుంభకోణానికి సంబంధించి చెన్నయ్‌కు చెందిన కనిష్క్ గోల్డ్ ప్రయి వేట్ లిమిటెడ్‌పై సిబిఐ కేసు నమో దు చేసింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ) నేతృత్వంలో 14 బ్యాంకు లతో కూడిన ఒక సహ వ్య వస్థ మోసానికి గురైందని అధికా రులు తెలిపారు. 14 బ్యాంకుల సహ వ్యవస్థ తరఫున ఎస్‌బిఐ చేసిన ఒక ఫిర్యాదు ప్రాతిపదికగా సిబిఐ కేసు నమోదు చేసిందని వెల్లడించారు. కనిష్క్ గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రమోటర్లకు చెందిన అధికార, ఆవాస ప్రాంగణాల్లో సిబిఐ బుధవారం సోదాలు చేపట్టిందని వారు తెలిపారు. స్వర్ణాభరణాలను తయారుచేస్తున్న కంపెనీ క్రిజ్ బ్రాండ్ నేమ్‌తో వాటిని మార్కెటింగ్ చేస్తున్నది. అది 2104 దాకా పంపి ణీదారుల ద్వారా విక్రయాలు జరిపేది. 2015లో బి2బి(బిజినెస్-టు-బిజినెస్) బిజినెస్ మోడల్‌కు మారింది. అతిపెద్ద చిల్లర ఆభరణాల వర్తకులకు సరఫరా చేయ సాగింది అని సిబిఐకి చేసిన ఫిర్యాదులో ఎస్‌బిఐ పేర్కొంది. రూ.824.15 కోట్ల మో సం జరగగా నష్టాన్ని పూడ్చుకోవడానికి అందుబాటులో ఉన్న సెక్యూరిటీ కేవలం రూ.156.65 కోట్లు మాత్రమేనని ఎస్‌బిఐ ఆరోపించింది. ఫిర్యాదులో నిర్దేశిత అవకతవకలు ఉన్న కారణంగా వాటిని సవరించే నిమిత్తం ఎస్‌బిఐతో సంప్ర దింపులు జరుపుతున్నట్టు సిబిఐ అధికారులు తెలిపారు. కంపెనీ రుణ సదుపా యాలు పొందే నిమిత్తం 2009 నుంచి రికార్డులు, ఆర్థిక స్టేట్‌మెంట్లుగా తప్పుడుగా సమర్పించి అంతా బ్రహ్మాండంగా ఉందనే భావనను కలిగించిందని ఎస్‌బిఐ ఆరోపించింది. కనిష్క్ గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్, దాని డైరెక్టర్లు బ్యాంకు హక్కులు, ప్రయోజనాలను తోసిరాజని నిధులను పక్కదారి పట్టించారని పేర్కొంది. కనిష్క్ గోల్డ్ ప్రయివేట్ లిమిటెడ్, దాని ప్రమోటర్ డైరెక్టర్ భూపేష్ కుమార్ జైన్, తది తరులపై కేసు నమోదు చేయాలని సిబిఐని ఎస్‌బిఐ కోరింది.

నానమ్మ అడుగుజాడల్లో రాహుల్

- చిక్‌మగళూర్ పర్యటించిన కాంగ్రెస్ అధినేత
- ఇందిరకు సెంటిమెంట్ నియోజకవర్గంగా గుర్తింపు



బెంగళూరు: ఇటీవలే పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి తిరిగి పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో సెంటిమెంట్లను ఫాలో అవుతున్నట్లు కనిపిస్తోంది. రానున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన చిక్‌మగళూర్‌లో పర్యటించడం సెంటిమెంట్ ప్రభావంగా పేర్కొంటున్నారు. రాహుల్ శారదాపీఠంలోని శారదాంబ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శృంగేరి మఠం సభ్యులను కలుసుకున్నారు. శారదా పీఠంలో జగద్గురు శంకరాచార్యతో కొద్దిసేపు మాట్లాడారు. తర్వాత వేదపాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు.

1978కి ముందు ఇందిరా గాంధీ పర్యటన కూడా సరిగ్గా ఇలాగే సాగింది. అక్కడి నుంచి ఆమె రాజకీయ జీవితం దశ తిరిగింది. ఎమర్జెన్సీ పరిణామాలతో కాంగ్రెస్‌పార్టీ కోలుకోలేని దెబ్బతిన్నది. స్వయంగా ఇందిర పార్లమెంటు సీటను కోల్పోవాల్సి వచ్చింది. అలాంటి దశలో చిక్‌మగళూరు పర్యటన కాంగ్రెస్‌తోపాటు ఇందిర భాగ్యరేఖను మార్చివేసింది. ఇక్కడి నుంచి పోటీ చేసిన ఇందిర పార్లమెంటులోకి అడుగుపెట్టింది. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ మళ్లీ అలాంటి సంక్లిష్ట దశను ఎదుర్కొంటున్నది. 2014 తర్వాత జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోకేవలం పంజాబ్‌లో మాత్ర మే అధికారాన్ని దక్కించుకుంది. మిగతా అన్నిచోట్లా పరాభవమే మిగిలింది. గోవా, మహారాష్ట్రల్లో పెద్దపార్టీగా అవతరించినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక చతికిలబడింది. ఈ క్రమంలో త్వరలో జరగ నున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు రాహుల్‌తోపాటు కాంగ్రెస్ భవితవ్యానికి కీలకంగా మారాయి. ఈమధ్య కాలంలో కర్నాటకలో పర్యటించడం రాహుల్‌కు ఇది మూడోసారి.

జైలు పక్షులతో చెట్టపట్టాల్.. ఇదేనా అవినీతిపై మీ పోరాటం

అవినీతి రహిత పాలన అందిస్తానని గొప్పలు చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అవినీతి పరులతో కలిసి వేదిక పంచుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జైలుకెళ్లి వచ్చిన వారిని కర్నాటకకు ముఖ్యమంత్రిని చేయాలని చూస్తున్నారు అంటూ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బీజేపీపై నిప్పులు చెరిగారు. యడ్యూరప్ప పేరును ప్రస్తావించకుండానే ఆయన ఎదురుదాడికి దిగారు. కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఇక్కడ పర్యటించిన ఆయన బహిరంగ ర్యాలీలో ప్రసంగించారు. చిక్‌మగళూర్‌తో కాంగ్రెస్ అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తూ, ఎమర్జెన్సీ అనంతరం ఉపఎన్నికలో తన నానమ్మ ఇందిరను ఇక్కడి ప్రజ లు అక్కున చేర్చుకుని, లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించిన ఘటనను ప్రస్తావించారు. ఈ ప్రాంత ప్రజలకు తన హృదయంలో ప్రత్యేకస్థానం ఉందని చెప్పారు. '1978 ఉప ఎన్నికల్లో మీరు నానమ్మను గెలిపించారు. తిరిగి ఆమెను పార్లమెంటులోకి అడుగుపెట్టేలా చేశారు. అత్యవసర సమయాల్లో ఆమెకు మీరు అందించిన మద్దతు కాంగ్రెస్ మరచిపోదు. నేను కూడా ఎప్పటికీ మరువను. నా అవసరం ఎప్పుడొచ్చినా మీకు అందుబాటులో ఉంటాను' అని రాహుల్ హామీ ఇచ్చారు.

రాజ్యసభ అభ్యర్థులు...'ఆర్థిక' పెద్దలు

- అత్యధిక అస్తులు మహేంద్ర ప్రసాద్ (జేడీయూ)కు రూ.4,078కోట్లు

న్యూఢిల్లీ: రాజ్యసభ రేసులో పోటీపడుతున్న అభ్యర్థు ల్లో అత్యధిక శాతం కుబేరులే. ఆయా అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన సందర్భంలో సమ ర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 63 మంది అభ్యర్థుల్లో 87శాతం మంది కోటీశ్వరులే. సరాసరి ఆస్తుల విలువ రూ.122 కోట్లు ఉందని అంచనా. 63 మంది అభ్యర్థుల్లో 55 మంది కోటీశ్వర్లు. రాజ్యసభ అభ్యర్థుల్లో కోటి రూపాయల పైబడి ఆస్తులు కలిగిన వారే అత్య ధికులనని ప్రజాతంత్ర సంస్కరణల సమాఖ్య (ఏడీఆర్) అంచనా. అత్యంత ధనికుడిగా జేడీయూ అభ్యర్థి మహేంద్ర ప్రసాద్. అతని ఆస్తులు రూ.4,078 కోట్లు. సమాజ్‌వాదీ పార్టీ తరఫున 4వ సారి బరిలో నిలిచిన బాలీవుడ్ నటి జయాబచ్చన్ రూ.1,001 కోట్లతో రెండోస్థానంలో నిలిచారు. జేడీ-ఎస్ అభ్యర్థి బీ.ఎం. ఫరూఖ్ ఆస్తులు రూ.766 కోట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వి ఆస్తులు రూ.649 కోట్లు, తెలుగుదేశం అభ్యర్థి సీఎం రమేష్ రూ.258 కోట్లు ఉన్నాయి. అతి తక్కువ ఆస్తులు కల్గిన వ్యక్తిగా బిజూ జనతాదల్ అభ్యర్థి అచ్యుతానంద సమనంత. అతని మొత్తం ఆస్తుల విలువ రూ.4 లక్షలు. మరో అభ్యర్థి భారతీయ జనతాపార్టీ తరఫున బరిలో ఉన్న సమిర్ ఓరాన్‌కు రూ.18 లక్షల విలువ మేర ఆస్తులు ఉన్నట్లు ఏడీఆర్ అంచనా. ఇక పార్టీల వారీగా అభ్యర్థుల ఆస్తుల వివరాలు పరిశీలిస్తే.. బీజేపీ తరఫున బరిలో నిలిచిన 29 మందిలో 26 మంది, కాంగ్రెస్ అభ్యర్థులు 11 మందిలో 10 మంది, తృణమూల్ కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన నలుగురులో ముగ్గురు, టీఆర్ఎస్ తర ఫున బరిలో నిలిచిన ముగ్గురూ, జూడీయూ, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులూ కోటి రూపాయలు పైబడి ఆస్తులు కల్గి ఉన్నారు. బీజేపీ అభ్యర్థుల (29) సరాసరి ఆస్తుల విలువ రూ.16 కోట్లు, కాంగ్రెస్ అభ్యర్థుల(11) ఆస్తుల విలువ రూ.66 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థుల (4) ఆస్తుల విలువ రూ. 1కోట్ల పైమాటే.8 మంది అభ్యర్థులపై తీవ్రమైన నేరారోపణలతో పాటు కేసు కూడా ఉన్నాయి. ఇందులో కిడ్నాప్, హత్యాయత్నం, దోపిడీ తదితర కేసులు ఉన్నట్లు అఫిడవిట్ల ద్వారా తెలుస్తోంది.

మయన్మార్ అధ్యక్షుడి రాజీనామా

నైపిడా: మయన్మార్ అధ్యక్షుడు హతిన్ క్యా త న పదవికి బుధవారంనాడు రాజీనామా చేశా రు. కేవలం తన ఆరోగ్య కారణాల వల్లే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. మయ న్మార్‌కు చెందిన ప్రముఖ నాయకురాలు, హక్కుల నేత ఆంగ్ సాన్ సూకీకి కుడి భుజంగా ఉండే హతిన్ తన పదవి నుంచి వైదొలగారు. ఈ విషయాన్ని అధ్యక్షుడి కార్యాలయం ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించింది. అయితే, నూతన అధ్యక్షుడిని వారం రోజుల్లో ఎన్నుకుంటామని అధ్యక్షుడి కార్యాలయానికి చెందిన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీకి చెందిన ఆయన రెండేళ్ల కంటే తక్కువ సమయం పదవిలో ఉన్నారు. మయన్మార్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు రాజీనామా చేస్తే ఉపాధ్యక్షుడు అధ్యక్ష బాధ్యతలు చేపడతారు.

వహ్ తాబ్..!

కాబూల్: పసికందుకు స్తన్యమిస్తూ, పరీక్ష రాస్తున్న ఆఫ్ఘనిస్తాన్ మహిళ ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆ చిత్రాన్ని చూసిన యావత్ ప్రపంచం మేటి మహిళ అంటూ ఆమెకు జేజేలు పలుకు తోంది. ఈ అద్భుత దృశ్యం ఆఫ్ఘనిస్తాన్‌లోని డేకుండి ప్రావిన్స్‌లోని కనిపించింది. ఇంతకీ ఆ ఫొటో వెనుక కథ ఏమిటంటే.. 25 ఏళ్ల జహన్ తాబ్ అనే యువతి నిల్లి సిటీలో నిర్వహిస్తున్న సోషల్ సైన్సెస్ పరీక్షకు హాజరైంది. తనవెంట రెండు నెలల పసికందును కూడా తీసుకెళ్లింది. పరీక్ష రాస్తున్న సమయంలో పసికందు ఏడవడం ప్రారంభించింది. ఇన్విజిలేటర్ అనుమతితో, వెంటనే పరీక్షటేబుల్ మీదనుంచి లేచివచ్చి, వేరొక విద్యార్థిని కుర్చీ వెనుక నేలపై కూర్చుంది. ఒకవైపు బిడ్డకు స్తన్యమిస్తూ, మరొకవైపు పరీక్ష రాయడం కొనసాగించింది. అరుదైన, అద్భుత దృశ్యాన్ని మహిళా ఇన్విజిలేటర్ ఇర్ఫాన్ తన ఫోన్ కెమేరాలో బంధించింది. తర్వాత ఈ ఫొటోలను



అంతర్జాలంలో పోస్ట్‌చేసింది. అంతే క్షణాల్లో వైరల్ అయింది. ప్రపంచం అంతా ఆమెకు జేజేలు పలికింది. తాబ్‌కు ముగ్గురు సంతానం. పరీక్ష రాసేందుకు ఆమె ఆరు గంటలు ప్రయాణించి నిల్లి నగరానికి చేరుకుంది. పేదకుటుంబానికి చెందిన రైతుతో ఈమెకు వివాహం అయింది. కుటుంబ బాధ్యతలు, కట్టుబాట్లను అధిగమించిన ఆమె పట్టుదలకు ప్రపంచం హ్యాట్సాఫ్ చెబుతోంది. బ్రిటీషు సంస్థ ఆర్థిక సహాయంతో ఆమె ఉన్నత విద్యను అభ్యసిస్తోంది.

Andhraprabha business 2018

బిజినెస్
BUSINESS

భావి భారత్‌లో లక్ష స్టార్టప్‌లు



జైపూర్: అన్ని స్టార్టప్‌లకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ టి.వి.మోహన్ దాస్ పాయ్ అన్నారు. కానీ మార్కెట్ లేకపోవడం, తదితర కారణాలతో వాటిలో 60 శాతం విఫలమవుతాయని అన్నారు. భారత్‌లో దాదాపు 30 వేల స్టార్టప్‌లు రమారమి 3.5 లక్షల నుంచి 4 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తున్నాయని తెలిపారు. ప్రతియేటా 5 వేల నుంచి 6 వేల స్టా ర్టప్‌లు పుట్టుకొస్తున్నా యని చెప్పారు. 2025 నాటికి భారత్‌లో ఒక లక్ష స్టార్టప్ లు ఉంటాయని, వాటిలో దాదాపు 32 లక్షల మంది పనిచేస్తుంటారని పాయ్ తెలిపారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అన్ని స్టార్టప్‌లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. కానీ వైఫల్యాల రేటు అధికం. స్టార్టప్‌లలో దాదాపు 60 శాతం విఫలమవుతాయని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న మోహన్ దాస్ పాయ్ తెలిపారు. తొలిసారి వ్యాపారంలో వచ్చేవారు ప్రారంభిస్తున్న కారణంగా సరై న మార్కెట్‌ను అవి పొందలేకపోతున్నాయని అన్నారు.

ఎన్నికల్లో వేలు పెడితే ఊరుకోం

• సోషల్ మీడియాకు వార్నింగ్ • కేంబ్రిడ్జి అనాలిటికాతో కాంగ్రెస్‌కు లింకులు • రాహుల్ ప్రొఫైల్‌లో సదరు ఏజెన్సీ పాత్ర • కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపణ



న్యూఢిల్లీ: అవాంఛనీయ విధానాల ద్వారా దేశ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమం వేదికలను కేంద్ర ఐటి, న్యాయ శాఖా మంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చ రించారు. పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో మీడియాతో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు పూర్తి మద్దతు ఇస్తుందని, సామాజిక మాధ్యమాలపై భావాలు ఇచ్చిపుచ్చుకోవడానికి అంగీకరి స్తుందని మంత్రి తెలిపారు. సామాజిక మాధ్యమ దిగ్గజం ఫేస్‌బుక్ యూజర్ గోప్యతకు తీవ్రమైన భంగం కలిగించిం దనే అభియోగంపై అమెరిగా గోప్యత నిఘా సంస్థ దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికాలో 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంబ్రిడ్జి అనాలిటికా అనే ఒక రాజకీయ సలహాదారు కంపెనీ డోనాల్డ్ ట్రంప్ కోసం జరిపిన ఓటరు సర్వేలో ఫేస్‌బుక్ నుంచి పొందిన డేటాను వినియోగించిందనే వార్తలు వచ్చాయి. దీంతో స్వీయ గోప్యత విధానాలకు కట్టుబడి ఉండే పలు కంపెనీలు ఫేస్‌బుక్ 2011 నాటి ఒకసమ్మతి తీర్మానాన్ని ఉల్లంఘించిందా అనే ఆరోపణలపై ప్రభుత్వ స్వతంత్ర ఏజెన్సీ అయిన అమెరికా సమాఖ్య వాణిజ్య కమిషన్(ఎఫ్‌టిసి) స్పందించింది. కేంబ్రిడ్జి అనాలిటికాతో కాంగ్రెస్ పార్టీకి సంబం ధాలు ఉన్నాయ ని కేంద్ర మంత్రి ప్రసాద్ ఆరోపించా రు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపొందడానికి డేటా తారు మారు, డేటా చోరీపై ఆధారపడుతుందా అని ఆ పార్టీని ప్రశ్ని స్తున్నాను అని అన్నారు. రాహుల్ గాంధీ సోషల్ మీడి యా ప్రొఫైల్‌లో కేంబ్రిడ్జి అనాలిటికా పాత్ర ఏమిటి అని ఆయ న ప్ర శ్నించారు. 2019 ఎన్నికల ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ తమ బ్రహ్మా స్త్రంగా పేర్కొంటూ రంగంలోకి దించిన కేం బ్రిడ్జి అనాలిటి కాపై కేంద్ర మంత్రి తప్పుపట్టారు. అది రాజకీ య నాయ కులకు వలవేయడానికి ముడుపులు, వ్యభిచా రిణు లను ఉప యోగిస్తుందని, ఫేస్‌బుక్ నుంచి డేటా చోరీ చేస్తుందని ఆరోణలు కేంబ్రిడ్జి అనాలిటికాపై ఉన్నాయని తెలిపారు.

ఐటీఐకి ఊపిరి

• ఎఫ్‌పీఓ ద్వారా ఈక్విటీ షేర్ల విక్రయం
• కేంద్ర మంత్రివర్గం ఆమోదం



న్యూఢిల్లీ: ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పిఒ) ద్వారా ఐటిఐ లిమిటెడ్‌కు చెందిన 18 కోట్ల ఈక్విటీ షేర్ల విక్రయానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. తద్వారా టెలికామ్ ప్రభుత్వ రంగ సంస్థ(పిఎస్‌యు) కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధన చేరుకోవడానికి మార్గం సుగమమైంది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ అన్ని లిస్టెడ్ కంపెనీలు కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ కలిగి ఉండాలనే నిబంధన విధించింది.

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సిసిఇఎ) బుధవారం సమావేశమైంది. దేశీయ మార్కెట్‌లో ఎఫ్‌పిఒ ద్వారా 18 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను సాధారణ ప్రజానీకానికి విక్రయించేలా ఐటిఐకి సిసిఇఎ ఆమోదం తెలిపిందని పేర్కొంటూ ఒక అధికారిక ప్రకటన జారీ అయ్యింది. ప్రస్తుతం ప్రభుత్వం ఐటిఐలో 92.59 శాతం వాటాను కలిగి ఉంది.

కంపెనీకి ఎంతో అవసరమైన వర్కింగ్ కేపిటల్‌ను ఎఫ్‌పిఒ సమకూరుస్తుంది. చేతిలో ఉన్న ఆర్డర్లను సకాలంలో ప్రారంభించడానికి, మార్జిన్లను మెరుగుపరుచుకోవడానికి ఉపకరి స్తుంది. అంతేకాక ఐటీఐ ఉద్యోగులకు భరోసా ఇస్తుంది. ఐటీఐ కొత్త టెలికామ్ సాంకేతికతలో రంగంలో ప్రవేశించడం ద్వారా మరిన్ని ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది అని ప్రకటన పేర్కొంది. కంపెనీ ఉద్యోగుల కోసం ఐటీఐ ఎఫ్‌పిఒలో 5 శాతాన్ని రిజర్వ్ చేసుకుంటుంది. ఉద్యోగులకు, రిటైల్ ఇన్వెస్టర్లకు 5 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తుంది. ఎఫ్‌పిఒ కోసం సలహాదారులను మర్చం ట్ బ్యాంకర్లను నియమించుకుంటుం ది.ఐటీఐ లిమిటెడ్ డిఫెన్స్ కమ్యూనికేషన్, నెట్‌వ ర్కింగ్ అవసరాలకు సరఫరాదారుగా ఉంది. భారతీయ సైన్యానికి ఎన్‌స్క్రిప్షన్ ఉత్పత్తులకు సంబంధించి ఒక ప్రధాన సరఫరాదారుగా నిలిచింది. కంపెనీకి ప్రధాన ఖాతాదారులుగా బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్, రక్షణ శాఖ, పారామిలటరీ బలగా లు, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నా యి. కంపెనీకి బెంగళూరు(కర్నాటక), రాయబరేలి, నయిని, మంకాపూర్(అన్ని ఉత్తరప్ర దేశ్‌లో ఉన్నాయి), పాలక్కాడ్(కేరళ), శ్రీనగర్ (జమ్మూ కాశ్మీర్)లో ఆరు మ్యానుఫేక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. 2017, డిసెంబర్ 31 నాటికి కంపెనీ ఇష్యూడ్ అండ్ సబ్‌స్క్రయిబ్‌డ్ ఈక్విటీ కేపిటల్ రూ.760 కోట్ల వద్ద నిలిచింది.

ఈశాన్య అభివృద్ధికి 3,000 కోట్లు

కేంద్ర కేబినెట్ రూ.3,000 కోట్లతో ఈశా న్య పారిశ్రామికాభివృద్ధి పథకాని కి(ఎన్‌ఇఐ డిఎస్) బుధవారం ఆమోదం తెలి పిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 2020 దాకా పైన పేర్కొన్న కేటాయింపు జరుపు తుంది. అదే సంవత్స రం మార్చికి ముందు మదింపు చేసిన అనంతరం మిగిలిన కాలాని కి అవసరమై న కేటాయింపులు జరుపుతుం ది. ఈశా న్య ప్రాంతంలో సూక్ష్మ, చిన్న, మధ్య తర హాపరిశ్రమలకు ఎన్ఇఐడిఎస్ ప్రోత్సాహ కాలు అందచేస్తుంది. పథకం ద్వారా ఉపా ధి కల్పనకు ప్రత్యేక ప్రోత్సాహకాలు సైతం సమకూరుస్తుంది. భారత ప్రభు త్వం అమలు చేస్తున్న ఇతర పథకాల నుంచి లబ్ది పొందుతున్న అర్హమైన పారిశ్రామిక యూ నిట్లు ఈ పథకం ప్రయోజనాలను పొందవ చ్చు అని ప్రకటన వెల్లడించింది



ఫైల్‌ఫోటో

పెద్దనోట్ల రద్దుకు గ్రామీణ భారతం వెల్‌కమ్



కోల్‌కతా: నోట్ల రద్దు పట్టణ మేధావులకు పెద్దగా పట్టకపోయినప్పటికీ గ్రామీణ భారతీ యు ల్లో అత్యధికులుదానిని స్వాగతిం చారని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్.నారా యణమూర్తి అన్నారు. బుధవారం ఇక్కడ ప్రెసిడెన్సీ యూనివ ర్శిటీ విద్యార్థులతో నోట్ల రద్దుపై ఆయన ఇష్టాగోష్ఠిజరిపారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జవాబులి చ్చారు. అర్థశాస్త్రం లో తాను నిపుణుడు కానని నారాయణమూర్తి తెలిపారు. అందుకే నోట్ల రద్దు వెనుక తర్కాన్ని అర్థం చేసుకోలేకపోయానని చెప్పారు. పాత 500 నోట్లను రద్దు చేసిన ప్రభుత్వం వెనువెంటనే అంతే విలువ కలిగిన కొత్త నోట్లతో పాటుగా రూ.2,000 నోట్లను ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. ఇదంతా ఎందుకు జరిగిందో ఒక నిపుణుడు మాత్రమే చెప్పగలరు. నాకైతే అర్థం కాలేదు. నిపుణులను అడిగి తెలుసుకోండి అని విద్యార్థులకు సూచించారు. చైనా, జపాన్ దేశాలు తక్కువ సాంకేతిక తయారీపై దృష్టిపెట్టి ముందుకు సాగుతున్నాయని, కానీ భారత్ 1950 నుంచి ఆ వంకైనా చూడలేదని నారాయణమూర్తి వ్యాఖ్యానించారు. దేశంలో పిల్లల్లో 75 శాతం మంది బడికి వెళుతున్నప్పటికీ ఎనిమిదవ తరగతికి వచ్చేసరికి వారు డ్రాపవుట్ అవుతున్నారని అన్నారు. అలాంటివారికి 22 సంవత్సరాలు వచ్చేసరికి ఉద్యోగం కావాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్హత లోపించిన వారు తక్కువ సాంకేతిక తయారీకే సరిపోతారని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు అభిప్రాయపడ్డారు. ఆర్థికవేత్తలు దీని గురించి 1950 నుం చే ఆలోచించి ఉండాల్సిందని తెలిపారు. యాంత్రికీకరణం, మానవుల మధ్య సమతూ కం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మనం ఒక నిర్ణయం తీసుకోగలం. మన తయారీ లేదా సేవలకు సంబంధించి నిర్దేశిత స్థాయి వరకు యాంత్రికీకరణను అనుసరించలేమని అన్నారు. మనం ఒక సమతూకం పాటించాలి. ఉత్పత్తులు, సేవల్లో మనం అంతర్జా తీయంగా పోటీ పడాలి. దేశీయ ప్రయోజనాల కోసం మనం యాంత్రికీకరణలో కాస్త నెమ్మదించి ఉండవచ్చు అని నారాయణమూర్తి వ్యాఖ్యానించారు.

రూ.200 కోట్లు డిపాజిట్ చేయండి


• జేపీఎల్‌కు సుప్రీం కోర్టు ఆదేశం • గృహ కొనుగోలుదారులకు ఊరట



న్యూఢిల్లీ: ఫ్లాట్లకు బదులుగా నగదు రిఫండ్ ఆశిస్తున్న గృహ కొనుగోలుదారుల కోసం కోర్టు రిజిస్ట్రీ వద్ద రెండు వాయిదాల్లో రూ.200 కోట్లు డిపాజిట్ చేయాలని రియాల్టీ కంపెనీ జైప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ ను(జెఎఎల్) సుప్రీం కోర్టు బుధవారం ఆదేశించింది. ఏప్రిల్ 15న రూ.100 కోట్లు, మే 10న మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేయాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎం.ఖన్‌విలకర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం జైప్రకాష్ అసోసియేట్స్‌ను ఆదేశించింది.నేడు కోర్టులో ఉన్న మేనేజింగ్ డైరెక్టర్ అంగీకరిం చిన దాని ప్రకారం జెఎఎల్ రూ.200 కోట్లను రెండు వాయిదాల్లో డిపాజిట్ చేయా లని పేర్కొంది. మునుపటి ఆదేశాల ప్రకారం రూ.2,000 కోట్లను ఇంకా డిపాజిట్ చేయలేదని కంపెనీని ఆక్షేపించింది. ఇప్పటిదాకా రిజిస్ట్రి వద్ద రూ.550 కోట్లు డిపాజిట్ చేసినట్టు జెఎఎల్ ధర్మాసనానికి తెలియపరిచింది. 30 వేల పైచిలుకు గృహ కొనుగోలుదారుల్లో కేవలం 8 శాతం మంది మాత్రమే రిఫండ్ కోరుతున్నా రని, మిగిలిన 92 శాతం మంది ఫ్లాట్లను అందించాలని ఆకాంక్షిం చారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించింది. ప్రస్తుతానికి రిఫండ్ కావాలంటున్న గృహ కొనుగోలుదారులను మాత్రమే పరిగణనలోకి తీసుకుం టున్నాము. తదుప రి విడతలో ఫ్లాట్లు కోరుకుంటున్న గృహ కొనుగోలు దారుల నుంచి ఫిర్యాదులు ఏమైనా ఉంటే పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. తన పోర్టల్ ప్రకారం ప్రస్తుతా నికి రూ.1,300 కోట్లు రిఫండ్ చేయాల్సి ఉందని కోర్టు కు అమి కస్ క్యూరీగా వ్యవ హరిస్తున్న లాయర్ పవన్ శ్రీ అగర్వాల్ ధర్మాసనానికి తెలియ పరిచారు. గృహ కొ నుగోలుదారుల వివరాలతో ఒక ప్రాజెక్టు వారీ చార్టు రూపొం దించాలని అగర్వా ల్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం చింది. తద్వారా దామా షా ప్రాతిపదికగా నగదు పంపిణీపై సరైన ఆదేశం జారీ చేస్తామని తెలిపింది. నేటి(బుధవారం) వరకు పోర్టల్‌లో నమోదు చేసుకున్న గృహ కొనుగోలుదారుల రిఫండ్ అభ్యర్థనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

స్వదేశీ రైలింజన్ వచ్చేస్తోందోచ్!

బీహార్‌లోని మాధెపురా వద్ద రైల్ లోకోమోటివ్ ప్లాంట్ వద్ద రూపుదిద్దుకుంటున్న మొట్టమొదటి స్వదేశీ 12,000 హార్స్‌పవర్ ఎలక్ట్రిక్ రైలు ఇంజిన్. జూన్‌లో పట్టాలెక్కించనున్నట్లు రైల్వే బోర్డు అధికార వర్గాలు వెల్లడించాయి.



ఇక్ఫాయ్ అధ్యాపకుడు దేబప్రతిమ్‌కు రీసెర్చ్ అవార్డు

• ప్రదానం చేసిన కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇక్ఫాయ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ దేబప్రతిమ్ పురకాయస్త దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఫ్యాకల్టీ రీసెర్చ్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఆయన చేసిన మేనేజ్‌మెంట్ డోమెన్‌కు సంబంధించి ఫ్యాకల్టీ రీసెర్చ్ అవార్డు సాధించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ చేతుల మీదుగా మంగళవారం ఢిల్లీలో అవార్డును అందుకు న్నారు. గత 10 సంవత్సరాలుగా ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. కేరీర్ 360 అనే సంస్థ ఈ అవార్డులను ప్రధానం చేస్తోంది.

నోట్ల రద్దు నివేదికకు గ్రహణం



న్యూఢిల్లీ: రాజకీయ తప్పిదాలు నోట్ల రద్దుపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీని రెం డుగా చీల్చాయి. కాంగ్రెస్ నేత ఎం. వీరప్ప మొయిలీ నేతృత్వంలోని కమిటీ రూపొందిం చిన ముసాయిదా నివేదిక రాజకీయ దురుద్దేశ్యంతో కూడుకున్నదిగా కమిటీలో సింహ భాగం ఆక్రమించిన బి జెపి, దాని మిత్ర పక్షాల సభ్యులు ఒక అసమ్మతి నోటులో పేర్కొన్నారు. ఆర్థిక అంశాల సభా సంఘంలో 16 మందికి పైగా ఉన్న పాలక కూటమి సభ్యులు ముసాయిదా నివేదిక తీరు, తెన్నులపై అభ్యంతరం వ్యక్తం చేశారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఛైర్మన్ మొ యిలీతో కలుపుకొని కమిటీలో మొత్తం 31 మంది సభ్యులున్నారు. ముసాయిదా నివేది కను ఆమోదించి, పార్లమెంట్ ప్రస్తుత బడ్జెట్ సమా వేశాల్లో సదరు నివేదికను ఉంచేనిమి త్తం ఈ నెల 19న కమిటీ సమావేశమైందని వారు తెలిపారు. 16 మంది పాలక కూటమి సభ్యులు అభ్యంతరం చెప్పారు. దీంతో ముసాయి దా నివేదిక కమిటీ ఆమోదం పొంద లేదు. పలువురు బిజెపి సభ్యులు సంతకాలు చేసిన అసమ్మతి నోటు నోట్ల రద్దును అన్ని సంస్కరణలకు అమ్మగా పేర్కొంది. అవినీతి నిర్మూ లన, నల్లధనం, తీవ్రవాదులకు నిధు ల ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తుందని పేర్కొంది.

ఎయిర్ కార్గోగా గన్నవరం విమానాశ్రయం

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర రాజధాని విజయవా డలోని గన్నవరం విమానాశ్రయా న్ని ఎయిర్ కార్గోగా ప్రకటించారు. ఈ విమానాశ్రయంలో విదేశాలకు వస్తువలు ఎగుమతి, విదేశీ వస్తు వుల దిగుమతి కి అనుమతిస్తూ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సైజు అండ్ కస్టమ్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ జారీతో గన్నవరం ఎయిర్‌కార్గో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుంది. ఇక్కడి ఎయిర్ కార్గో ద్వారా ఏ దేశానికైనా వస్తువలు పంపించొచ్చు, తెప్పించుకోవచ్చు. అయితే అవి రవాణా చేయాలంటే ఫ్లైట్ చార్జీలతో పాటు కస్టమ్స్ పన్నులు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెపుతున్నారు. ఇందుకు ప్రత్యేక కస్టమ్స్ విభాగాన్ని కూడా గన్నవరం విమానాశ్రయంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ నోటిఫికేషన్ వెలువడటంతో విజయవాడకు విమానాల రాకపోకల సంఖ్య పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎగుమతి, దిగుమతుల డిమాండ్‌ను బట్టి అంతర్జాతీయ సర్వీసులు నడుస్తాయి. ఇదిలా ఉండగా ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చాలా ఉత్పత్తులపై ఎక్స్‌పోర్టు కస్టమ్స్ డ్యూటీని మినహాయించింది. ఇప్పటి వరకు భారతదేశంలోని 19 రాష్ట్రాల్లో ఎయిర్ కార్గోల ద్వారా గూడ్స్ రవాణా అవుతుండగా, ఇప్పుడు కొత్తగా గన్నవరం ఎయిర్‌పోర్టు దేశంలోనే 33వ ఎయిర్ కార్గోగా నమోదైంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విశాఖపట్టణంలలో ఎయిర్ కార్గో సర్వీసులు నడుస్తున్నాయి.

టఫేకు లీడర్ షిప్ అవార్డు


హైదరాబాద్, ఆంధ్రప్రభ: ట్రాక్టర్స్ అండ్ ఫామ్ ఎక్విప్‌మెంట్స్ లిమిటెడ్ (టఫే) సంస్థ 2018 సంవత్సరానికి ఫ్రోస్టు అండ్ సులీవన్ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ లీడర్ షిప్ అవార్డుకు ఎంపికైంది. ప్రపంచ స్థాయి మ్యానుఫ్యాక్చరింగ్ సారధులు, కంపెనీలను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో జూన్‌లో జరిగే ఓ కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ సంస్థ గతంలో క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో, రిస్క్ మేనేజ్‌మెంట్ మోడల్‌లో, డిఫరెన్షియల్ ఎంగేజ్‌మెంట్ మోడల్‌లో లీడర్ షిప్ అవార్డులు గెలుచుకుందని టఫే కార్పొరేట్ హెడ్ సునీతా సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఈ ఏడాదికి తొలి ద్రవ్యవిధానం

• ఏప్రిల్ 4, 5 తేదీల్లో ఎంపీసీ భేటీ
• వడ్డీ రేట్ల తగ్గింపుపై పరిశ్రమ ఆశలు



ముంబై: భారతీయ రిజర్వు బ్యాంకు(ఆర్‌బిఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్, మరో ఐదుగురు నిపుణులతో కూడిన ద్రవ్య విధాన కమిటీ(ఎంపిసి) 2018-19 ఆర్థికసంవత్సరానికి తొలి ద్వైమాసిక ద్రవ్య విధానాన్ని వచ్చే నెల 4-5 తేదీల్లో నిర్ణయించ నుంది. చిల్లర ద్రవ్యోల్బణం రేటు(ఆర్‌పిటి) తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వడ్డీ రేట్లలో మార్పుపై ఎంపిసి ఒక తీర్మానం చేయనుంది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలనే పనిమీద ఉన్న ఆర్‌బిఐ ద్రవ్యోల్బణంపై ఆందోళనలను ఎత్తి చూపుతూ గడచిన మూడు ద్వైమాసిక పాలసీ సమీక్షల్లో కీలకమైన స్వల్ప కాలిక రుణ రేటు(రెపో)ను 6 శాతం వద్ద నిలుపదల చేయగలిగింది. 2018-19 సంవ త్సరానికి ఎంపిసి ఆరు సార్లు సమావేశమవుతుందని ఆర్‌బి ఐ తెలిపింది. అదే సంవత్స రానికి ద్వైమాసిక సమావే శాల క్యాలెండర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆర్‌బిఐ పై ప్రకటన చేసింది. తొలి సమావేశం ఏప్రిల్ 4, 5 తేదీల్లో, చివరి సమావేశం ఫిబ్రవరి 5,6 తేదీల్లో ఉంటుంది. ఏప్రిల్ 5వ తేదీ మ ధ్యాహ్నం పాలసీ ప్రకటన జారీ అవుతుంది. 1934 నాటి ఆర్‌బిఐ యాక్టు ప్రకారం ఎంపిసి ఏడాదిలో కనీసం నాలుగు సార్లు అయినా సమావేశం కావాలి. ఒక ఏడాదిలో ఎంపిసి సమావేశాల షెడ్యూల్‌ను ఆ ఏడాదిలో తొలి సమావేశానికి కనీసం వారం రోజుల ముందు ప్రచురించాలి. వినియోగ దారు ధర సూచీ(సిపిఐ) ప్రాతిపదికగా ఉన్న చిల్లర ద్రవ్యోల్బ ణం ఆధారంగా ఆర్‌బిఐ పాలసీ రేటును నిర్ధారిస్తుంది. ఆహార పదార్థాల చవక కావడం, చమురు తక్కువధరకు లభించ డంపై ఫిబ్రవరిలో అది నాలుగు మాసాల కనిష్టానికి 4.44 శా తానికి చేరుకుంది. జనవరిలో చిల్లర ద్రవ్యోల్బణం 5.07 శాతం వద్ద ఉంది. 2017 ఫిబ్రవరిలో సిపిఐ 3.65 శాతంగా నమోదైంది. ఉత్తర దిశగా కదులుతున్న పారిశ్రామిక ఉత్పాదక సూచీ(ఐఐపి)కి ఊతమిచ్చేలా ఆర్‌బిఐ వడ్డీ రేటును తగ్గించాలని పారిశ్రామిక రంగం ఆకాంక్షిస్తున్నది. చిల్లర, టోకు ద్రవ్యోల్బణం రెండూ అధోముఖంగా సాగు తున్న వేళ ఆర్‌బిఐ సాహసోపేతమైన చర్యలు చేపట్టాలని వాదిస్తున్నది. పటేల్ నేతృత్వం వహిస్తున్న ఎంపిసిలో ఆర్‌బి ఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మై ఖేల్ దేవవ్రత ఉంటారు. వారితో పాటుగా వెలు పల నుంచి మరో ముగ్గురు చేతన్ ఘటే. పమి దువా, రవీంద్ర ధోలికా యా సభ్యులుగా ఉన్నారు.



వాణిజ్యరంగంలోనూ నారీభేరి!

• ఉత్పాదన రంగంలో దక్షిణాది మహిళలే టాప్
• సీఐఐ ఐడబ్ల్యూఎస్ సదస్సులో సంతానం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహిళలు వివిధ ఉత్పాదనా రంగా ల్లో పనిచేస్తే 2025 నాటికి జాతీయ స్థూల ఉత్పత్తిని 700 బిలియన్ డాలర్లకు పెంచవచ్చునని సిఐఐ దక్షిణాది ప్రాంతీయ మాజీ ఛైర్మన్ డి.సంతానం అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఎక్కువ మంది మహి ళలు పని చేస్తున్నారని, ఇది ప్రాంతీయ అభివృద్ధి, రాష్ట్రాల స్థూల ఉత్పత్తి పెరుగుదలకు ఎంతగానో దోహద పడుతుందని ఆయన చెప్పారు. భారత పరిశ్రమ సమాఖ్య (సిఐఐ) ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యుఎన్) బుధవా రం నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాలు, తెలంగాణ లీడర్ షిప్ సదస్సులో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో సిఐఐ కర్నాటక కౌన్సిల్ మాజీ ఛైర్మన్లు కమల్‌బాలీ, సుధాకర్ పాయ్, ఉమెన్ నెట్‌వర్క్ జాతీయ ఛైర్మన్ సుచిత్ర ఎల్లా కూడా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా సంతానం మాట్లాడు తూ, లింగ వివక్ష ఉన్నప్పటి కీ దక్షిణాది రాష్ట్రాల్లో మహిళా శక్తి తమ ప్రతిభ కనబరుస్తున్నా రని అన్నారు. పాఠశాల దశ నుంచే బాలికలకు భవిష్యత్తుపై అవగాహన కల్పించాలని, విద్యాసంస్థలు, పారిశ్రామిక రంగాలు పిల్లల్లో సృజనాత్మకత పెంచేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. అనేక రంగాల్లో ఎంతో పురోగతి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు 2030 నాటికి సమ్మి ళిత ఆర్థిక అభివృద్ధి సాధిస్తాయని, కార్పొరేట్ రంగంలో 30 శాతం మంది మహిళలు ఉన్నత స్థానంలో ఉంటారని, ఉద్యోగాల్లో 50శాతం ఉంటారని సంతానం చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం పురోభివృద్ధి చెందుతున్న తరుణంలో లింగవివక్షకు అవకాశం ఇవ్వరాదని కమల్‌బాలీ చెప్పారు. మహిళలు తమ ముందున్న అడ్డుగోడలు తొలగించుకుని స్వేచ్ఛగా ముందుకు రావాలని, తమ ఆలోచనలలో ఉన్న భయాన్ని తొలగించి ఔత్సాహి కులగా ఎదగాలని ఆయన అభిప్రాయప డ్డారు. అనుభవాలే పాఠాలు నేర్పుతాయని, వైఫల్యాలే జీవితంలో విజయాలు సాధిం చేందుకు మార్గం చూపుతాయని ఆయన అన్నారు. మహిళా శక్తిని త క్కువ అంచనా వేయడానికి వీల్లేదని, అవకాశాలు ఇస్తే ఏదైనా సా ధిం చగలరని ఆయన అన్నారు. దేశంలో 49శాతం మంది మహిళలు ఉత్పాదన రంగంలో పనిచేస్తే భారత్ అగ్రదేశాల్లో ఒకటిగా నిలు స్తుం దని ఆయన ధీమా వ్యక్తంచేశారు. సమాజంలో సగంమంది ఉన్న మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని బాలీ సూచించారు.

యూనివర్శిటీ పోస్టులకు త్వరలో స్క్రీనింగ్ టెస్ట్

- విశ్వ విద్యాలయాల్లో టీచింగ్ పోస్టుల భర్తీ
- 14 యూనివర్శిటీల పరిధిలో 1,109 పోస్టుల భర్తీకి చర్యలు
- ఏప్రిల్ 9 నుంచి 13 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు
- రాష్ట్రంలో 11 పరీక్షా కేంద్రాలు
- అవకతవకల నిరోధానికే ఏపీపీఎస్సీకి భర్తీ బాధ్యత
- స్క్రీనింగ్ టెస్ట్ కోసం 76, 356 దరఖాస్తులు
- తప్పుడు ఆన్సర్‌కు నెగిటివ్ మార్కులు
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల్లో ఎంతోకాలంగా ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీకి రాష్ట్రప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. బుధవారం విజయవాడ బందర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్ సమావేశ మందిరంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ విషయం వివరించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి త్వరలోనే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించబోతున్నామని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన స్క్రీనింగ్ టెస్టుకు సంబంధించిన షెడ్యూల్ వివరాలను వివరించారు. 1980 తర్వాత ఏ విశ్వ విద్యాలయంలోను ఇంతవరకు టీచింగ్ పోస్టుల భర్తీ జరగలేదని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాల పరిధిలో 1109 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ ప్రక్రియకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. యూనివర్శిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఐదుగురు మాజీ వైస్ ఛాన్సలర్లతో ఒక హైపవర్ కమిటీని నియమించడం జరిగిందన్నారు. ఆ కమిటీ చైర్మన్‌గా ప్రొఫెసర్ సి.వి.రాఘవులు, సభ్యులుగా ప్రొఫెసర్ సీ.ఆర్.విశ్వేశ్వరరావు .ఆర్.మాధవి, ఎ.రామారావు,వి.వెంకయ్యలు వ్యవహరించారన్నారు. ఆగస్టు 10, 2015 నాటి ఉన్నత విద్యా సంస్థలు, నిర్వహణ సామర్థ్యం నియమావళి మేరకు రేషనలైజేషన్ విధానంలో పోస్టుల భర్తీకి కమిటీ సిఫార్సు చేయడం జరిగిందన్నారు. కమిటీ రాష్ట్రంలోని వివిధ యూనివర్శిటీలలోని 465 డిపార్టుమెంట్లు, 560 కోర్సులను పరిశీలించడం జరిగిందన్నారు. 3 క్యాటగిరీలలో మొత్తం 1,711 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కమిటీ పరిశీలనలో గుర్తించడం జరిగిందన్నారు. వీటిలో 1,385 పోస్టుల భర్తీకి సిఫార్సు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 2015 అక్టోబర్ 31న కమిటీ ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించిందని తెలిపారు. రాష్ట్రంలోని 14 యూనివర్శిటీల పరిధిలో 3,259 పోస్టులు మంజూరై ఉన్నాయని అన్నారు. వాటిలో 1554 పోస్టులు (48శాతం) భర్తీ కాబడి ఉన్నాయన్నారు. ఇంకా ఖాళీగా ఉన్న 1,117 పోస్టులలో ఫేజ్-1 ద్వారా 846, ఫేజ్ 2 ద్వారా 263 పోస్టుల కోసం ప్రస్తుతం స్క్రీనింగ్ టెస్ట్ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేపట్టడడం జరుగుతుందన్నారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్ ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించాలని వైస్ చాన్సలర్ల సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. గతంలో వివిధ యూనివర్శిటీలలో పోస్టుల భర్తీలలో జరిగిన అవకతవకలు కారణంగా భర్తీ ప్రక్రియను ఈసారి ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అప్పజెప్పడం జరిగిందన్నారు. అంతే తప్ప యూనివర్శిటీల అటానమస్‌లో జోక్యం చేసుకునే ఉద్దేశం కాదని, పోస్టుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టంచేశారు. ఈ విధానాన్ని ఆన్‌లైన్ ప్రక్రియద్వారా నిర్వహించాలని ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ ఆఫ్ యూనివర్శిటీస్ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు బోదనా పోస్టులను 2017 జూన్ 30 నాటికి భర్తీ చేయాల్సి ఉందని, యూనివర్శిటీల పరిధిలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ 2018 జనవరికి పూర్తి చేయాలని సిఫార్సు చేయడం జరిగిందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించి స్క్రీనింగ్ టెస్ట్ కోసం వివిధ యూనివర్శిటీలలో 76,356 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ (విశాఖపట్నం) పరిధిలో 19, 500 దరఖాస్తులు రాగా, తిరుపతి ఎస్వీయూ 14,278, అనంతపురం జెఎన్‌టీయు 11,193, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ(గుంటూరు) 6,626, శ్రీకృష్ణదేవరాయ (అనంతపురం) 6306, డాక్టర్ అంబేద్కర్ యూనివర్శిటీ (శ్రీకాకుళం) 2968, రాలయసీమ యూనివర్శిటీ పరిధిలో (కర్నూల్) 2690 దరఖాస్తుల వచ్చాయని చెప్పారు. అలాగే ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ (రాజమహేంద్రవరం) 2,586, కాకినాడ జెఎన్‌టీయు నుంచి 2560, నెల్లూరు విక్రమసింహపురి యూనివర్శిటీ పరిధిలో 2490, కడప యోగి వేమన యూనివర్శిటీ 2379, మచిలీపట్నం కృష్ణా యూనివర్శిటీ 1363, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీ 761, కుప్పం ద్రవిడ యూనివర్శిటీ పరిధిలో 656 దరఖాస్తులు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు కోసం వచ్చాయని మంత్రి చెప్పారు. స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షలు ఏపీపీఎస్సీ ద్వారా ఏప్రిల్ 9 నుంచి 13 వతేదీ వరకు 11 కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అనంతపురం , గుంటూరు,హైదరాబాద్, కడప, కర్నూల్, నెల్లూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ,విశాఖపట్నం కేంద్రాల్లో ఈ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. పేపర్ 1లో టీచింగ్ అండ్ రీసెర్చ్‌యాప్టిట్యూడ్ టెస్ట్‌ను ఏప్రిల్ 9న అందరికీ కామన్‌గా నిర్వహిస్తామన్నారు. పేపర్ 2ను ఏప్రిల్ 10 వ తేదీ నుంచి ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు 13వ తేదీ వరకు ఆయా సబ్జెక్టులలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను మార్చి 25 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంబంధించి ఒక్కొక్క పోస్టుకు 69 దరఖాస్తులు యావరేజ్‌గా వచ్చాయన్నారు. పేపర్1, పేపర్ 2లు 300 మార్కులుంటాయన్నారు. పేపర్ 1లో 120 ఆబ్జక్టివ్ ప్రశ్నలుంటాయని, ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుందని చెప్పారు. పేపర్ 2లో 180 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటాయని, ఒక్కో దానికి ఒక్కో మార్కు ఇవ్వడం జరుగుతుందన్నారు.పేపర్ 1 నిర్వహణకు రెండు గంటలు, పేపర్ 2కు 3 గంటల సమయం కేటాయించడం జరిగిందన్నారు. ఒకవేళ ప్రశ్నలు తప్పుగా రాస్తే నెగినిటీవ్ వార్కులు కూడా ఉంటాయన్నారు. ఒక్కో తప్పుడు సమాధానానికి 1 / 3 నెగెటివ్ మార్కులు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్వాలిఫైయింగ్ మార్కులు సాధించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ పరీక్షలో ఓసీ కేటగిరి వారికి 40శాతం , బీసీ కేటగిరి వారికి 35శాతం, ఎస్‌సి,ఎస్‌టీతో పాటు పీహెచ్ కేటగిరీ వారికి 30 శాతం అర్హత మార్కులు సాధించాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు.స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను ఓరల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. విద్యారంగంలో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విద్య కోసం అత్యధికంగా బడ్జెట్‌లో రూ. 25,003 కోట్ల రూపాయాలు కేటాయించిందన్నారు. అన్ని యూనివర్శిటీలను బలోపేతం చేసేందుకు పోస్టుల భర్తీ చేసి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలు నాక్‌అక్రిడిటేషన్ పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యూనివర్శిటీల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తూ పారదర్శకానికి పెద్ద పీట వేస్తున్నామని అన్నారు. యూనివర్శిటీల నిర్వహణకు కావాల్సిన కనీస స్థాయి ప్రమాణాల మేరకు పోస్టుల భర్తీ ద్వారా కోర్సుల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.విలేకరుల సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ విజయానంద్, సెక్రటరీ వరదరాజన్, వైస్ చైర్మన్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 (2016) సర్వీస్
నాన్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక
ఏప్రిల్ 2 నుంచి ఆన్‌లైన్ టెస్టులకు 203 మంది
: ఏపీపీఎస్సీ కార్యదర్శి సాయి

గ్రూప్ 2 నోటిఫికేషన్ నెంబర్ 18/ 2016కు సంబంధించి నాన్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులకు గతంలో నిర్వహించినరాత పరీక్షల్లో ప్రాధమికంగా ఎంపికైన వారి వివరాలను సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి సాయి బుధవారం తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి ఎంపికైన అభ్యర్థులకు కంప్యూటర్ ఆన్‌లైన్ టెస్టులుంటాయన్నారు. వివరాలను కార్యాలయంలోని నోటీస్ బోర్డులో కూడా ఉంచామన్నారు. 1:1 నిష్పత్తి లో కంప్యూటర్ ఆన్‌లైన్ టెస్ట్‌కోసం 203 మందిని ఎంపిక చేశామని తెలిపారు.

వెంటనే వర్శిటీలు!

(మొదటిపేజీ తరువాయి)



మాజీ మంత్రి వై.ఎస్. చౌదరి, పార్లమెంట్ సభ్యులు, ఏపీ బీజేపీ అధ్యక్షులు కంభంపాటి హరిబాబు కూడా పాల్గొన్నారు. గిరిజన విశ్వ విద్యాలయం మరియు కేంద్రీయ విశ్వ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన క్యాబినెట్ నోట్స్ తయారయ్యాయని, వాటిని పరిశీలన కోసం న్యాయ శాఖకు పంపామని, అక్కణ్నుంచి నోట్ రాగానే క్యాబినెట్‌కు నివేదిస్తామని జవదేకర్ తెలిపారు. న్యాయ శాఖ, లెజిస్లేటివ్ కార్యదర్శులతో కూడా చర్చించి త్వరితగతిన పని పూర్తి చేయాలని వెంకయ్య ఆయనను కోరారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన తాత్కాలిక వసతుల్లో ఈ సంస్థలు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభమయ్యేందుకు కూడా చర్యలు చేపట్టాలనీ సూచించారు. ఇప్పటికే నెల్లూరు సమీపంలోని చవటపాళెం గ్రామం పరిధిలో శంకుస్థాపన చేసిన ఎన్‌సీఈఆర్‌టీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం భూ కేటాయింపు చేసిన వెంటనే ఆ సంస్థ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని ఉపరాష్ట్రపతి జవదేకర్‌కు చెప్పారు. అలాగే మైసూర్‌లో ఉన్నటువంటి ఓరియంటల్ లాంగ్వేజెస్ కేంద్రానికి డైరెక్టర్ నియామకాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలనీ, దాని తెలుగు శాఖను తెలుగు రాష్ట్రాల్లో ఉపయుక్తంగా ఉన్న ఎక్కడైనా ఏర్పాటు చేయాలనీ ఆయన కోరారు. న్యూఢిల్లీలోని జవహర్ లాల్ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని వెంకయ్య సూచించారు. సంబంధిత అధికారులతో ఆయన గురువారం సమావేశమై చర్చించనున్నారు. ఉపరాష్ట్రపతి సూచనలు, సలహాలన్నిటికీ సానుకూలంగా స్పందించిన జవదేకర్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యాన్ని ఆదేశించారు.

ఆంధ్రా యూనివర్శిటీకి అరుదైన హోదా

- గ్రేడెడ్ అటానమీగా ఏయూ
- యూజీసీ ఉత్తర్వులు
- నైపుణ్య కోర్సులకు శ్రీకారం
- 3.60 మార్కులతో నెంబర్-1 స్థానంలో కొనసాగుతున్న వర్శిటీ




విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు దక్కించుకున్న ఆంధ్రాయూనివర్సిటీకి మరో అరుదైన గౌరవం దక్కింది. ఈ నేపథ్యంలోనే ఏయూకు గ్రెడెడ్ అటానమీ హోదా కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి కేంద్రమంత్రి ప్రకాష్ జవదేకర్ ఆయా వివరాలను బుధవారం ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 60 వర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో సెంట్రల్ వర్సిటీలు 2, స్టేట్ యూనివర్సిటీలు12, డీమ్డ్ యూనివర్సిటీలు 11తో కలిపి మొత్తం 60వర్సిటీలను యూజీసీ ఎంపిక చేసింది. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్రవిశ్వవిద్యాలయం 3.60 మార్కులతో నెంబర్-1 స్థానంలో నిలిచింది. ఆ తరువాత ఎస్వి యూనివర్సిటీ తిరుపతి 3.52 మార్కులతో కొనసాగుతుంది. ఏయూకు అటానమస్ ప్రకటించడంతో ఇక మీదట నూతన కోర్సులు, విభాగాలు, కేంద్రాలు వంటివి నేరుగా ప్రారంభించుకునే అవకాశం ఉంది. దీంతో పాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అనుమతి లేకుండా నిర్ణీత బౌగోళిక పరిధిలో విశ్వవిద్యాలయానికి అనుబంధంగా శాఖలు, అనుబంధ కేంద్రాలను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది. ఇదే సమయంలో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రారంభించుకునే అధికారం ఉంది. ఇంకా ఓపెన్ రీసెర్చ్ పార్కులు, ఇంక్యుబేషన్ కేంద్రాలు, సమాజంతో అనుసందానంగా విశ్వవిద్యాలయం చేపట్టే కార్యక్రమాలను సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్వహించుకోవచ్చు. యూజీసీ అనుమతులు లేకుండానే స్వతంత్రంగా ఇతర ప్రయివేటు వ్యవస్థలతో కలిసి ఆయా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. విదేశాలకు చెందిన అధ్యాపకులను యూజీసీ అనుమతి లేకుండా ఏయూలో బోధనకు నియమించుకోవచ్చు న్నారు. విదేశీ విద్యార్థుల ప్రతిభ ఆదారంగా ఏయూలో ప్రవేశం కల్పిస్తూ వారి నుంచి ఫీజును ఏయూ స్వతంత్రంగా నిర్ణయించి వసూలు చేసుకునే అవకాశం కల్పించారు. పలు కోర్సులను ఏపెన్, దూర విద్యావిధానంలో స్వయం ప్రతిపత్తిగా నిర్వహించుకోవచ్చు. యూజీసీ నియమావళిని పాటిస్తూ ప్రోత్సాహక విధానం అనుసరిస్తూ ప్రతిభావంతులైన అధ్యాపకులను ఏర్పాటు చేసుకోవచ్చు. ఏయూలో నుతన కోర్సులు పలువురు నిపుణులను ఏర్పాటు చేసుకొని నాణ్యమైన విద్యను ఏయూ ద్వారా అందించే అవకాశం ఇప్పుడు కలిగింది. ఇదిలా ఉండగా ఏయూకు స్వయం ప్రతిపత్తి ప్రకటించడం పట్ల వీసీ గొల్లపల్లి నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే నెంబర్-1 స్థాయిలో ఏయూ 3.60 మార్కులతో ముందువరుసలో కొనసాగడం వెనుక సమిష్టి కృషి ఉందన్నారు. భవిష్యత్తులో నాక్ ర్యాం కింగ్‌లో కూడా మరింత మెరుగైన స్థానం దక్కే విధంగా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే రక్షణ రంగంతో పాటు అనేక సంస్థలతో ఒప్పందాలు చేసుకొని పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని, ఇప్పుడు అటానమస్ ప్రకటించడంతో మరిన్ని కొత్త కోర్సులకు , వివిధ దేశాలకు చెందిన అధ్యాపకులను నియమించుకోవడానికి వెసులుబాటు కలుగుతుందన్నారు. అత్యంత పేరు ప్రతిష్టలు కలిగిన ఏయూకు అటానమస్ ప్రకటించడం పట్ల వర్సిటీకి చెందిన పలువురు బోధన, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రపంచంలో టాప్ సిటీగా అమరావతి

- పట్టణాల్లో మెరుగ్గా మౌలిక వసతులు
- జూన్ 2న 200 అన్న క్యాంటీన్ల ప్రారంభం
- ఏప్రిల్లో సచివాలయం, మేలో హైకోర్టు డిజైన్లు
- శాసనసభలో పట్టణాల అభివృద్ధి, మౌలికవసతులపై మంత్రి నారాయణ



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రపంచలోనే టాప్ సిటీగా అమరావతిని నిర్మించాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. బుధవారం శాసనసభలో పట్టణాల అభివృద్ధి, మౌలికవసతులపై మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణాల్లో మెరుగ్గా మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణాల్లోని ప్రతి కుటుంబానికి రోజుకు 135 లీటర్ల అందించడంతో పాటు డ్రైనేజీ, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, ఘనవ్యర్థాల నిర్వహణ, పార్కులు, ఎల్ఈడీ వీధిలైట్లు, పేదలకు ఇళ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. వీటికోసం అమృత్, స్మార్ట్ సిటీ, 14వ ఆర్థికసంఘం ద్వారా వచ్చే నిధులను మౌలికవసతుల కోసం ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రూ.1,02720కోట్ల పనులను మున్సిపల్ శాఖ చేపట్టిందన్నారు. వీధిలైట్లకు రూ.220కోట్లు, అమృత పథకం ద్వారా రూ.3720కోట్లు, స్మార్ట్‌సిటీ పథకం ద్వారా రూ.6420కోట్ల పనులు జరపుతున్నామన్నారు. కేంద్రం నాలుగు స్మార్ట్ సిటీలను ప్రకటించగా మిగితా పట్టణాలను రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీలుగా ఏర్పాటు చేస్తుందని, దీనికోసం రూ.594కోట్లతో ఆయా పట్టణాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. అదేవిధంగా విజయవాడ, గుంటూరు నగరాల్లో రూ.1394కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలనుంచి ఇళ్లకోసం 9 లక్షలమంది నమోదు చేసుకున్నారని, అందులో 6.5లక్షల మందికి ఇళ్లు మంజూరు చేశామని, రూ.38,265కోట్లతో 5లక్షల ఇళ్లని చేపట్టినట్లు తెలిపారు. లక్షకంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాలకు అమృత్ పథకం వర్తిస్తుందని, ఆలోపు జనాభా ఉన్న పట్టణాలను రాష్ట్రప్రభుత్వమే అభివృద్ధి చేస్తుందని, విశాఖలో ఏవోబీ కింద రూ.350కోట్లతో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. పట్టణాల విస్తరణలో భాగంగా రూ.10,740కోట్లతో రోడ్లు, మౌలికవసతులు కల్పిస్తున్నామన్నారు.

విజయవాడ, విశాఖ మెట్రోలకు కేంద్రం పాలసీని మార్చుతున్నట్లు పేర్కొందని, ఈరెండు మెట్రోలకు పీపీపీ మోడల్లో టెండర్లు పిలిచామని, మరో నాలుగైదు నెలల్లో టెండర్లు ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు. రాజధాని అమరావతిలో 320 ట్రంకు రోడ్లు నిర్మాణం జరుపుతున్నామని, మొత్తం 32రోడ్లకు ఉండగా 22రోడ్లకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. రోడ్లవెంటే డ్రైనేజీ, వర్షపు నీరు వెళ్లేవిధంగా ఏర్పాట్లు చేపడుతున్నామని, రాజధానికి భూములు ఇచ్చిన 29గ్రామాల ప్రజలకు ప్లాట్లు కేటాయించి, ఆప్రాంతాల్లో మౌలికవసతులు కల్పిస్తున్నామన్నారు. రూ.22, 169 కోట్లతో పనులు జరుగుతున్నాయని, 6లక్షల చదరపు అడుగుల్లో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీని ఆరు నెలలో పూర్తిచేశామని, ఏప్రిల్ నెలలో సచివాలయం, మేలో హైకోర్టు డిజైన్లు ఇస్తున్నారని చెప్పారు.

అన్న క్యాంటీన్‌ల ద్వారా కేవలం రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, జూన్ 2న రాష్ట్రంలో 200 అన్నా క్యాంటీన్‌లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ స్కూల్లలో 70వేలు బెంచ్‌లు ఇస్తున్నామని, వీటితో పాటు కంప్యూటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 7వేల అంగన్ వాడీలు ఉండగా 3500 అంగన్ వాడీలకు సొంత భవనాలు నిర్మించామని, మిగితావాటికి భవనాలు ఏర్పాటు చేస్తామన్నారు. త్రాగునీరు 40 నిమిషాలకంటే ఎక్కువ ఇస్తామని, 5లక్షల ఇళ్లనిర్మాణానికి మున్సిపాలిటీల్లో స్థలం కొరత ఉందని, అవసరమైతే భూమి కొనుగోలుచేస్తామని, ఇప్పటికి కొన్ని చోట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. విశాఖలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధిలైట్లు, కొండవాగు ప్రాంతంలో బౌండరీ వాల్స్‌ని ఏర్పాటు చేస్తామని సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

వేస్టు మేనేజ్‌మెంటే వెల్త్ మేనేజ్‌మెంట్

పట్టణాల అభివృద్ధికి 7మిషన్లు : ఎమ్మెల్యే ఆలపాటి



వేస్ట్ మేనేజ్‌మెంట్‌నే వెల్త్ మేనేజ్‌మెంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం తయారుచేస్తుందని టీడీపీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణాల అభివృద్ధికొరకు ప్రభుత్వం 7మిషన్లు ఏర్పాటు చేసిందని, మౌలికవసతులు, తక్కువ విద్యుత్ కోసం ఎల్ఈడీ బల్బులు, పరిశ్రమలు అభివృద్ధి జరగటానికి విమానాశ్రయాలు, పర్యాటకం కూడా అభివృద్ధి చెందాలన్నారు. కోస్టల్ కారిడార్ వలన పట్టణాల అభివృద్ధి జరుగుతుందని, పాఠశాలల్లో మౌలికవసతులు కల్పించాలన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా మున్సిపల్ సేవలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయని, దళారులు, ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లకుండా ఇంటినుండే సేవలు పొందవచ్చన్నారు. చరిత్రలో నిలిచిపోయేవిధంగా అమరావతిని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుందని, దానికి అన్ని వేల ఎకరాలు ఎందుకని కొంతమంది అర్థంలేని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

పట్టణప్రాంతాల్లో మౌలికవసతులు మెరుగుపడ్డాయి

ప్రతిపక్షనేతగా గుర్తించినందుకు ధన్యవాదాలు: బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు



ప్రతిపక్షనేతగా తనను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బీజేపీ శాసనసభాపక్షనేత విష్ణుకుమార్ రాజు అన్నారు. బుధవారం శాసనసభలో పట్టణాల అభివృద్ధి, మౌలికవసతులపై మాట్లాడుతూ గతంలో కంటే ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో మౌలికవసతులు మెరుగుపడ్డాయని తెలిపారు. హుద్‌హుద్ తుఫాన్ తర్వాత ఎవ్వరూ ఊహించని విధంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. తమ నియోజకవర్గంలో 30నిమిషాలు మాత్రమే వాటర్ ఇస్తున్నారని, గంట ఇవ్వమని అడిగితే 45నిమిషాలు ఇస్తున్నారన్నారు. విశాఖ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయాయని, 300 అడుగులు బోర్లు వేసినా నీళ్లు లేవని, వారిని ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విశాఖలో సరైన డ్రైనేజీ పైపులు వేయకపోవటంతో డ్రైనేజీ ఓవర్ ఫ్లో అయిపోయిందని, దీంతో చుట్టపక్కన ఉన్న బోర్లు కూడా పాడైపోయాయన్నారు.

విశాఖలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తిగా విఫలమైందని, అదేవిధంగా వీధిలైట్లకోసం పోల్స్ వేసి 11నెలలు గడిచినా లైట్లు వేయలేదన్నారు. 30సంవత్సరాలు బడ్డీకొట్టుపెట్టు కొని జీవిస్తున్నప్పటికీ స్మార్ట్ సిటీపేరుతో తొలగిస్తున్నారని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్నారని చెప్పారు. పార్కింగ్‌స్థలానికి విశాఖలో తీవ్ర ఇబ్బంది ఉందని, కొండవాగు ప్రాంతంలో వాల్స్ కట్టాలని, అదేవిధంగా కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యానికి గురౌవున్నారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో రైతుబజార్లు కూడా లేవని, తమ నియోజకవర్గంలో అసిస్టెంట్ ఇంజనీర్లు, సర్వేయర్లు లేరని, దీంతో పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అదేవిధంగా విశాఖలో పలు గ్రామాలు విలీనం చేశారని, ఆయాప్రాంతాల్లో సరైన మౌలికవసతులు కల్పించాలన్నారు.

ప్రజల ముంగిట పోరాటం!

- అసెంబ్లీ సమావేశాల అనంతరం శ్రీకారం
- క్షేత్రస్థాయిలో సభలు, జనంతో మమేకం
- కేంద్రం వివక్షను ఎండగట్టే వ్యూహం

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని సీరియస్‌గా పరిగణిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇక క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే జిల్లాల పర్యటనకు బయలుదేరే దిశగా రంగం సిద్ధమవుతోంది. ఎన్డీయేతో తెగతెంపులు చేసుకున్న అనంతరం వివిధ స్థాయిలలో ఉద్యమపథంలో పయనిస్తున్న ముఖ్యమంత్రి తాజాగా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి సంబంధించి నేరుగా ప్రజలకే వివరించాలని నిర్ణయించారు. ఏ.పి కి ప్రత్యేక హోదాతో పాటు మొత్తం 19 అంశాలపై ప్రజాక్షేత్రంలో తాడోపేడో తేల్చుకునేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయం మరోసారి వేడెక్కనుంది. రాష్ట్ర విభజన జరిగిన సందర్భంలో కేంద్రంలోని యుపీఏ ప్రభుత్వం అనుసరించిన తరహాలోనే తాజాగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలుగు దేశం పార్టీ లక్ష్యంగా ఏ.పి పై కక్ష గట్టిందనే అభి ప్రాయంతో వున్న చంద్రబాబునాయుడు బహుముఖ పోరు సల్పే దిశగా మానసికంగా సంసిద్ధమయ్యారు. విభజనను వ్యతిరేకిస్తున్న వారిని లక్ష్యపెట్టకుండానే ఏకపక్ష ధోరణిని అవలంభించిన కాంగ్రెస్‌ను 2014లో జరిగిన సాధారణ ఎన్ని కలలో ఘోర పరాజయంపాల్జేశారని, తాజాగా 2019లోనూ బిజెపి విషయంలో పునరావృతం కాబోతున్నదనేది ముఖ్య మంత్రి మనోగతంగా భావిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి ఎత్తుగడలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొనగా, మరోవైపు నేరుగా కేంద్రంతీరుపై ప్రజలకే చెప్పా లని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఒకవైపు కార్యా చరణ సిద్ధమవుతుండగా, మరోవైపు కేడర్‌ను సమాయాత్తం చేసే కార్యక్రమాలకు కూడా పదును పెడుతున్నారు.

అన్ని జిల్లాల్లోనూ పర్యటన

కాగా ప్రతి జిల్లాలోనూ రెండు నుంచి అయిదు సభలు నిర్వహించే విధంగా కసరత్తు జరుగుతోందని పార్టీ వర్గాల కథనం. ఈ క్రమంలోనే ఎన్నికల ముందు మరో సవాల్‌ను ఎదుర్కొనేందుకు చంద్రబాబునాయుడు సిద్ధమయ్యారు. ఆటుపోట్లు తెలుగుదేశం పార్టీకి కొత్త కాదని పలు వేదికలలోనూ చెబుతున్న ముఖ్యమంత్రి కేంద్రాన్ని ఢీకొనే క్రమంలో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించే పనికి కూడా శ్రీకారం చుట్టా రు. పార్టీ నాయకత్వం ప్రత్యేక హోదా పై సంధిస్తున్న ప్రశ్నలకు భారీ ఎత్తున స్పందన లభిస్తుండటంతో మరింత ముందుకు వెళ్ళాలని నిర్ణయించడం జరిగింది. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీకి మూడు రోజులు వరుసగా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఆయా నియోజకవర్గాలలో పర్యటించాల్సిందిగా పార్టీ నాయ కత్వం ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇంచార్జిలను ఆదేశించా రు. ప్రజల నుంచి ప్రాథమికంగా లభించిన సమాచారాన్ని ముఖ్యమంత్రికి రాష్ట్ర నాయకత్వం నివేదించింది. 175 నియోజకవర్గాలపై నిరంతర పర్యవేక్షణను నిర్వహిస్తున్న రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, మంత్రి కిమిడి కళా వెంకటరావు సైతం కేంద్రం చేస్తున్న అన్యాయంపై కేడర్‌తో పాటు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న నిరసనపై అధినేతకు నివేదించారు.

జనం టీడీపీ వెంటే ..బాబు ధీమా

కాగా రాష్ట్ర విభజన చట్టం అమలు, హామీలపై కేంద్రం పోరాటానికి సిద్ధమైన టీడీపీ అధినేత రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తెలుగుదేశం వైపే వున్నారనే అంచనాలో వున్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దాదాపు 70 శాతం మంది సంతృప్తి చెందుతున్నారని ముఖ్యమంత్రి వివిధ సర్వేల ద్వారా అంచనాకు వచ్చారు. పైగా ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అనంతరం మైనారిటీలు, క్రిస్టియన్లతో పాటు సాంప్రదాయ ఓటర్లను కూడా ఆకర్షించినట్టయిందనే యోచన కూడా లేకపోలేదు. ఇప్పటికే జిల్లాల పర్యటనలలో భాగంగా 19 అంశాలపై ప్రణాళికా రచన జరుగుతుండగా, రాష్ట్ర వ్యాప్తంగా బిజెపిని టార్గెట్‌గా ఎంచుకుని పర్యటనలకు శ్రీకారం చుట్టనున్నారు. కాగా ఏయే జిల్లాలలో ఎక్కడెక్కడ సభలు నిర్వహించాలనే దిశగా ఇప్పటికే కసరత్తు జరుగుతున్నదని, త్వరలోనే ముఖ్యమంత్రి పర్యటనలకు సంబంధించి స్పష్టత వస్తుందని తెలిసింది. రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం సాధించిన విజయాలు, ఎన్డీయే వైఫల్యాలపై నివేదికలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించిన ముఖ్యమంత్రి మరోసారి రాష్ట్రంలో రాజకీయ వాతావరణాన్ని రక్తి కట్టించేందుకు సిద్ధం కావడం విశేషం. కేంద్రం తీరును కేవలం పార్టీ నేతలు, కేడర్ వద్దనే కాకుండా అధికార, అనధికార వర్గాల వద్ద సైతం వ్యక్తం చేయాలని చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఇదే రకమైన ప్రచారానికి గత రెండు వారాలుగా శ్రీకారం సైం చుట్టారు. తన పర్యటనలలో భాగంగా ముఖ్యమంత్రి బిజెపితో పాటు వైఎస్సార్‌సిపి, జనసేన వంటి పార్టీలు అనుసరి స్తున్న వైఖరిని ఎండగట్టనున్నారు.

డీఈవోకు హైకోర్టు వారెంట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పశ్చిమ గోదావరి జిల్లా విద్యాధికారి (డీఈవో) ఆర్.ఎస్.గంగాభవానీకి కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టుకు ఏప్రిల్ 4న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డి బుధవారం ఈ మేరకు ఆదేశాలు వెలువరించారు. తదుపరి విచారణ ఏప్రిల్ 4కి వాయిదా వేశారు. పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడులోని ఎస్.టి.వీఎన్ హిందూ హైస్కూల్ (ఎయిడెడ్) లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం అనుమతించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది సీహెచ్ .శ్యాంసన్ బాబు వాదనలు వినిపిస్తూ..గతంలో హైకోర్టును ఆశ్రయించిన 78 ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కోర్టు అనుమతించిందని, తమ పాఠశాలలో కూడా ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతించాలని కోరినట్లు తెలిపారు.

పత్తి కొనుగోళ్లలో కుంభకోణంపై సీబీఐ కేసులు

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : వ్యాపారులు దళారులతో కుమ్మక్కై పత్తి రైతులకు అందాల్సిన మద్దతు ధరను ఇవ్వకుండా కోట్లాది రూపాయలు కాజేసిన ఆదిలాబాద్‌లోని కాటన్ కార్పొరేషన్ అధికారులపై సీబీఐ ఎట్టకేలకు కేసులు నమోదు చేసింది. నాలుగేళ్ల క్రితం జిల్లాలో పత్తి కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగాయి. వ్యాపారులు, దళారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై రైతులను నిలువెల్లా దోచుకున్నారు. రైతులకు దక్కాల్సిన మద్దతు ధర దక్కకుండా చేసి వ్యాపారులకు సీసీఐ అధికారులు ప్రయోజనం చేకూర్చారు. రైతుల నుంచి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేసి తప్పుడు పత్రాలతో సీసీఐకి విక్రయించారు. దీంతో కోట్లాది రూపాయలు రైతులు నష్టపోయారు. వ్యాపారుల నుంచి సీసీఐ కొనుగోళ్లు చేసి రైతుల నుంచి కొనుగోళ్లు చేసినట్లు రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలున్నాయి.

అప్పట్లో ఈ సంఘటన తీవ్ర దుమారం రేపింది. అయితే పత్తి కొనుగోళ్ల కుంభకోణంపై దర్యాప్తు జరిపిన సీబీఐ ప్రాథమిక ఆధారాలు సేకరించింది. సీసీఐ అధికారులపై కేసులు నమోదు చేసింది. సీసీఐ అధికారులు మహేష్ , రమేశ్ రావ్, రూపేశ్ సింగ్, కెవి కృష్ణా రెడ్డి, సికె భట్టి, ఆర్ భగవాన్, సునిత్, సుభాష్ రావ్‌దేశ్ ముఖ్ , వ్యాపారులు మదద్ అలీ, షేక్ జమీర్, పుష్కర్ రామేశ్వర్, జి రంగారావు, కె. రాకేష్, కె. రూపేష్, కె. శ్రీదేవి, కె సుజిత, , స్వప్న , హరిచంద్ , మొబిన్ విరాని, రిజ్వాన్, మల్లికార్జున్, ప్రేంచంద్ , జగన్‌లపై కేసులు నమోదు చేశారు. 2014లో జరిగిన ఈ కుంభకోణం జైనూర్, నార్నూర్ , చెన్నూర్, పాచ్చర లోని సిసిఐ కేంద్రాల్లో చోటు చేసుకున్నట్లు సిబిఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

అప్పన్న ఆలయంలో 1,628కేజీల వెండి

• తొలిదశలో 628 కేజీల వెండిని విక్రయించి బంగారంగా మార్పు • ఎమ్ఎమ్‌టీసీతో దేవస్థానం ఒప్పందం



సింహాచలం(విశాఖపట్నం), ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్ర దేవాదాయశాఖ తాజాగా కీలకనిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అనేక దేవాలయాల్లో పెద్ద ఎత్తున వెండి నిల్వలు ఉన్నాయి. భక్తులు సమర్పించిన వీటిని ఇప్పటికే కొన్ని దేవాలయాలు కరిగించి వెండి ముద్దలుగా ఉంచారు. అయితే ఇప్పుడు వీటిని విక్రయించి తద్వారా వచ్చే సొమ్ముతో బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. తాజాగా సింహాచలం దేవస్థానంలో బుధవారం 628 కేజీల వెండిని తొలి విడతగా ఎంఎంటీసీ కంపెనీకి అప్పగించి వారి ద్వారా ఆన్‌లైన్ వేలంలో విక్రయించనున్నారు. తద్వారా వచ్చే సొమ్ముతో బంగారం కొనుగోలు చేసి ఎంఎంటీసీ అప్పన్న దేవస్థానానికి అప్పగించనుంది. ఆ బంగారాన్ని సింహాద్రినాథుడు, అమ్మవార్లకు అవసరమైన నగలు తయారు చేయించనున్నారు. అలా కాని పక్షంలో ఆ బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసి వడ్డీని కూడా పొందవచ్చు. ఇందుకు సంబంధించిన బుధవారం ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్, ఎంఎంటీసీ చీఫ్ జనరల్ మేనేజర్ తిప్పయ్య స్వామి ఒప్పందం చేసుకోవడం జరిగింది. రెండో విడత మరో వెయ్యి కేజీలు (కరిగించని వెండి) కూడా ఎంఎంటీసీకి అప్పగించి తదుపరి ఆ సొమ్ముతో బంగారం కొనుగోలు చేయనున్నారు. ఇతర దేవాలయాల్లో కూడా ఈ తరహా విధానాలను అమలులోకి తేనున్నారు.

మోడీ గురించి జగన్ మాట్లాడితే అత్తారింటికే

• టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య



అమరావతి, ఆంధ్ర ప్రభ: మోడీ గురించి ప్రతిపక్షనేత జగన్ ఎందుకు మాట్లాడటంలేదని, అదిరంగా మాట్లాడితే అత్తారింటికి పంపిస్తారని జగన్‌కు భయమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. బుధవారం విజయవాడ టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో జరుగుతున్న వింత పోకడలను ప్రజలు గమనిస్తున్నారని ఆర్టికల్ 75 ప్రకారం ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉందని, 54మంది లోక్ సభ సభ్యుల మద్దతు ఉంటే అవిశ్వాసంపై చర్చ జరగాలన్నారు. రాజ్యాంగాన్ని దిక్కరించి నేడు పార్లమెంట్ తీరు ఉందని, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌లు భారత రాజ్యాంగాన్ని దిక్కరిస్తున్నారని పేర్కొన్నారు. సభజరుగుతూ చూసి వుండియే స్పీకర్‌కు, ప్రధాని మోడీ చెబితే సభ్యులు కూర్చొని, టీఆర్ఎస్, అన్నాడీఎంకే సభ్యులను స్పీకర్ కంట్రోల్ చేయలేరా అని ప్రశ్నించారు అవిశ్వాసంపై చర్చ జరగాలని దేశప్రజలు కోరుతున్నారు, ఇదిఏపీకి సంబంధించిన విషయం మాత్రమేకాదని, దేశానికి సంబంధించిందన్నారు. ఏపీకి న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి మోడీకి లేదని, ఎన్డీయే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్‌మోడీని ఎందుకు ప్రశ్నించడం లేదని, మోడీతో అవినాభావ బంధం ఉందన్న పవన్ అవిశ్వాసం జరపాలని ఎందుకు అడగరని నిలదీశారు. పవన్ అవిరుపక్షత కలిగిన రాజకీయనాయకుడని, ఎవరో అనుకుంటున్నారంటే, శేఖర్‌రెడ్డికి సంబంధం ఉందనటం సిగ్గుచేటన్నారు. హోదా వద్దు ప్యాకేజీ కావాలి, కాదు హోదా కావాలంటూ పవన్ కళ్యాణ్ డ్యూయల్ రోల్ నటిస్తున్నారని పేర్కొన్నారు.

సీఎం జైలుకెళ్లడం ఖాయం

• వైకాపా అధికార ప్రతినిధి జోగి రమేష్

అమరావతి, ఆంధ్రప్రభ: చంద్రబాబు అవినీతి బండారం బయటపడటం ఖాయమని, ఆయనతోపాటు దోపిడీకి పాల్పడిన ఆయన కుమారుడు లోకేష్, మంత్రులు దోచుకున్న అవినీతి సొమ్మును కక్కించి జైలుకు పంపుతామని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి జోగి రమేష్ చెప్పారు. బుధవారం ఆయన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవినీతి వ్యాపారాలను నమ్మిన ప్రజలు చంద్రబాబు అధికారం వస్తే పోలవరం నిర్మాణంలో నూ, పట్టిసీమ ప్రాజెక్టులోనూ, రాజధాని భూముల విషయంలోనూ చంద్రబాబు, ఆయన మంత్రులు విచ్చలవిడి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వీటి సమాచారం కేంద్రం వద్ద ఉండటంతో దాడులు చేస్తారనే భయంతో తనకు అనుకూలమైన మీడియాలోనూ చానెల్స్‌లోనూ చంద్రబాబుకు సానుభూతి వచ్చే విధంగా కథనాలు వండివడ్డిస్తున్నారని చెప్పారు. ఎన్ని కథనాలు వచ్చినా ఆయన జైలుకెళ్లడం ఖాయమని చెప్పారు. ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రప్రయోజనాల ను తాకట్టు పెట్టిన చంద్రబాబు గత నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్న వైయస్ జగన్‌ను కోవర్టు అంటున్నారని, అసలైన కోవర్టు చంద్రబాబు అని ఆయన తెలిపారు.

ఆపన్నహస్తం కోసం ఎదురు చూపు

లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త కత్తి శ్రీను



కడప, ప్రభ న్యూస్ : తెలుగుదేశం పార్టీలో 30ఏళ్లుగా క్రియాశీలకంగా వుంటూ పార్టీ అనధికారంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కడప నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కాక రాష్ట్రపార్టీ నాయకులకు సుపరిచితుడు కత్తిశ్రీను. గత కొంత కాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా వుంటున్నాడు. కొన్ని రోజుల క్రితం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో వున్న కత్తిశ్రీనును పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయంఅందించారు. అయితే తిరుపతి, హైదరాబాద్‌లలో వైద్యం చేయించుకోగా లివర్‌క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. బెంగుళూరులో వైద్యం చేయించుకోవాలని వైద్యులు సూచించారు. వైద్యంకు రూ.17లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారన్నారు. పేదరికం కారణంగా వైద్యం చేయించుకునే స్థోమత లేక ఇంటికే పరిమితమైన కత్తిశ్రీను ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కయిన కత్తిశ్రీను అనారోగ్యానికి గురికావడంతో కత్తిశ్రీను భార్య శంకరమ్మ తన భర్త 30ఏళ్లుగా టీడీపీలో కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆ పార్టీ నాయకులు తన భర్త చేసిన సేవలను గుర్తించి ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటోంది.

ప్రత్యేక హోదా ఉద్యమం తీవ్రం

నేడు జాతీయ రహదారుల దిగ్బంధం

• విద్యార్థులకు ఇబ్బందులు కలగనివ్వం • హైవేల దిగ్బంధంకు ప్రభుత్వం సహకరించాలి • సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు



తిరుపతిలో ఆమరణ దీక్షకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

అమరావతి,ఆంధ్రప్రభ: ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు జరుగుతున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉదయం 10 నుండి 12 గంటల వరకు మాత్రమే జాతీయరహదారుల దిగ్బంధనం చేపడుతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమానికి సహకరించి ఆంధ్రులంతా ఒకటే వాయిస్ అనేలా కేంద్రానికి సంకేతానివ్వాలన్నారు. అలాకాకుండా ప్రభుత్వం ఏమాత్రం అత్యుత్సాహం ప్రదర్శించికార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించినా ప్రజల ఛీత్కారానికి గురికావల్సి పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. విజయవాడ లోని సీపీఐ పార్టీ కార్యాలయం దాసరిభవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మనదంతా ఒకటే వాయిస్ కావాలి. ఆ విషయం కేంద్రానికి తెలిసేలా వారి కూసాలు కదిలేలా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక హోదా, విభజననాంశాల అమలు కోసం జరిగే జాతీయ రాహదారుల దిగ్బంధనాన్ని పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఉప్పెనలా తరలిరావాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రత్యేకహోదా, విభ జనాంశాల అమలు కోసం జరిగే ఉద్యమానికి దూరంగా వుంటున్న బీజేపీ శ్రేణుల ను వెలివేయాలని రాష్ట్ర ప్రజలకు రామ కృష్ణపిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.సత్య నారాయణమూర్తి పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధన సమితికి టీడీపీ మద్దతు: కిమిడి కళా వెంకట్రావు

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం జాతీయ రహదారులపై నిరసనలు చేపట్టనున్న ప్రత్యేక హోదా సాధన సమితికి టీడీపీ మద్దతు తెలుపుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్రవిద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు బుధవారం తెలియజేశారు. హోదా, విభజన హామీల అమలుకు కేంద్రపై ఒత్తిడి తెచ్చేందుకు పార్లమెంటులో టీడీపీ అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెడితే, అది చర్చలకు రాకుండా బీజేపీ పాలకులు కుట్రలు చేస్తుండటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ గత కొద్ది రోజులుగా ఇటు రాష్ట్రంలోనూ, అటు ఢిల్లీలోనూ టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుత నిరసనలు తెలుపుతున్నారని గుర్తు చేశారు. ఆంధ్రుల హక్కు అయిన హోదాను, నవ్యాంధ్ర అభివృద్ధి కోసం పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాలను అమలు చేసేంతవరకు పోరాటం ఆపేదిలేదని, ఈ నేపథ్యంలోనే ప్రత్యేక హోదా సాధన సమితి జాతీయ రహదారులపై చేపడుతున్న నిరసనల్లో వారికి సంఘీభావంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు కూడా పాల్గొంటున్నారని తెలిపారు.

రహదారుల దిగ్బంధం విజయవంతం చేయాలి : రఘువీరారెడ్డి పిలుపు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం గురువారం జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ శ్రేణులు, విద్యార్థి యువజన నాయకులు, మేధావులు, న్యాయవాదులు, కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్నందున ఈ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏపిసీసీ రాష్ట్రకార్యాలయం నుంచిఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలో జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య నిర్వహించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల సాధన సమితి చేపట్టే జాతీయ రహదారుల దిగ్బంధనానికి ఆంధ్రప్రదేశ్ కమిటీ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారుల దిగ్భంధన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు.

ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉన్నాం : జనసేన నేత రియాజ్

ప్రత్యేక హోదా విషయంలో జనసేన పార్టీ కట్టుబడి ఉంద ని, తమ వైఖరిలో మార్పు లేదని ఆ పార్టీ నాయకుడు షేక్ రియాజ్ అన్నారు. ప్రత్యేక హోదా కోసం రాష్ట్రానికి చెందిన 25 మంది ఎంపీలు ఒకే మాట పై నిలవడం లేదని ఆయన దుయ్యబట్టారు. వైకా పా, తెదేపాలు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయ ని బుధ వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. విభజన చట్టంలో చెప్పిన హామీలు, నిధులు రాష్ట్రానికి ఇవ్వాలని జనసేన డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకే తమ పార్టీ నడుస్తోందని, ఏ పార్టీ ఆదేశాలతో పని చేయడం లేదని జనసేన నాయకుడు అద్దెపల్లి శ్రీధర్ అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల లేవనెత్తిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తమకు ఏ పార్టీ దూరం కాదని, అలాగే ఏ పార్టీ కూడా దగ్గర కాదని ఆయన అన్నారు. ప్రత్యేక హోదా కోసం జనసేన ఒక్కటే మొదటి నుంచి పోరాటం చేస్తోందని ఆ పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. విభజన హామీల కోసం రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు.

ప్రత్యేక హోదా కోసం సైకిల్ యాత్ర

ప్రత్యేక హోదా కోసం ఢిల్లీకి సైకిల్ యాత్ర చేపట్టాడో ఔత్సాహికుడు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కొల్ల వెంకట్ తిరుపతి నుంచి సైకిల్ మీద యాత్ర చేపట్టి 36 రోజుల్లో దేశ రాజధానికి చేరుకున్నారు. ప్రత్యేక హోదా అనేది 5 అక్షరాల మాట కాదు 5 కోట్ల ఆంధ్రుల ఆత్మ గౌరవం అనే బోర్డు సైకిల్‌పై పెట్టుకుని యాత్ర సాగించారు. ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని కేంద్రం తేల్చి చెప్పిన రోజున తన యాత్రకు శ్రీకారం చుట్టానని, ఏపీ ప్రజలను మోసం చేసి మోడీ విశ్వసనీయత కోల్పోయారని ఆయన అన్నారు. త్వరలోనే ప్రధాని కార్యాలయానికి వినతి పత్రం సమర్పిస్తానని వెంకట్ తెలిపారు.

ప్రత్యేక హోదా కోసం ఎస్వీయూలో ఆమరణ నిరాహార దీక్ష

తిరుపతి రూరల్, ప్రభన్యూస్: ప్రత్యేక హోదా సాధనకోసం ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహారదీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నాని, స్థానిక ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్‌లు పాల్గొని ప్రారంభించారు. ఉదయం ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్దవున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దీక్షలో పాల్గొన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో హోదాను సాధించాలని పిలుపునిచ్చారు. తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, ఎమ్మెల్యే సుగుణమ్మ, డాక్టర్ సుధారాణి, డాక్టర్ శ్రీహరిరావులు దీక్షా శిబిరంలో పాల్గొని విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు కుట్ర పూరితంగా వ్యవహరించి, విభజన హహామీలను నెరవేర్చకుండా రాజకీయ కుట్రతో పవన్ , జగన్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని ఏపీకి తీరని ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు తెలుగువాడి దెబ్బ ఏమిటో ఢిల్లీ పెద్దలకు తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆనంద్ గౌడ్, రవినాయుడు, వివేక్, లోకనాథం, టిడిపి నేతలు దంపూరి భాస్కర్, పుష్పావతి, శ్రీధర్ వర్మ, శాంతమ్మ, హేమంతకుమార్, చందు, నీలం బాలాజి, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడాలి

• కేఆర్ఎంబీ ఆదేశాలు సక్రమంగా అమలు చేయాలి • నిఘా కమిటీల పర్యవేక్షణలో నీటి సరఫరా జరగాలి • రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణారావు

అమరావతి, ఆంధ్రప్రభ : కనీసం ఈసారైనా సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని 3వ జోన్‌కు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. హైదరాబాద్‌లో కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి ముగ్గురు సభ్యులతో కూడిన హైపవర్‌కమిటీ తాజాగా సమావేశమై,ఇరు రాష్ట్రాలకు సంబంధించిన భవిష్యత్ కేటాయింపులపై నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఆంధ్రాలోని 3వ జోన్‌లో పరిధిలో రెండు లక్షల ఎకరాల్లోని పంటలకు సక్రమంగా సాగునీరందక ఎండుతున్నాయి. మొక్కజొన్న, పత్తి,మిర్చి, పొగాకు, మామిడి తదితర పంటలు సక్రమంగా సాగునీరు అందక ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్న నేపథ్యంలో కేఆర్ఎంబి అధికారులు తీసుకున్న నిర్ణయాలు 3వ జోన్ రైతాంగానికి భరోసా కల్పిస్తున్నాయి.కేఆర్ఎంబి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఇండెంట్‌లను పరిశీలించి, ఖరారు చేశారు. ఈనెల 20 నుంచి మే 31 వరకు ఇరు రాష్ట్రాల మంచినీరు,సాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేటాయింపులను ఖరారు చేశారు. దాని ప్రకారం శ్రీశైలం నుంచి తెలంగాణలోని కల్వకుర్తికి ఒక టీఎంసీ, ఆంధ్రప్రదేశ్ లోని హెచ్ఎన్ఎస్ఎస్, ముచ్చుమర్రికి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. అదే విధంగా నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ నగరానికి మంచినీటి కోసం 6 టీఎంసీలు, సాగర్ ఎడమ కాల్వకు ఇరిగేషన్ కోసమే కాకుండా తాగునీటి కోసం మొత్తం 10 టీఎంసీలు విడుదల చేయాలని నిర్ణయించారు.అలాగే ఏపీకి సంబంధించి కుడి కాలువకు 7 టీఎంసీలను ఈనెల 25 నుంచి విడుదల చేయాలని నిర్ణయిం చారు. సాగర్ ఎడమ కాలువకు 4 టీఎంసీలు కేటాయించారు. అలాగే కృష్ణా డెల్టా సిస్టంకు 4 టీఎంసీలు ఈనెల 21 నుంచి విడుదల చేయాలని ఆదేశాలు ఇచ్చారు. హెడ్ రెగ్యులేటరీ నుంచి 280 కిలో మీటర్ల మేర ఆంధ్రా సరిహద్దు వరకు సాగర్ నీటి నష్టాలు లేకుండా చూసేందుకు ఇరు రాష్ట్రాల ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌తో పర్యవేక్షణ కమిటీలను కూడా ఏర్పాటుచేశారు.ఈ కమిటీల పర్యవేక్షణ,నిఘా కమిటీల ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి ఏపీలోని ఎన్ఎస్‌పి మూడవ జోన్‌కు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

కేఆర్ఎంబీ ఆదేశాలు అమలు చేయాలి

కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఇచ్చిన ఆదేశాలను సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల గోపాలకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. 25 నుంచి 15 రోజుల పాటు కనీసం 1500 క్యూసెక్కులైనా సాగునీటిని 3వ జోన్‌కు విడుదల చేయాలని,లేకుంటే పంటలు దక్కవని ఆయన అన్నారు.

నీటి విడుదలలో విభజన చట్టంలోని షెడ్యూల్ 6, 9 ప్రకారం చర్యలు తీసుకోవాలని కేఆర్ఎంబి కూడా నిర్ణయించిందన్నారు.అవి సక్ర మంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు చూడాలని పేర్కొన్నారు. ఇచ్చిన ఆదేశాలు అమలు చేయని పక్షంలో సంబంధిత రాష్ట్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా కేంద్రం విధించే ఆర్థికపరమైన ఇతర శిక్షలను కూడా ఎదుర్కొవాల్సి ఉంటుందని ఆయన స్పష్టంచేశారు.

పామాయిల్ తయారీ యూనిట్‌కు కృషి

• మంత్రి సోమిరెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : ఆయిల్ ఫాం రైతులను ప్రోత్స హించేందుకు రైతు సంఘాల ద్వారా ఆయిల్ ఫాం ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేసేందుకు కృషి చేస్తానని వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో జరిగిన ఆయిల్ ఫాం రైతు సంక్షేమ సంఘం, ఆయిల్ ఫాం కంపెనీల ప్రతినిధుల తో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం వివరాలను మీడియాకు వివరించారు. ఆయిల్ ఫాం గెలలను ఆయిల్ రికవరీ శాతం కోసం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రీసెర్చ్ ద్వారా పరీక్ష చేయించనున్నట్లు మంత్రి పేర్కొన్నార. అశ్వారావుపేట, పెదవేగి ఆయిల్ ఫెడ్ యూనిట్లలో గెలలకు విడివిడిగా ప్రాసెసింగ్ చేయించనున్నామన్నారు. అలాగే 20 ఏళ్లు వయస్సు దాటిన తోటలను తీసివేయడానికి ఆర్థిక సహాయం అందించేందుకు అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఆయిల్ ఫెడ్ యూనిట్లలో గెలలను ప్రాసెస్ చేసిన తర్వాత వచ్చే వృధాను నమూనా పరీక్షలు చేయడం ద్వారా ఆయిల్ రికవరీ వృధాను తెల్సుకునేందుకు యంత్రాల సామర్థ్యం నిర్ధారించడంపై సమీక్ష జరిగిందన్నారు. పామాయిల్ గెలల నాణ్యతను నిర్ధారించేందుకు ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ పరిధిలోని 8 కలెక్షన్ సెంటర్లలో, ఫాక్టరీ వద్ద ఆయిల్ ఫాం అసోసియేషన్ ద్వారా ఇద్దరు ప్రతినిధులను, ఆయిల్ ఫెడ్ ప్రతినిధిని ఉంచి గెలలు సేకరించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఉద్యానవన శాఖ కమిషనర్, ఆయిల్ ఫెడ్ వైస్ ఛైర్మన్, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నాణ్యతగల ఆయిల్ ఫాం గెలలను కోత కోయుటకు కావాల్సిన శిక్షణ ఇచ్చేందుకు తగిన చర్యలు చేపట్టనున్నామన్నారు. ముందుగా జరిగిన సమీక్షా సమావేశంలో ఉద్యానవన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, ఆయిల్ ఫెడ్ ఎండీ ఫణికిషోర్, స్టేట్ ఆయిల్ ఫాం అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బా వీరరాఘవరావు, ఆయిల్ ఫాం కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పనితనాన్ని మరింత మెరుగుపర్చుకోవాలి



• దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్

అమరావతి, ఆంధ్రప్రభ : నిత్యం ఉద్యోగులు తమ పనితనాన్ని మరింతగా మెరుగుపర్చుకుని,అభివృద్ధిని దోహదపడాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం ఇక్కడికి సమీపం లోని రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాపును ఆయన తనిఖీ చేసి, అక్కడి అధికారులు,సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది నిర్దేశిత లక్ష్య సాధనకు మరింతగా శ్రమించాలన్నారు. అంకిత భావంతో పనిచేసి, సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని పేర్కొంటూ ,మెరుగైన పనితనాన్ని కనబర్చిన ఉద్యోగులను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. వర్క్‌షాప్‌లో అందరు మెచ్చుకునే స్థాయిలో పని చేసే సిబ్బందికి రూ. 1.0 లక్షల నగదు బహుమతిని ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతా సమిష్టిగా శ్రమించి,సంస్థలో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు.ఈ సందర్భంగా వర్క్‌షాపు ఆధునీకీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన న్యూబే ను ఆయన ప్రారంభించారు.అదే విధంగా మహిళల విశ్రాంతి గదిని, ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్‌ను సీఎన్‌సీ కంప్యూటరైజ్‌ను ప్రారంభించారు. ప్రాంగణంలో నిర్మించిన ఉద్యానవనాన్ని కూడా ఆరంభించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎయిర్ బ్రేక్ వ్యవస్థ పంపిణీదారు వాల్వ్ నిర్వహణను ప్రశంసించారు. ఈ విభాగంలో పని చేస్తున్న వారికి కూడా రూ.2వేల క్యాష్ అవార్డును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం ధనంజయులు, ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ అర్జున్‌ముండియా, చీఫ్ ఎలక్ట్రికల్ జనరల్ ఇంజనీర్ ఎస్.కె.అగర్వాల్, చీఫ్ ఇంజనీర్ (కనస్ట్రక్షన్) జి.వి.రమణారెడ్డి, చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ బీరేంద్రసింకు , వర్క్‌షాప్ చీఫ్ ఇంజనీర్ హేమ్‌సింగ్ బానోత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచబ్యాంక్ సమావేశంలో

ఏపీసీఆర్డీయే కమిషనర్ శ్రీధర్

• అమరావతి భూసమీకరణపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్

అమరావతి ఆంధ్రప్రభ : అమరావతి రాజధాని భూసమీకరణపై ఏపీసీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వాషింగ్ టన్‌లో పవర పాయింట్ ప్రజంటేషన్ చేశారు. భూమి--పేదరికం అంశంపై ప్రపంచ బ్యాంక్ సదస్సు వాషింగ్‌టన్‌లో బుధవారం జరిగింది. ఈ సదస్సుకు పలు ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు, పలు అభివృద్ధి సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రజలకు కలిగే సాంఘిక ప్రయోజనాలు తదితర అంశాలపై సదస్సుకు హాజరైన వారు వివరించారు. అమరావతిలో భూసమీకరణపై రైతులు అందించిన అపురూపమైన సహకారం తదితర అంశాలను ఏపీసీఆర్డీఏ కమిషనర్ శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంతేగాక పలువురు ప్రముఖ



పెట్టుబడిదారులను కూడా ఆయన కలిసి అమరావతిలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. తద్వారా ముడు వేల నుంచి నాలుగు వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని శ్రీధర్ అక్కడి పెట్టుబడిదారులకు తెలిపారు.

దుర్గమ్మ సేవలో రైల్వే ఉన్నతాధికారి కుటుంబం

అమరావతి, ఆంధ్రప్రభ : బెజవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయాన్ని బుధవారం పలువురు ప్రముఖులు సందర్శించి, సేవించారు.వారికి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ గౌరంగబాబు, సభ్యులు,ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి ఛైర్మన్ గౌరంగబాబు ఆయనకు అమ్మవారి చిత్ర పటాన్ని అందజేశారు. కాగా ఆలయంలో గత నాలుగు రోజులుగా ఎరుపు గులాబి పూలు,ఆరెంజ్ గులాబీ, నీలి చామంతి,తులసిమాల తదితర పూలతో ఘనంగా పుష్పార్చన నిర్వహిస్తున్నారు.ఈ అర్చన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నది.

ఆలయం అభివృద్ధికి చర్యలు

శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మకర్తల మండలి ఛైర్మన్ గౌరంగబాబు పేర్కొన్నారు.ఆయన బుధవారం సభ్యులతో కలిసి, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని వేగంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.రానున్న రోజుల్లో అద్దాల మండపం ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు ఏఈఓ అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.



టెండర్ల వాయిదా

శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునేందుకు ఉద్దేశించిన లైసెన్స్‌హక్కును ఇచ్చేందుకు బుధవారం నిర్వహించిన టెండర్లలో సరైన ధర రానందున టెండర్ ప్రక్రియను వాయిదా వేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు దుర్గమ్మ గుడికి బస్సు విరాళం

విజయ బ్యాంక్ అధికారులు నేడు దుర్గమ్మ గుడికి బస్సును విరాళంగా అందజేయనున్నారని అధికారులు పేర్కొన్నారు. సుమారు రూ. 32 లక్షల విలువైన ఈ బస్సును దేవస్థానానికి వచ్చే భక్తులకు అందుబాటు వుంచుతారు. పూజా కార్యక్రమాల అనంతరం ఈ నూతన బస్సును ప్రారంభించడం జరుగుతుందని ఈవో పద్మ తెలిపారు.

బీజేపీ, టీడీపీల వల్లే రాష్ట్రానికి తీరని అన్యాయం

• ప్రజలను చైతన్య పరిచేందుకు విశాఖ నుంచి పాదయాత్ర ప్రారంభం • సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో : రాష్ట్రంలో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ప్రత్యేక హోదా, రైల్వేజోన్ సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్రకార్యదర్శి మధు అన్నారు. సీపీఎం నగర కమిటి ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 29 వరకు చేపట్టిన మహాపాదయాత్రను బుధవారం ఇక్కడ మద్దిలపాలెం జంక్షన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ విభజన చట్టంలో అంశాలు, రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలు దక్కించుకోవడానికి నగరంలో అన్ని వార్డుల్లోని పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దశల వారీగా మిగిలిన ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఉద్యమాన్ని తీవ్రతరం చేసి కేంద్రం మెడలు వంచైనా ప్రత్యేక హోదా, రైల్వేజోన్ సాధించి తీరుతామన్నారు. బీజేపీ, టీడీపీ వైఫల్యంతో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. నాలుగేళ్లుగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ భజన చేసి ఇప్పుడు హోదా కావాలంటూ ప్రకటనలు గుప్పిస్తుందన్నారు. చేసిన పొరపాటుకు ప్రజలకు క్షమాపన చెప్పి తమతో కలిపి ఉద్యమానికి కలిసి రావాలన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం మోసం చేసిందని పలువురు వక్తలు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు సిహెచ్ నర్సింగరావు, ఉత్తరాంధ్ర చర్చావేదిక నాయకుడు కొణతాల రామకృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాస్, వైసీపీ పార్లమెంట్ సమన్వయకర్త తైనాల విజయ కుమార్, జనసేన నాయకులు శ్రీనివాస్ ప్రభుదాస్, లోక్‌సత్తా హరిగణేష్, ఆమ్‌ఆద్మీ నాయకురాలు సీతాల్, ఇతర వామపక్ష నాయకులు వామనమూర్తి, బొట్టా ఈశ్వరమ్మ, పలువురు నేతలు, కార్యకర్తలు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు

• తెదేపాకు ప్రజలే బుద్ధి చెబుతారు: విష్ణువర్ధన్ రెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.14 వందల కోట్లు మంజూరు చేయడం పట్ల బీజేపీ శిక్షణ విభాగం ఇన్‌చార్జి, యువ మోర్చా ఏపీ అధ్యక్షుడు ఎస్.విష్ణువర్ధన రెడ్డి కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన రెడ్డి మాట్లాడుతూ రాజకీయ అవసరాల కోసం ఊసరవెల్లి మాదిరి పూటకో రంగు మారుస్తున్న తెలుగుదేశం పార్టీ వంటి రాజకీయ పార్టీలకు ప్రజలే తగిన బుద్ది చెపుతారన్నారు. విభజన చట్టంలో 10 ఏళ్ల గడువున్నప్పటికీ నాలుగేళ్లలోనే 85శాతం పనులు చేపట్టిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొన్నవన్నీ కూడా ఇస్తున్నప్పటికీ సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ తరహా తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిపక్షపార్టీలతో చేతులు కలిపి హోదాపేరిట బంద్‌లు, ఉద్యమాలు చేపట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు పేర్కొన్నారు. టిడిపి ప్రజాద్రోహ చర్యలను ప్రజలే తిప్పికొడతారని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఎన్‌డిఎ నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగినా రాష్ట్రాభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గే అవకాశమే లేదని ఆయన స్పష్టం చేశారు.

అవిశ్వాసం రేపు!



(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన నోటీసులను లోక్‌సభలో చదివి వినిపించారు. టీడీపీ ఎంపీ తోట నరసింహం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి. సుబ్బారెడ్డి అవిశ్వాస తీర్మానాలను ఇచ్చారని ఆమె సభకు తెలిపారు. సభ సజావుగా ఉంటే దీనిపై తదుపరి చర్యలు చేపడతామని ఆమె ప్రకటించారు. అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలా లేదా అనే దానికి మద్దతిస్తున్న 50 మంది ఎంపీలు తమ తమ స్థానాల్లో నిలబడితే లెక్కించాల్సి ఉందన్నారు. అయితే అదే సమయంలో టీఆర్ఎస్, అన్నాడిఎంకె పార్టీలు, జన్ అధికార్ లోక్ తాంత్రిక్ పార్టీ ఎంపీ పప్పుయాదవ్ వెల్‌లో ఆందోళన కొనసాగించాయి.

కావేరి నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు, రిజర్వేషన్ల కోటా పెంచాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జన్ అధికార్ లోక్ తాంత్రిక్ పార్టీ ఎంపీ పప్పుయాదవ్ వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలుచేశారు. స్పీకర్ సుమిత్రా మహాజన్, వారిని తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాలని ఆమె పదే పదే విజ్ఞప్తి చేశారు. కనీసం తనకు ఎంపీలెవరూ కనిపించడం లేదన్నారు. ఇలా ఉంటే ఎంపీల సంఖ్యను ఎలా లెక్కించాలని నిస్సహాయత వ్యక్తం చేశారు. తీర్మానానికి మద్దతిస్తున్న ఎంపీలను లెక్కించాల్సి ఉందని, వెల్‌లో ఉన్న సభ్యులు కూర్చోవాలని కోరారు. అయినా వెల్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న టిఆర్ఎస్, అన్నాడిఎంకె సభ్యులు పట్టించుకోలేదు. దాంతో సభ కార్యక్రమాలు సజావుగా నడిచే పరిస్థితి లేనందున అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టలేమని స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

అవిశ్వాసంపై చర్చకు సిద్ధం: పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్

అవిశ్వాస తీర్మానం సహా అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ లోక్‌సభలో స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. విపక్ష సభ్యులు ఆందోళన విరమించి సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ తమ స్థానాలకు వెళ్లి కూర్చోవాలని కోరారు. లోక్‌సభలోనూ, బయటా మోడీ ప్రభుత్వానికి ప్రజల పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు.

అవిశ్వాసానికి మద్దతుగా కాంగ్రెస్, టీఎంసీ

అవిశ్వాస తీర్మానాలకు మద్దతుగా సభలో కాంగ్రెస్, టీఎంసీ, వామపక్షాలు, ఆర్జేడీ, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీల ఎంపీలు లేచి నిల్చున్నారు. ప్రత్యేక హోదా పోరాటానికి మద్దతిస్తామని ముందుగానే ప్రకటించిన కాంగ్రెస్, వామపక్షాలు తమ సంఘీభావాన్ని కొనసాగించాయి.

అవిశ్వాసానికి మళ్లీ నోటీసులు

అవిశ్వాస తీర్మానంపై టీడీపీ, వైఎస్సార్సీపీలు మరోసారి స్పీకర్‌కు నోటీసు ఇచ్చాయి. తమ అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేలా చర్యలు తీసుకోవాలని రెండు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ తరుపున ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ తరపున ఎంపీ తోటనరసింహం అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. అవిశ్వాస సమయంలో ఎంపీలంతా విధిగా హాజరై మద్దతుగా నిల్చోవాలని విప్ కూడా జారీచేశారు.

బీహార్ కు ప్రత్యేక హోదా కావాలి : పప్పూ యాదవ్

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జన్ అధికార్ లోక్ తాంత్రిక్ పార్టీ అధ్యక్షుడు ఎంపీ పప్పూ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన దీనిపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో వాయిదా తీర్మానానికి నోటీసు ఇవ్వగా, స్పీకర్ తిరస్కరించారు. దాంతో ఆయన లోక్‌సభ వెల్‌లో నిరసన తెలిపారు. ఓ వైపు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఎంపీలు డిమాండ్ చేస్తున్న తరుణంలో, బీహార్‌కు కూడా హోదా ఇవ్వాలని ఆందోళనలు ప్రారంభం కావడం గమనార్హం.

రాజ్యసభ వాయిదాల పర్వం

ఇటు రాజ్యసభలోనూ వాయిదాల పర్వం కొనసాగింది. విపక్షా ల ఆందోళనతో సభా కార్యక్రమాలు ముందుకుసాగలేదు. ఎస్సీ, ఎస్టీల అంశం, సుష్మాస్వరాజ్ ప్రకటనపై చర్చ జరపాలని కాంగ్రెస్ పక్ష నేత గులాంనబీ ఆజాద్, టీఎంసీ నేత డెరెక్ ఒబ్రెయిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభను నడిపేందుకు తాము సిద్ధంగా ఉన్నా ప్రతిపక్షాలు సహకరించడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల సహాయమంత్రి విజయ్ గోయల్ అన్నారు, గ్రాట్యుటీ సవరణ బిల్లు, అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు, ట్రిపుల్ తలాక్ లాంటి కీలక బిల్లు సభ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నామయన్నారు. విపక్షాలు సహకరించాలని కోరారు. అయితే సభలో విపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించారు.

హోదా కోసం ఉధృత పోరాటం

- జాతీయ రాజకీయాల్లో వస్తానేమోనని బీజేపీకి అనుమానం
- వైకాపాది లాలూచీ రాజకీయం
- జాతీయ అంశంగా ఏపీ సమస్య
- ఎంపీల టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం తెలుగుదేశం పార్టీ చేస్తున్న పోరాటం జాతీయ అంశంగా మారిందని ఈ సమయంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఎంపీలకు తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేశారు. 1985 ఆగస్టు సంక్షోభంలో 161 మంది ఎమ్మెల్యేలు ఎన్టీఆర్‌కు బాసటగా నిలిచి విజయం సాధించారని ఇదే స్ఫూర్తితో రాష్ట్రానికి న్యాయం జరిగేంతవరకు పోరాటం చేయాలని సూచించారు. ఒక్క బీజేపీ మినహా మిగిలిన పార్టీలన్నీ ఆంధ్రప్రదేశ్ పట్ల సానుభూతిని చూపించడమే కాక మద్దతునిస్తున్నాయని చెప్పారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి నుంచి తమ పార్టీకి చెందిన ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా బీజేపీకి తాను జాతీయ రాజకీయాల్లోకి వస్తానన్న అనుమానం వెంటాడుతుందని, తనకు ఆసక్తి లేదన్న వాళ్ళు నమ్మడం లేదని చెప్పారు. అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి వైసీపీ మద్దతు అవసరం లేకుండా తీసుకుందన్నారు. ఒకవేళ తనకు ఆసక్తి ఉండి ఉంటే గతంలోనే వచ్చిన అవకాశాలను వినియోగించుకునేవాడినని అన్నారు. విభజనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి పోయిందని, ఇప్పుడు మనం ఎంత చేసినా ఆ లోటును కొంతే తీర్చగలమని అన్నారు. ఈ లోటు పూడాలంటే కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. ఎంతో చేయాల్సి ఉన్న కేంద్రం మాత్రం సహకారం అందించడం లేదన్నారు. వృద్ధి రేటులో తెలంగాణ కన్నా రెండు శాతం ముందున్న తలసరి ఆదాయంలో రూ.33 వేలు వెనుకబడి ఉన్నామని తెలిపారు. దీనికి కారణం బీజేపీ కాదా.? ఆ లోటు పూడ్చాల్సిన బాధ్యత లేదా..? అంటూ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ దేశంలో అంతర్‌భాగమన్న అంశాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. సామరస్యంగా అడిగినా రాష్ట్రాన్ని ఆదుకోలేదని, అదే సమయంలో మంత్రులు రాజీనామా చేసిన స్పందించలేదన్నారు. ఎన్డీయే నుంచి వైదొలగినా ఏ మాత్రం కదలిక లేదని చివరికి అవిశ్వాసాన్ని కూడా ఏదో విధంగా వాయిదా వేసుకుంటూ కేంద్రం మొండిగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వెనుక ఏదో వ్యూహం ఉందనే అనుమానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యక్తం చేశారు. ఏదో భరోసాతోనే కేంద్రం ఆంధ్రప్రదేశ్ పట్ల ఇంత కఠినంగా వ్యవహరిస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజలు ఈ పరిణామాలన్నింటిని గమనించడంతో పాటు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. తాము కోరేది కేవలం విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి న్యాయం చేయాలని మాత్రమేనని, దీనిలో గొంతెమ్మ కోరికలు ఏమి లేవని చెప్పారు. విభజన చట్టంలో పేర్కొన్న 19 అంశాలు 6 పార్లమెంటు హామీలను మాత్రమే అడుగుతున్నామన్నారు. ఈ హామీలన్ని నెరవేర్చమని ఎంతో కాలం బీజేపీని కోరిన ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పోరాటానికి దిగామన్నారు. ఉభయ సభల్లో ఆందోళన ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకించడం అన్ని బీజేపీకి చెప్పే చేశామన్నారు. అవిశ్వాసం పెట్టినవాళ్లకు ప్రధానమంత్రి కార్యాలయంలో పనేంటో చెప్పాలన్నారు. ఒకవైపు అవిశ్వాసానికి నోటీసు ఇస్తూ మరోవైపు ఇలాంటి లాలూచీ రాజకీయాలు చేస్తున్నారని దీంతోనే ఆ పార్టీ చిత్తశుద్ధి ఏంటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలుగువారంతా ఆవేశంతో రగిలిపోతున్నారని ఏ ప్రాంతంలో ఉన్న వారందరిది ఒకటే మాట అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఎంపీలందరు సంఘటితంగా పోరాడి 5 కోట్ల ప్రజల మనోభావాలను ప్రతిబింబించే విధంగా వ్యవహరించాలని మార్గనిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో అవిశ్వాసం నోటీసును అనుమతించాల్సిందేనని, మరోక ప్రత్యామ్నయం కేంద్రానికి లేదన్నారు. సభను ఇలా వాయిదా వేసుకుంటూ వెళితే ప్రజలు మరింత ఆగ్రహావేశాలకు లోనవుతారని చెప్పారు. కేంద్రం రాష్ట్రానికి న్యాయం చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో టిడిపి పార్లమెంటరీ నేత సుజనా చౌదరి, ఎంపీలు సీఎం రమేష్, టిజి.వెంకటేష్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు, శాసనసభ, శాసనమండలి చీఫ్ విప్‌లు పల్లె రఘునాధరెడ్డి, పయ్యావుల కేశవ్, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ స్ట్రాటజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్త్రమే మా బ్రహ్మాస్త్రం



(మొదటిపేజీ తరువాయి)

మాదిరిగా ఉదయం గం. 10.00 సమయానికి పార్ల మెంటు ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరు కున్న ఎంపీలు, కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ ధర్నాకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ప్రతి రోజూ ఏదో ఒక వేషధారణతో, వివిధ రకాల కళారూపాలతో ఆకట్టుకునే చిత్తూరు ఎంపీ శివప్రసాద్, బుధవారం సత్య హరిశ్చంద్రుడి వేషంతో పార్లమెంటుకు చేరుకున్నారు. తాను వారణాసి నుంచి వస్తున్నానని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం బానిసగా మారి ఎన్ని కష్టాలకైనా ఓర్చుకున్న సత్య హరిశ్చంద్రుడినని చెప్పుకొచ్చారు. ప్రధాని మోడీ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం కూడా వారణాసియేనని, ఆయన సైతం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ఇందుకోసం ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కోవాలని హితవు పలికారు. గాంధీ విగ్రహం దగ్గర ధర్నా అనంతరం పార్లమెంటు ఉభయ సభల్లో తమ తమ సీట్లలోనే లేచి నిలబడి తమ నిరసన కొనసాగించారు. మధ్యాహ్నం గం. 12.00 సమయంలో అవిశ్వాస తీర్మానం అంశం చర్చకు రాగానే, ఆ తీర్మానానికి మద్ధతుగా లేచి నిలబడ్డారు. కానీ స్పీకర్ సభ సజావుగా సాగడం లేదన్న సాకుతో వాయిదా వేయడంతో ఎంపీలంతా ఆగ్రహానికి లోనయ్యారు. అనంతరం వారిలో కొందరు విజయ్ చౌక్ మీడియా పాయింట్ చేరుకుని, తమ ఆగ్రహాన్ని, నిరసనను మాటల్లో వ్యక్తపరిచారు. ఎవరెవరు ఏమన్నారంటే..?

ఆంధ్రప్రదేశ్ అంటే కనీస గౌరవం లేదు:

తోట నరసింహం, తేదేపా లోక్‌సభాపక్ష నేత

కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంటే కనీస గౌరవం లేదు. మా అవిశ్వాస తీర్మానాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. నాలుగవ రోజు కూడా మళ్లీ అవిశ్వాస తీర్మానం ఇచ్చాం. అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఎంపీల నినాదాలను సాకుగా చూపి సభను మళ్లీ వాయిదా వేశారు. ఇదంతా చూస్తుంటే ఏదో గూడుపుఠానిలా కనిపిస్తోంది. ఒక రాజకీయ ఎత్తుగడతో మా అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు రాకుండా అడ్డుకుంటున్నట్టుగా అనిపిస్తోంది. సభ సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంది. ఈ క్రమంలో అవసరమైతే సభను అడ్డుకుంటున్నవారిని సస్పెండ్ కూడా చేయవచ్చు. కానీ ఇదేమీ చేయకుండా సభలో వాయిదాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. అయినా సరే అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు స్వీకరించే వరకు మా ప్రయత్నాన్ని కొనసాగిస్తాం.

మా సహనాన్ని పరీక్షించకండి: మురళీ మోహన్, టీడీపీ ఎంపీ

నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఎన్డీయే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ ఎత్తుగడ వేసినట్టు అర్థమవుతోంది. మా సహనాన్ని పరీక్షించకండి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఏ గతి పట్టిందో చూశారు కదా. మీకు కూడా అదే గతి పడుతుంది. ఇప్పటికైనా అవిశ్వాస తీర్మానంపై చర్చ జరపండి. సభ సజావుగా సాగేలా చూడండి.

దున్నపోతు మీద వర్షం కురిసినట్టే ఉంది:

అవంతి శ్రీనివాస్

బీజేపీ పాలకులు సున్నితత్వాన్ని కోల్పోయారు. సంఖ్యాబలం ఉంది, మాకేంటి అనే ధీమాతో ఉన్నారు. కానీ వారు రోజుకు లక్ష ఓట్లు కోల్పోతున్నారు. ప్రజల్లో రోజురోజుకీ వ్యతిరేకత పెరిగిపోతోంది. ఏపీకి జరిగిన అన్యాయాన్ని మిగతా రాష్ట్రాల ప్రజలు కూడా గమనిస్తున్నారు. ఇంత జరుగుతున్నా దున్నపోతు మీద వర్షం పడ్డట్టు, మా సమస్యను వారు పట్టించుకోవడం లేదు. కేంద్రానికి దమ్ముంటే ఇప్పటికైనా చర్చకు ముందుకు రావాలి. ఏమిచ్చారో స్పష్టం చేయాలి. సోషల్ మీడియాలో ఏవేవో లెక్కలు చెప్పడం కాదు. ఆపరేషన్ గరుడ అంటూ ప్రచారం చేయడం కాదు. ప్రజల ముందు ఏ మీడియా ప్రచారం నిలబడదు. ప్రజలు తమ ఓటుతో తగినరీతిలో బుద్ధి చెబుతారు.

నమ్మకద్రోహం చేస్తారనుకోలేదు: మాగంటి వెంకటేశ్వరరావు (బాబు), ఏలూరు ఎంపీ

భారతీయ జనతా పార్టీ నమ్మకద్రోహం చేస్తుందనుకోలేదు. మమ్మల్ని బలి చేసినా ఫరవాలేదు. కానీ ప్రజలకు అన్యాయం చేయకండి. రానున్న రోజుల్లో నష్టపోయేది బీజేపీయే. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని నెలకొల్పారు. ఆయన పేరు సభలో ప్రస్తావిస్తే మాకు న్యాయం చేస్తారనుకున్నాం. కానీ మొండి చెయ్యి చూపిస్తారని అనుకోలేదు. కేంద్రం బెదిరింపులకు భయపడేది లేదు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు.

కర్నూలు కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్ లేదు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కర్నూలు జిల్లాలో కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్ (సీఈజడ్) ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనా అందలేదని బుధవారం రాజ్యసభలో వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి సీఆర్ చౌదరి ప్రకటించారు. కర్నూలు జిల్లాలో 30 వేల ఎకరాలను సేకరించి అందులో సీఈజడ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా ప్రతిపాదన మీ మంత్రిత్వ శాఖకు వచ్చిందా అంటూ వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. సీఈజడ్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ రాయితీలను ప్రకటించే ప్రసక్తి కూడా లేదన్నారు.

విశాఖ ఎస్ఈజడ్‌లో ఐటీ టవర్‌కు ఆమోదం

విశాఖపట్నం దువ్వాడలోని స్పెషల్ ఎకనమిక్ జోన్‌లో (ఎస్ఈజడ్) ఐటీ టవర్ నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి చౌదరి తెలిపారు. విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... ఎగుమతుల ప్రోత్సాహానికి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర కార్యకలాపాల కోసం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందించే అస్సైడ్ పథకం కింద విశాఖపట్నంలో ఎస్ఈజడ్‌లో ఐటీ టవర్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఇంకా ఎలాంటి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. ఈ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తవుతుందన్న ప్రశ్నకు చౌధరి జవాబు దాట వేశారు.

అవిశ్వాసం పెట్టే హక్కు బాబుకు లేదు

- తేదేపా పై విరుచుకుపడిన వైకాపా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే నైతిక హక్కు చంద్రబాబు నాయుడుకు గానీ, ఆయన పార్టీకి గానీ లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు దుయ్యబట్టారు. తాము ప్రారంభించిన పోరులో మధ్యలో దూరి తనను తాను పోరాట యోధుడిగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండి, ఆ ప్రభుత్వం తీసుకుని నిర్ణయాల్లోనూ భాగం పంచుకుని ఇప్పుడు కేంద్రంపై పోరాడుతున్నామని ఎలా చెబుతున్నారని నిలదీశారు. బుధవారం పార్లమెంటు భవనం ప్రధాన ద్వారం ఎదుట నిలబడి ధర్నా చేసిన వైకాపా ఎంపీలు, సభ వాయిదా పడ్డ తర్వాత విజయ్ చౌక్ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అటు బీజేపీ తీరును, ఇటు తెలుగుదేశం పార్టీ వైఖరిని తూర్పారబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అసలు చిత్తశుద్దే లేదన్నారు. వైకాపా నేతలను ద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని తప్పుబట్టారు.

చంద్రబాబును బోను ఎక్కిస్తాం : ఎంపీ విజయసాయి రెడ్డి

రాజ్యసభ చైర్మన్‌కి వైఎస్సార్సీపీ ప్రత్యేక హోదాపై చర్చ జరగాలని కోరుకుంటుందని వివరించాము. ఈరోజైనా సభ సజావుగా జరపాలని మేము వేడుకున్నాం. 4 సంవత్సరాలుగా ప్రత్యేక హోదా కోసం పోరాడుతోంది మేము. నిజాయితీ కోసం అని ఇద్దరు మంత్రులు బయటకి వచ్చారు. బాబుకు చిత్తశుద్ధి ఉంటే ప్యాకేజీ అడిగే వారు కాదు. హోదా కోసం పోరాడేవాళ్ళు. చంద్రబాబును బోనులోకి ఎక్కించేంతవరకు, మళ్లీ మళ్లీ తిరిగి చట్టప్రకారం చర్యలు తీసుకునేంతవరకు వైసీపీ చేయాల్సిందంతా చేస్తుంది.

రాజీనామాలు చేస్తాం: ఎంపీ మేకపాటి

సభ ఇలాగే జరుగుతుందని నేను ముందు నుంచి ఊహించాను. ఎక్కడా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఎవరు ద్రోహం చేశారో ప్రజలకు తెలుసు. ప్రజల్ని వంచించింది, మోసం చేస్తున్నది తెలుగుదేశం పార్టీయే. ఎన్డీయే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. తీర్మానంపై చర్చిద్దామనే ధ్యాస కూడా లేదు. కొద్ది రోజుల్లో సభను నిరవధికంగా వాయిదా వేసే అవకాశం లేకపోలేదు. మేం ముందే ప్రకటించిన తేదీ నాటికి స్పీకర్ ఫార్మాట్లోనే రాజీనామాలు చేస్తాం.

రాజకీయ లబ్ది కోసమే: వరప్రసాద్, ఎంపీ

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు నాయుడు ఇప్పుడు హోదా కోసం పోరాటం అంటున్నారు. మేం గత నాలుగేళ్లుగా ఈ ప్రత్యేక హోదా పోరాటంలో నిమగ్నమై ఉన్నాం. ప్రజల్ని ఎలా మోసం చేయాలా అని చంద్రబాబు ఆలోచిస్తున్నారు.అవిశ్వాస తీర్మానం చర్చకు రాకపోతే మా ఎంపీలంతా కలిసి రాజీనామాలు సమర్పిస్తాం.

వైకాపాను అనుసరిస్తున్న తెలుగుదేశం: వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ

అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 50 మందికి పైగా సభ్యులు నిల్చున్నారు. కానీ బీజేపీ ఏదో ఒక నెపంతో సభలను వాయిదా వేస్తోంది. ఈ రోజు మిగితా పార్టీల సభ్యులు కూడా మద్దతు తెలిపారు. ఏ మొహం పెట్టుకుని మిగతా పార్టీల సభ్యులు టీడీపీకి మద్దతిస్తారు..? కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున్ ముందే వైఎస్సార్సీపీ మా మద్దతు అడిగారని వారికి చెప్పారు. చర్చకు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తాం.

అవిశ్వాసానికి కేంద్రం మోకాలడ్డు

- సొంత బిల్లులు మాత్రం ఆమోదం
- విభజన సమయంలో కాంగ్రెస్ మాదిరిగానే తాజాగా బీజేపీ తీరు
- ఆర్థిక మంత్రి యనమల చిట్‌చాట్



అమరావతి, ఆంధ్రప్రభ : పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా కేంద్ర ప్రభుత్వమే అడ్డుకుంటున్నట్లుగా పరిస్థితులు ఉన్నాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. అవిశ్వాసంపై నోటీసు ఇవ్వడం సభ్యుల హక్కు అని, దానిపై చర్చ జరిపించడం స్పీకర్ బాధ్యత అని అన్నారు. బుధవారం అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ గతంలో రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కాంగ్రెస్ చేసినట్లే ఇప్పుడు కూడా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వారికి కావాల్సిన బిల్లులను పార్లమెంట్‌లో గొడవ జరుగుతున్నప్పటికి ఆమోదించుకుంటున్నారని, అలాంటప్పుడు అవిశ్వాసంపైన కూడా అనుమతించవచ్చు కదా అని అన్నారు. అవిశ్వాసం పెట్టినంత మాత్రాన పోలవరం లాంటి ప్రాజెక్టు నిధులు ఆపడం కేంద్రం వల్ల కాదన్నారు. నిబంధనలకు అనుగుణంగానే కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఎన్డీయే ప్రభుత్వ కనుసన్నల్లోనే జరుగుతున్నప్పుడు వివాదం ఎక్కడిదని ప్రశ్నించారు. పోలవరం అథారిటీ కింద పనులకు అన్ని లెక్కలు పక్కాగా ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై వివక్షను ప్రదర్శిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లు ఎన్డీయేలో ఉండడంతో సంయమనంతో వ్యవహరించామని, ఇక నుంచి తమ విధానాలు ప్రజల దృష్టికి తీసుకువెళతామని స్పష్టం చేశారు. చట్టబద్ధంగా రావాల్సిన హక్కులపై రాద్ధాంతం జరగడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. కేంద్రం అనుచిత వైఖరిని అనుసరిస్తోందని మండిపడ్డారు. 16 వేల కోట్ల రెవెన్యూ లోటు విషయంలో కాగ్, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నీతి అయోగ్‌ల నివేదికను కేంద్రానికి పట్టడం లేదని, ఈ మూడు కూడా ప్రభుత్వ ఏజెన్సీలే కదా అని ఆయన ప్రశ్నించారు. రెవెన్యూ లోటు విదిలిస్తే రాష్ట్రానికి కొంత మేరకు వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. విభజన చట్టం ప్రకారం నిధులు ఇవ్వకపోవడం అనుచితమని, కేవలం పొలిటికల్ క్లియరెన్స్ లేకపోవడం వలనే ఈ పరిస్థితి ఎదురైందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతగా సర్దుకుపోతున్నప్పటికి కేంద్రం కవ్వించే ధోరణితో వ్యవహరిస్తోందని అభిప్రాయపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి చేయాల్సిన సహాయంపై స్పష్టమైన విధానం ఉండాలని, మాట మార్చితే ఏపీ ప్రజలకు తీరని నష్టమని అన్నారు. పోలవరం విషయంలో నిధుల వినియోగం, పనుల నిర్వహణపై విచారణ ఎవరి మీద జరుపుతారని ప్రశ్నించారు. అసలు నిర్వహణపై విచారణ జరిపేది కేంద్ర ప్రభుత్వమని, వారిపైనే విచారణ వేసుకుంటారా..? అని ప్రశ్నించారు. జాతీయ ప్రాజెక్టు అయినందువల్ల పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే వ్యయాన్ని భరించాలని లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ పూర్తయితేనే పట్టిసీమకు నీళ్లు అని పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేస్తున్నామని ఈ విషయంలో 30 వేల కోట్లకు సంబంధించి కేంద్రం అనుసరిస్తున్న తీరును తప్పుపట్టారు.

ఇద్దరు మంత్రులది చెరో మాట ..

ప్రత్యేక హోదా విషయంలో ఇద్దరు కేంద్రమంత్రులు చెరొక విధంగా మాట్లాడుతున్నారని, పొంతన లేని ప్రకటనలతో గందరగోళం నెలకొందన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి 14వ ప్రణాళిక ఆర్థిక సంఘం ప్రత్యేక హోదాపై అంగీకరించిందని ప్రణాళిక శాఖ మంత్రి ప్రకటిస్తే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి మాత్రం అందుకు విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం వాటా విషయంలో కేంద్రం అడ్డంకులు సృష్టించడానికి చట్టపరంగా అవకాశమే లేదని ఆర్థిక మంత్రి యనమల స్పష్టం చేశారు. గ్రాంట్ల మంజూరు విషయంలో కేంద్రానికి విచక్షణా అధికారం మాత్రం ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధుల విషయంలో 1700 కోట్ల రియంబర్స్‌మెంట్ నిధులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే నాబార్డ్ నుంచి రుణంగా ఇప్పించి కేంద్రమే తిరిగి తీసుకునే పరిస్థితులు ఉన్నాయని ఆర్థికమంత్రి వ్యాఖ్యానించారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరంను ఆపే ప్రసక్తే లేదని ఆ విధంగా జరిగినట్లయితే ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళ్లాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పనులను ఛాలెంజింగ్‌గా తీసుకుందని ప్రజా ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ ప్రాజెక్టు అడ్డంకులు సృష్టించే అవకాశాలే లేవని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే పోలవరం పనులు జరుగుతున్నాయని ఈ విషయంలో రాద్ధాంతం లేనే లేదని ప్రకటించారు.

అవిశ్వాసంపై బీజేపీలో ప్రకంపన

- చర్చ జరిగితే కర్ణాటక ఎన్నికలపై ప్రభావం
- మోడి, షా ద్వయంపై ఎంపీల్లో అసంతృప్తి సెగలు
- విభజన డిమాండ్లు ఆమోదించడమే పరిష్కారమంటున్న కేంద్ర మంత్రులు

అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. తీర్మానం చర్చకు రాకుండా తాత్సారం చేయడంలోనూ కేంద్రం వ్యూహాత్మకంగా వ్యవరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో బిజెపి నేతల కలవరపడుతున్నట్టు కనిపిస్తోంది. రాష్ట్రా నికి పలువురు భారతీయ జనతా పార్టీ నేతలు సైతం విభజన హామీల అమలుపై దృష్టి సారించాలని ఇప్పటికే జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు సూచించినట్టు చెబుతున్నారు. మిత్రభేదం వల్ల ఒనగూరేదానికన్నా చంద్రబాబు ప్రచారంతో నష్టమే ఎక్కువగా వాటిల్లే పరిస్థితులున్నాయని ఆ పార్టీ నేతలు ప్రస్తావించినట్టు సమాచారం.మరోవైపు పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగిన పక్షంలో రాష్ట్ర డిమాండ్లతో ఇతర పలు అంశాలు సైతం ప్రస్తావనకు వస్తాయని, ఆ విధంగా జరిగితే త్వరలో ఎన్నికలు జరుగనున్న కర్ణాటకపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయంతో కేంద్ర బిజెపి నేతల్లో వుందని చెబుతున్నారు. ప్రధానమంత్రి అభిమతానికి అనుగుణంగానే అంతా నడుచుకోవాల్సి వస్తుందని, ఈ విషయంలో ఇప్పటికిప్పుడు వెనక్కి తగ్గితే కర్ణాటకలో జరుగనున్న ప్రతికూల పరిణామాలకు దారి తీస్తుందనే నిశ్చితాభిప్రాయానికి బిజెపి జాతీయ నాయకత్వం వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. పైగా తెలుగుదేశం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగిన పక్షంలోబిజెపి సభ్యులే ఎంత మంది హాజరవుతారో తెలియని పరిస్థితి వుందని, పైగా మోడీ, అమిత్‌సా ద్వయంపై ఎం.పి.లలోనూ నిరాసక్తత వుందనే అభిప్రాయంకూడా లేకపోలేదు. ఇదే జరిగితే అవిశ్వాస తీర్మానం నెగ్గినా ఆశ్చర్యం లేదని ఆ పార్టీ నేతలే పేర్కొంటుండం గమనార్హం. ఇటీవల త్రిపురలో పార్టీ అగ్రనేత అద్వానీని ప్రధానమంత్రి అవమానించిన తీరు కూడా పలువురు బిజెపి ఎం.పి.లకు రుచించడం లేదని చెబుతున్నారు. పార్లమెంట్ సమావేశాలకు పూర్తి స్థాయిలో ఎం.పి.లు రాకపోవడం, విప్ జారీ చేసినా ట్రెజరీ బెంచీలలో బెంచీలు ఖాళీగా కనిపించడం బిజెపి అగ్రనాయత్వాన్ని అయోమయంలోకి నెట్టివేసింది. దాదాపు 50 మందికి పైగా ఎం.పి.లు ప్రధాని పనితీరుపై తీవ్ర అసంతృప్తితో వున్నారని ఆ పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే అవిశ్వాసం నెగ్గే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతుండగా, పలువురు ఎం.పి.లు చంద్రబాబుతో టచ్‌లో వున్నారనే సమాచారం అగ్రనాయత్వాన్ని కలవరానికి గురి చేసే అంశం. విశ్వాస పరీక్షకు అంగీకరించడం లేదా ఎదుర్కొనేందుకు సన్నద్ధమోకావాలని ఇప్పటికే కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన సూచనలకు కూడా మోడీ, అమిత్‌షాలు ససేమిరా అన్నట్టు చెబుతున్నారు. ఒకవేళ అవిశ్వాసం వద్దనుకుంటే చంద్రబాబుతో రాజీ ఫార్ములాకు రావడం మంచిదనే అభిప్రాయం కూడా లేకపోలేదని చెబుతున్నారు. ఇందుకు సంబంధించి రాజ్‌నాథ్‌సింగ్ మధ్యవర్తిత్వం అనివార్యమవుతుందనే అభిప్రాయం సైతం కేంద్రంలోని ముఖ్య కేబినెట్ మంత్రుల సమావేశంలో చర్చకు వచ్చినట్టు బిజెపి వర్గాల కథనం. రాజ్‌నాథ్ అయితేనే చంద్రబాబును ఒప్పిస్తారని, బాబు అడిగిన హామీలను నెరవేర్చడంతో పాటు ఆందోళనను విరమింపజేసేందుకు మార్గం సుగమం అవుతుందనే దిశగా చర్చ జరిగినట్టు చెబుతున్నారు. చర్చ జరిగితే ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించి అనేక వైఫల్యాలు వెలుగు చూస్తాయంటూ ముఖ్య నేతల సమావేశంలో అమిత్‌షా అభిప్రాయపడినట్టు తెలిసింది. ఆ విధంగా కాకపోయిన పక్షంలో పార్లమెంట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేయడమే శ్రేయస్కరమనే అభిప్రాయం వ్యక్తమైందని బిజెపి వర్గాలంటున్నాయి. తెలుగుదేశం అవిశ్వాస తీర్మానంపై బిజెపిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, చంద్రబాబును అనవసరంగా రెచ్చగొట్టామనే అభిప్రాయాన్ని కొందరు నేతలు వ్యక్తంచేసినట్టు చెబుతున్నారు. అవిశ్వాస తీర్మానంపై బిజెపిలో జరిగిన అంతర్మథనం ప్రకారం అవిశ్వాసం తీర్మానంపై ఓటింగ్ జరిగిన పక్షంలో ఇప్పటికిప్పుడు కేవలం 302 మంది మాత్రమే ఎం.పి.లు హాజరవుతారనే అభిప్రాయం వ్యక్తమైనట్టు విశ్వసనీయవర్గాల కథనం. ఈ పరిస్థితుల్లో తీర్మానంపై చర్చ జరుగకుండా వ్యవహరించడంవైపే మొగ్గు చూపాలనే నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు.

క్రీడాప్రభ

ముక్కోణపు టీ 20 సిరీస్

నేడే ముహూర్తం

తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో కౌర్‌సేన ఢీ

ఉదయం 10 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్ చానెల్లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ముక్కోణపు టీ20 టోర్నీకి నేడు తెరలేవనుంది. ప్రారంభ మ్యాచ్‌లో భారత మహిళా జట్టు ఆస్ట్రేలియా జట్టును ఢీకొన నుంది. ఇటీవల ఆస్ట్రేలియాతో ఆడిన వన్డే సిరీస్‌లో వైట్ వాషైన భారత మహిళా క్రికెట్ జట్టు ముక్కోణపు సిరీస్‌లో తిరిగి పుంజుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందు భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించి ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 3-1 గెలుచుకొన్న ధైర్యంతోనే ఈ ముక్కోణపు సిరీస్‌లోకి భారత్ అడుగిడుతోంది. ఈ సిరీస్‌లో పాల్గొంటున్న మరో దేశం ఇంగ్లండ్. ఈ టోర్నీలో అన్ని మ్యాచ్‌లు ముంబైలోని బ్రాబోర్నీ నేషన్ స్టేడియంలో జరుగనున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాతో ఆడిన మూడు వన్డేల్లో తొలి మ్యాచ్‌కు హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యం వహించగా, రెండో, మూడో వన్డేలకు మిథాలి రాజ్ నేతృత్వం వహించింది. ఇద్దరి సారథ్యంలో క రాడా జట్టు ఆస్ట్రేలియా జట్టుపై చెప్పుకోతగ్గ పోరాట పటిమను చాటలేకపోయింది. ప్రస్తుత సిరీస్ తొలి మ్యాచ్‌లో ప్రత్యర్థి అదే జట్టు కాగా... ఫార్మాట్ మాత్రమే భిన్నం. ఇక భారత జట్టు బ్యాటింగ్‌ను పరిశీలిస్తే ఇటీవల ఆస్ట్రేలియాపై వన్డేల్లో వరుసగా అద్భుతంగా రాణించిన స్మృతి మంధాన నేటి మ్యాచ్‌లో తన దూకుడును ప్రదర్శిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. తొలి మ్యాచ్‌లో అంతగా పరుగులు చేయనప్పటికి. రెండో, మూడో మ్యాచుల్లో 67, 52 పరుగులు చేసి భారత జట్టు సాధించిన స్కోరులో కీలక భూమిక పోషించింది. ఆస్ట్రేలియా పేస్ బౌలర్లను నిలువరించాలంటే భారత ప్రధాన బ్యాట్స్‌వుమన్లు తప్పనిసరిగా రాణించాల్సిన అవసరముంది. ఇతర బ్యాట్స్‌వుమన్లలో హర్మన్ ప్రీత్‌కౌర్, మిథాలి రాజ్, ఆల్ రౌండర్ వేదా కృష్ణమూర్తి, చివరలో మెరుపులు మెరిపించే పూజా వస్త్రాకర్, జెమిమా రోడ్రిగ్స్ పూర్తి స్థాయిలో రాణిస్తే భారత్‌క ు తిరుగు ఉండదు.



బౌలింగ్‌లో జులన్, శిఖాలే కీలకం

అనుభవజ్ఞులైన జులన్ గోస్వామి, శిఖా పాండేలు భారత జట్టు బౌలింగ్‌లో కీలకం కానున్నారు. పాండే మూడు వన్డేల్లో కలిపి 4 వికెట్లు తీసి పర్వాలేదనిపించింది. మిగతా బౌలర్లలో స్పిన్నర్ పూనం, పేసర్ హర్మన్ ప్రీత్ కౌర్ కీలక సమయాల్లో అనుకున్నంతగా ఆదుకోలే కపోయారు. స్పిన్నర్ రాజేశ్వరి, పేసర్ దీప్తి శర్మలు పూర్తి స్థాయి సామర్థ్యాలను చాటాల్సి ఉంది. మొత్తానికి మరింత పదును పెంచి బౌలింగ్ దాడిని చేస్తేనే ఆస్ట్రేలియా బ్యాట్స్‌వుమన్లను చెక్ పెట్టగలదు. దక్షిణాఫ్రికాలో ఆఫ్ స్పిన్నర్ దీప్తి శర్మ, లెగ్ స్పిన్నర్ పూనం యాదవ్‌లు భారత గెలుపులో కీలక భూమిక పోషించారు. నేటి మ్యాచ్‌లో తమ బౌలింగ్‌తో ఆస్ట్రేలియాను నిలువరిస్తే భారత గెలుపు సులువే.

ఏక్తా బిస్త్ స్థానంలో రాజేశ్వరీ

భారత జట్టులో స్వల్ప మార్పు జరిగింది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఎడమ చేతి వేలికి గాయం కావడంతో ముక్కోణపు సిరీస్‌లో ఆడలేకపోవడంతో.. ఆమె స్థానంలో మరో ఎడమచేతి వాటం స్పిన్నర్ రాజేశ్వర్ గ్వైక్వాడ్‌కు జట్టులో స్థానం కల్పించారు.

ఆ రెండు జట్లు పటిష్టమైనవే : కౌర్

'టోర్నీలో పాల్గొంటున్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లతో పోలిస్తే భారత్ టీ20ల్లో బలహీనంగా ఉంది. ఈ ఫార్మాట్‌ను మేము ప్రాక్టీస్ చేస్తున్నా ము. ప్రపంచ కప్ లక్ష్యంగా ప్రతీరోజు కొత్త పద్ధతులను, మెళుకువలను నేర్చుకుంటు న్నాము. ఆ రెండు జట్లు పటిష్టమైనవి అయినప్పటికి వారికి గట్టి ప్రతిఘటన మానుంచి ఎదురవుతుంది' అని భారత జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ వ్యాఖ్యానించింది. టీ20 పొట్టి ఫార్మాట్, వందశాతం మా సామర్థ్యాన్ని చాటుతాం. మాజట్టు క్రీడాకారిణులకు కూడా ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాము అని కౌర్ బుధవారం మీడియాతో పేర్కొంది.

భారత్‌ను తక్కువ అంచనా వేయం : లానింగ్

ఈ ఫార్మాట్లో భారత్ మంచి రికార్డును కలిగివుంది. ఇంగ్లండ్‌ను కూడా తక్కువ అంచనా వేయం. మేము బాగా ఆడాలని అనుకుంటున్నాము. ఇటీవల ముగిసిన వన్డే సిరీస్‌లో లభించిన విజయం మాలో ఆత్మవి శ్వా సాన్ని పెంచింది. టీ20 అంతర్జాతీయ మ్యాచులు వేరు. చివరి నిమిషంతో ఫలితం తారుమారవుతుంది' అని ఆసీస్ కెప్టెన్ లానింగ్ అంది. మూడు జట్లలో ఏది ఉత్తమమైనది చెప్పడం కష్టం అని లానింగ్ పేర్కొంది.



ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయలేం

ఇప్పటికే భారత్‌పై వన్డే సిరీస్‌ను గెలిచి మంచి ఆత్మవి శ్వాసంతో ఉన్న ఆస్ట్రేలియా తన దూకుడును ముక్కోణపు సిరీస్‌లో కూడా కొనసాగిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. కెప్టెన్ మెగ్ లానింగ్ వన్డే సిరీస్‌లో అంతగా రాణించలేకపోయినప్పటికి ముక్కోణపు సిరీస్‌లో తన పరుగుల దాహాన్ని తీర్చుకోవడానికి ప్రయత్నిస్తుంది. వికెట్ కీపర్ అలిస్సా హీలి, నికోలి బోల్టన్, ఎల్లిసే పెర్రి, రాచెల్ హేన్స్‌లతో సహా ఆ జట్టు చివరి క్రీడాకారిణి బ్యాటింగ్‌లో భారత బౌలర్లపై దాడికి సిద్ధంగా ఉన్నారు. ఇక వారి బౌలింగ్ కూడా భారత జట్టును మించిపోయింది. భారత పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలంగా ఉండి బ్యాటింగ్‌కు ఊతమిస్తాయి. అయితే ఆస్ట్రేలియన్లు మన వ్యూహాన్ని మనకే తిప్పికొట్టి విజయం సాధించారు. ఆసీస్ స్పిన్నర్లు జెస్ జొనాస్సెన్, అమండా వెల్లింగ్‌టన్, అష్లెహ్ గార్డెనర్‌లను భారత్ బ్యాట్స్‌వుమన్లు దీటుగా ఎదుర్కొంటేనే నేటి మ్యాచ్‌పై భారత విజయావకాశాలు మెరుగుపడతాయి.

జట్లు: భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్) మిథాలి రాజ్, వేదా కృష్ణమూర్తి,జెమీమా రోడ్రిగ్స్, ఆంజు పాటిల్, దీప్తి శర్మ, తానియా బాటియా(వికెట్ కీపర్), పూనం యాదవ్, రాజేశ్వరీ గ్వైక్వాడ్, జులన్ గోస్వామి, శిఖా పాండే, పూజా వస్త్రాకర్, రుమేలి ధార్, మోనా మేశ్రమ్.

ఆస్ట్రేలియా: మెగ్ లానింగ్(కెప్టెన్, రాచెల్ హేన్స్(వైస్ కెప్టెన్), నికోలా కేరి, ఆశ్లేహ్ గార్డనెర్, అలీస్సా హీలి, జెస్ జోనాస్సెన్, డెలిస్సా కిమిన్సి, సోఫీ మోలినెక్స్, బెత్ మూనె, ఎలిస్సె పెర్రీ, మేగన్ షుట్, నవోమి స్టాలెన్‌బెర్గ్, ఎలిసె విలాని, అమండా జేడ్ వెల్లింగ్టన్

రబాడాపై నిషేధం ఎత్తివేత తప్పు

- విచారణలో నా అభిప్రాయాలు తెలసు కోలేదు
- ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పేసర్ రబాడాపై విధించిన రెండు మ్యాచుల నిషేధాన్ని ఐసీసీ ఎత్తి వేయటాన్ని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ తప్పు పట్టారు. నిషేధం ఎత్తివేతకు ముందు ఐసీసీ విచారణ కమిటీ తనను కూడా విచారించాల్సి ఉండాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. సఫారీలతో మూడో టెస్టు నేడు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం స్మిత్ మీడియాతో మాట్లాడాడు. ఇసుకలో గీసిన గీత మాదిరిగా ఈ వ్యవహారం కొనసాగిందని, ఐసీసీ తీరును తప్పుబట్టారు. విచారణ కమిటీ రబాడా అప్పీల్‌ను విచారించిన సమయంలో తన అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవాల్సి ఉండాల్సిందన్నాడు. రెండో టెస్టులో స్మిత్ వికెట్‌ను తీసిన అనంతరం రబాడా తన భుజంతో స్మిత్‌ను ఢీకొట్టాడు. దీనిపై సీరియస్‌గా స్పందించిన ఐసీసీ తర్వాత రెండు టెస్టుల నిషేధాన్ని మ్యాచు ఫీజులో కోతను రబాడాపై విధించింది. రబాడా తాను తప్పు చేయలేదని ఐసీసీకి తిరిగి అప్పీల్ చేసుకున్నాడు. అప్పీల్‌ను విచారించిన ఐసీసీ రబాడాపై నిషేధాన్ని ఎత్తి వేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఐసీసీ నిర్ణీత ప్రమాణాలతో పనిచేస్తోంది. ఆ ప్రమాణాల అమలుకు ఐసీసీ కట్టుబడాలి అని స్మిత్ అన్నాడు. వీడియోలో తనను భౌతికంగా ఢీకొన్న తీరు స్పష్టంగా కన్పిస్తోందన్నాడు.

ఐపీఎల్‌లో డీఆర్ఎస్

- ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా

ముంబై: టీ20 అంతర్జాతీయ మ్యాచుల్లో డీఆర్ఎస్ (అంపైర్ నిర్ణయంపై సమీక్ష జరిపే పద్ధతి)ని ఈ ఏడాది జరిగే ఐపీఎల్‌లో కూడా ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు వివరాలను ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా బుధవారం మీడియాతో జరిపిన భేటీలో వెల్లడించారు. మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయాన్ని ఏ జట్టయినా సవాలు చేస్తే టీవీ రిప్లె వ్యవస్థ ద్వారా ధృవీకరించుకోవచ్చని ఆయన తెలిపాడు. టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఇన్నింగ్స్‌ల్లో ప్రతీ జట్టుకు ఒక మారు అంపైర్ నిర్ణయం సవాలు చేయడానికి అవకాశం ఉంటుంది. ఇదే తీరును ఐపీఎల్‌లో కూడా అమలు చేయనున్నారు. టీ20 లీగ్, టాటా నెక్సాన్‌తో కలిసి మూడేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకొందని శుక్లా ఈ సందర్భంగా చెప్పారు. ప్రతీ ఐపీఎల్ గేమ్‌లో మంచి స్ట్రైక్ రేట్‌తో నిలిచిన ఆటగాడికి రివార్డులు ఇవ్వడంతోపాటు ఓవరాల్‌గా టోర్నీలో అత్యుత్తమ స్ట్రైక్ రేట్‌తో నిలిచిన ఆటగాడికి ఒక నెక్సాన్ కారును బహూకరించనున్నారు.

షమీపై అవినీతి నిరోధక విభాగం నివేదికకోసం చూస్తున్నాం

మహ్మద్ షమీ ఐపీఎల్‌లో పాల్గొనే అవకాశాలపై శుక్లా వ్యాఖ్యానిస్తూ... బోర్డు అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్‌కుమార్ నుంచి నివేదికకోసం బీసీసీఐ ఎదురు చూస్తున్నదని పేర్కొన్నారు.

యూకీకి రెండో విజయం

మియామి: భారత ఆశా కిరణం యుకీ బాంబ్రి మియామి మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో మరో విజయం సొంతం చేసుకున్నాడు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో స్వీడన్ క్రీడాకారుడు ఎలియాస్ ఎమిర్‌ను 7-5, 6-2 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించి రెండోది చివరిదైన క్వాలిఫైయింగ్ రౌండ్‌ను అధిగమించాడు. ప్రపంచ ర్యాకర్ 133 ఎమిర్‌తో తలపడటం ఇది రెండో సారి. మొదటి సారి 2015 ఆఫ్టోస్‌లో ఎమిర్‌తో తలపడి ఓటమి చెందాడు. భారత డేవిస్ కప్ అందుకున్న వాడిలో ఒకడుగా ఉన్న యుకీ, ప్రతిష్ఠాత్మక ఇండియన్ వెల్స్‌కు అర్హత సాధించి ప్రపంచ ర్యాంకర్ 12. ల్యూకాస్ పౌవుల్లేను ఖంగు తినిపించాడు. మియామి టోర్నీలో తదుపరి మ్యాచ్‌కు యుకీకి అనుకూలంగా డ్రా వెలువడింది. ప్రపంచ ర్యాంకు 75 క్రీడాకారుడు మీర్జా బాసిక్‌తో యుకీ తలపడనున్నాడు. ఈ రౌండ్‌ను యుకీ దాటగలిగితే.. యుకీ ప్రపంచ ర్యాంకు 11 క్రీడాకారుడు, ఎనిమిదో సీడ్ అమెరికన్ జాక్ సాక్‌ను ఢీకొనాల్సి ఉంటుంది.

సింగిల్స్‌లో భారత తరపున బరిలో ఉన్న ఒక ఒక్క ఆటగాడు యుకీ బాంబ్రి. డబుల్స్‌లో రోహన్ బోపన్న, ఎడ్వర్డ్ వస్సెలిన్(రష్యా) జోడి, ఆడ్రియన్ మన్నారినో (ఫ్రాన్స్), డేనియల్ మెదదేవ్(రష్యా)లతో తలపడనున్నారు.

టెస్టుల్లో కోహ్లీకి పుజారా తీసిపోడు

కోల్‌కతా: ప్రస్తుతం భారత క్రికెట్లో విరాట్ కోహ్లీ ఎంతో ప్రాముఖ్య మున్న ఆటగా డని, అదేవిధ ంగా చటేశ్వర్ పూజారా కూడా అంతే ము ఖ్యమైన ఆటగా డని మాజీ భారత కెప్టెన్ సౌరవ్ గంగూలి అన్నాడు. ' విరాట్ కోహ్లీ రికార్డుతో పోలిస్తే పూజారా రికార్డు కూడా తీసి పారేయలేమన్నాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.